# లేఖాయణం

ఉమ యేలూరి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 106

# కౌముది లో ప్రచురితమైన లేఖాపరంపర

రచయిత్రి: ఉమ యేలూరి

# విషయసూచిక


| ఏడాది | నెల | పేరు | పేజి |
|---|---|---|---|
| 2009 | 06 | నాన్నకు నివాళి | 3 |
| | 07 | – | 6 |
| | 08 | స్వేచ్ఛాభిలాషులు | 9 |
| | 09 | మారిన విలువలు | 12 |
| | 10 | పరిచయమయ్యే ప్రేమలేఖ | 15 |
| | 11 | అక్కా అంతేనంటావా? | 18 |
| | 12 | ఒంటరి గూడు | 21 |
| 2010 | 01 | హేమంతాల చేమంతులు | 24 |
| | 02 | – | 28 |
| | 03 | అంతులేని దూరం అంతమయ్యేచోటు | 32 |
| | 04 | ప్రశ్నల పరంపర సమాధానమేమిటో? | 36 |
| | 05 | పుట్టినూరు – పున్నమి నవ్వులు పులకరింతల పువ్వులూ | 40 |
| | 06 | పాత తోటల పాట కొత్త చిగురొకటి పలకరించిన వేళ | 43 |
| | 07 | బావా బాగున్నారా? | 46 |
| | 08 | పెదవి పలకని మాటొకటి | 49 |
| | 09 | కృష్ణాష్టమి | 52 |
| | 10 | దూరాభారమా? చేరువవ్వని తీరమా? | 54 |
| | 11 | బతుకు శాపమా? ఆలోచనల లోపమా? | 57 |
| | 12 | విరహమే నాకో నిత్య ఉగాది | 60 |
| 2011 | 01 | కదిలిన కాలాన్ని అవలోకిస్తూ | 63 |
| | 02 | బంగారు బాల్యపు క్షణమొకటి తిరిగి వొడి చేరినప్పుడు | 66 |



# లేఖాయణం

## ఉమ యేలూరి



*మనిషి మనసులోని భావాలకి ప్రతి రూపం, మనసులోని మాటలకి మరోరూపం ఉత్తరాలు. కార్డు, కవరు, ఎయిర్ మెయిల్, ఇ-మెయిల్, ఎస్.ఎం.ఎస్..ఎన్ని రూపాలు మార్చుకున్నా మనిషి ఎదురుగా చెప్పలేని భావాలకి అక్షర రూపం కల్పించడం ఒక కళ..! నెలనెలకీ కొన్ని ఉత్తరాల పరంపరని ఈ నెల నుంచీ ఈ శీర్షికలో మీరు చదువుతారు. వ్రాసేది, అందుకునేది ఎవరైనా కావొచ్చు.. అమ్మా, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, వదినా, మరదలు, బావా, నేస్తం, అనామిక, ప్రేయసి... ఎవరైనా.. ఒక్కో ఉత్తరంలో ఎన్నో భావాలు..కనిపించని కథలు, వినిపించని మౌన రాగాలు..! రచయిత్రి ఉమ గారు, 'భావన' కలం పేరుతో* **http://kristnapaksham.blogspot.com/** *బ్లాగుని కూడా వ్రాస్తున్నారు.*

### నాన్నకు నివాళులు

కాకినాడ

25/08/1995

*నాన్నా,*

నేను బాగానే ఉన్నాను....నువ్వెట్లా వున్నావు? అమ్మా, శ్రీదేవి ఇంకా చిట్టిగాడు కూడా బాగానే ఉన్నారనుకుంటున్నాను. అబ్బ ఏంటి నాన్న నీ పిచ్చి కాని ఇంకా ఈ కమ్యునికేషన్ మెరుగైన కాలంలో ఇలా పాతగా ఉత్తరాలు రాయి, విశేషాలు చెప్పు, మీ ఇంటెనకాల కుక్క బాగుందా వాటి కబుర్లు రాయనేలేదు మొన్న, మన ఇంట్లోని గేద కబుర్లు అడగవేం రా అంటు నా బుర్ర తింటావు కాని గేద కబుర్లు కుక్క కబుర్లు నాకెందుకు అయ్యా?! ఏంటీ నవ్వుకుంటున్నావా అయ్యా అన్నానని? ఏమో నాన్న నాకు మాత్రం ఇలా కాగితాల మీద ఉత్తరాలు రాసి పంపాలంటే నా చావుకొస్తోంది..........

నిన్న కాక మొన్న మా హాస్టల్‌లో నా పక్క రూం శేఖర్‌గాడు డైనింగ్ రూంలో అందరం తింటుండగా మొదలు పెట్టాడు

"వురెయ్ మీకు తెలుసా కృష్ణాగాడు ఇంకా ఇంటికి ఉత్తరాలు రాసి వాళ్ళ వాళ్ళనందరిని పేరు పేరునా పిలుపులు పిలిస్తే కాని డబ్బులు రావు..... వాళ్ళ నాన్న పేరుకు agricultural director కాని మంచి పల్లెటూరి బైతు లెక్కచేస్తాడు" అని అన్నాడు...

అందరూ నా వైపు ఎంత జాలిగా చూసారో తెలుసా నా తల కొట్టేసినట్లయ్యింది, అది చెపుదామనే వెంటనే బయటకు వచ్చి ఫోన్ చేస్తే, వివరంగా ఉత్తరంలో రాయరా కన్నా అని ఫోన్ పెట్టేసావు. ఛీ నిజంగా...... ఎందుకులే.....!?

"నువ్వు నాకు స్నేహితుడివిరా! ఎలా ఐనా రాయి ఉతరం, నేనేమి అనుకోను. ఉత్తరం విశేషాలతో రాయి చాలు" అంటావు అదేమంటే. నేను నా స్నేహితులకెవ్వరికి ఉత్తరాలే రాయను, హాయ్‌లు బైలు తప్ప, ఇంకా ఏదైనా చెప్పాలంటే ఫోన్‌లు ఉన్నాయి కదా.

ఆఁ ఇక మొదలు పెట్టకు......" technology మనం అభివృద్ధిలోకి రావటానికి ఉపయోగించుకోవాలి కాని అందుమూలంగా మన మూలాలు కదల కూడదు" అని. మీ తాత ముత్తాత అలానే అనుకుంటే అందరం తాటాకుల మీదే ఘంటాలు పెట్టి రాసుకుంటు ఉండే వాళ్ళము కదా...... ఈ కాగితాలు కనిపెట్టుడెందుకు..... ఈ సిరాలతో నలుపు చేసేదేముంది?

మళ్ళీ నేను చూడలేదనుకుంటావు మొన్న అమ్మ చీరల బీరువాలో కింద అరలో జాజికాయల పెట్టెలో అప్పట్లో అమ్మకు నీకు ఉత్తరం రాయటం కోసం నువ్వు కొని ఇచ్చిన గులాబి పువ్వుల letter heads& fountain pen చూసేనులే. శ్రీ చూపించింది... అది ఎప్పుడో చూసిందంటలే..మరి నువ్వు మాత్రం అప్పట్లో ఆ high technology ను ఉపయోగించుకోలేదా....... నాన్నా! ఎప్పటికప్పుడు మనం ఉన్న చోటు నుండి ఎదగాలి. ఇంకా ఉన్నతమైన ఆలోచనలే కాదు, ఆ సుఖాలు అందుకోవటానికి పరుగెత్తాలి. కాని అలా నీకులా ఉన్న ఊళ్ళోనే ఆ ఇంటి దగ్గర రైతులకు పొలంలో పురుగుల మందుల గురించి, ఆ గుర్రపు డెక్కల నివారణా పథకాల గురించి, కొబ్బరి చెట్టుకు కొంచం నీళ్ళతో ఎక్కువ దిగుబడి గురించి చెప్పిన సోదే చెపుతు.. అలా దొడ్లో కూరగాయల పిచ్చితో శ్రీకు, అమ్మకు కూడ నీ పిచ్చి ఎక్కిస్తూ ఉంటే ఏమి ఉపయోగం చెప్పు...!?.

అసలు నువ్వు "నాకు ఉన్నది చాలు నేను చాలా సంతోషంగా ఉన్నా నేను సంపాదించినదానితో" అని 50 ఏళ్ళకే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని ఆ పల్లెటూరికి, పెళ్ళికావలసిన దాన్నీ తీసుకుని వెళ్ళి, అలా పేడపిసుక్కుంటూ ఉండటం నాకేమి నచ్చలేదు. ఐనా నువ్వు ఎప్పుడు ఎవరు చెపితే విన్నావులే! నన్ను అంటావు "కృష్ణా నువ్వేమిరా ఇలా కంప్యూటర్స్ అంటు పరుగెడుతున్నావు తల్లి నేలను పంట పొలాలను వదిలి" అంటు.....

నేను కూడా ఆ పిచ్చి agricultural MSc చేసి ఆ చెత్త ఉద్యోగం ఏదో మొదలు పెట్టాలని నీ కోరిక అనుకుంటా. నన్ను ఇలా ఏదో ఒక రోజు పడుకునే ముందు చెప్పుకునే మాటలలో అనేస్తావు, తీరా నువ్వు అడిగాక నేను కాదనలేక చదవాలేమో అని ఇంటర్‌లో ఉండగానే భయపడి అమ్మ దగ్గర రోజు ఏడ్చే వాడిని "నాకు అందరికిలా కంప్యూటర్ నేర్చుకుని అమెరికా వెళ్ళిపోవాలనుందే" అని.

ఇంకా ఎంతలే నాన్నా 2 సంవత్సరాలు చూడు... నేను Mtech కూడా పూర్తి చేసినా నా VLSE Designing తోనే Phd కూడా చెయ్యటానికి అమెరికా వెళ్ళిపోతాను. ఇంక నువ్వు అమ్మ కలిసి ప్రతి నెలా ఒకటో తారీకున వేసే పంచవర్ష ప్రణాళికకు తోడుగా వేసే monthly budgets వేయనక్కర్లేదు...హాయిగా ఎప్పుడు ఎంత కావాలంటే అంత ఖర్చుపెట్టుకోవటమే..! ఏది కావాలంటే అది కొనుక్కోవటమే..!!

నాన్న నీకేమి తెలియదు. అంతా తెలుసనుకుంటావు బావిలో కప్పల్లే......చాలా రాసాను కాని, ఈ నెల కొంచెం పుస్తకాలు ఎక్కువ కొనాల్సి వచ్చేట్లు ఉంది ఇంకో రెండొందల రూపాయలు ఎక్కువ పంపించు. ఉండనా మరి అమ్మను, శ్రీని, చిట్టిగాడిని అడిగాను అని చెప్పు. మొన్న చిట్టిగాడు మెళ్ళో గంటతో దొడ్డి అంతా పరుగెడుతు నీ చిక్కుడు పాదుల దగ్గరకు వస్తే నువ్వు కంగారు పడ్డట్లు కలొచ్చింది....... సరే మరి ఉండనా

*ప్రేమతో,*

*నీ కొడుకు*

*కృష్ణ*

06/12/09

బోస్టన్.

*నాన్నా,*

నాలుగు వసంతాలు దరిదాపులలోకి పరుగెత్తి వచ్చాక, ప్రతి రోజు నాన్న అని పిలిపించుకోవటమే కాని, నాన్నా అని పిలవటం మనసుకు తప్ప నాలుకకు అలవాటు పోయిన ఈ రోజు నిన్ను నాన్నా అని మళ్ళీ మళ్ళీ పిలిచి, ఆగక సాగే అనంత యాత్రలోని ఘోషను

నీతో చాలా చాలా పంచుకోవాలని ఉంది. వింటావా నాన్నా? నాకు తెలుసు నువ్వు ఎక్కడ ఉన్నా నీ ప్రేమ నాతో సాగె నా గుండె చప్పుడుతో కలిసి అందులోని స్పందనలను అర్ధం చేసుకుంటుందనుకుంటున్నాను. మరి నువ్వు నాకు నాన్నవు కదా......... తెలివి తక్కువ ఆలోచనలతో అర్ధంలేని ఆవేశాలతో బాధ పెట్టి, కలత పెట్టినప్పుడే క్షమించావు.

కిందటిసారి అమ్మ కూడా నీ దగ్గరకు వచ్చాక, ఇంక ఆ ఇల్లు.. అందులోని అనుబంధాలను ఆఖరి సారిగా పలకరిస్తూ, అన్నీ సర్దుతూ శ్రీ "అన్నయ్యా..! నువ్వు నాన్న రాసుకున్న ఉత్తరాలు" అని ఇస్తే అన్ని పనులు మానేసి ఎంతో సేపు ఆ ఉత్తరాలను చదువుతూ నా ఉనికినే.. ఊహు.. కాదు నా ఊపిరినే మర్చి చదివినప్పుడే అర్ధం ఐంది పూర్తిగా...... నువ్వు ఎందుకు ఉత్తరాలు రాయమన్నావో! (సిద్ధార్ధ దగ్గర నుంచి వాళ్ళ టీచర్ రాయించి పంపించిన మొదటి ఉత్తరం, అందులో వాడికి మా మీద ఉన్న ప్రేమ, వాడి స్నేహితుల తోటి సంబరాలనూ ఆ చిట్టి చిట్టి వంకర టింకర అక్షరాలలో కూర్చి పంపినప్పుడే మొదటిసారిగా నీ పితృత్వపు ఆనందపు ఆనవాళ్ళు నాకూ అనుభవమయ్యాయిలే.)

నా అజ్ఞానం నీ అనుభవం కలిపి రాసిన ఆ ఉత్తరాల నిండా ఎన్ని ఆలోచనలు ఎన్నెన్ని అనుభవాల పరంపరలు పరిమళాలు.... సిద్ధార్ధ వచ్చి dad where have you gone? why r u crying? అని కుదుపుతుంటే అర్ధం అయ్యింది జీవితాల అనుభవాలు బాధ తోనే కాదు ఆనందంతో కూడా కన్నీళ్ళ ధారలను రప్పిస్తాయి అని. వాడికి చెపితే, ఓ తాతయ్య కూడా నీతో letter writing practice చేయించారన్నమాట మా elementray school teacher Rosemary లాగా అన్నాడు.

ఎంత అనుభవరాహిత్యం నా ఉత్తరాల నిండా.! అంతా నాకే తెలుసనే నా మిడిసిపాటు... నిన్ను చాలానే బాధపెట్టి ఉంటాను కదు.! నీ భావాలను నా మీద రుద్దనట్లే నీ భంగపాటుని నా అభివృద్ధికి ఆటంకం కాకుండా దాచుకుని ఉంటావు. ఇంత దూరం వచ్చి వెనక్కి చూసుకుంటే అర్ధం అవుతోంది నాకు.. అది అభివృద్ధి కాదు ఆలోచనా రాహిత్యం, తల తిక్కతనం..! ఏమి సాధించాము మీరు సాధించింది మేము!? ఇంతలా పరుగులెత్తి సాధించినది.... అశాంతి.........ఆరాటం తప్ప. మొన్నీ మధ్య లక్ష్మి మాటలలో "సోనా మసూరీ మరీ పెరిగిపోయాయి కృష్ణా! ఆలోచిస్తున్నా మన లోకల్ స్టోర్ బియ్యం చాలవా" అని అంటే, అనిపించింది ఏమి సాధించాను నేను మీ నెలసరి budget ను మించి అని!? సాధించింది ఏమీ లేక పోయినా ఆ ఎదుగుదలలో (అనుకున్న ఎదుగుదలలో) కోల్పోయింది చాలానే ఉంది. ఆఖరి రోజులలో మీతో గడపలేని కాలం.. మీతో ఆ వయసులో కూడా పరుగులు పెట్టించి ఇక్కడ ఇమడలేక మా మీది ప్రేమ చంపుకోలేక మీరు సతమతమవుతుంటే, అర్ధం కానట్లు.. అసలు ఆ పర్వమే మన జీవితాలలో లేనట్లు నటించి మిమ్మలను పెట్టిన ఇబ్బందులు.......తల్చుకుంటే చాలానే ఉన్నాయి..!

నాన్నా ఈ విషవలయాన్ని మేము ఛేదించగలమంటావా? ఒక అందమైన ఆరోగ్యమైన భవిష్యత్తుని నా పిల్లలకు, వాళ్ళు వాళ్ళ పిల్లలకు అందివ్వగలమంటారా? తెలియని తనంతో నేను ఛేదించిన ఆ వలయాన్ని మళ్ళీ నా తరువాతి తరాలు పూర్తి చేయగలరంటావా? వాళ్ళను ఆ దిశగా మేము నడపగలమా? జీవితంలో దేనికి విలువ నివ్వాలో, దేనిని వెనక్కి నెట్టాలో వాళ్ళకు చిన్నప్పుడే వాళ్ళను నొప్పించకుండా నేర్పగలమంటారా? మీరు మీ వంటి మీ తరం వాళ్ళందరి దీవెనల బలం మాకు తోడుంటే తప్పక సాధించగలం. దీవించు నాన్నా.. నీ అమృత హస్తంతో! ఎన్నో చాళ్ళను నాగళ్ళతో సారవంతం చేసిన నీ చేత్తో దాటెయ్యగలం దూరం ఎన్ని యోజనాలయినా!!

*అశ్రునయనాలతో*

*నీ వారసుడు*

*కృష్ణ*






విజయవాడ,

29/06/86

నా శ్రీమతికి.

చూసావా నా మతికి ఒక శ్రీను చుట్టి నీకు బహుమతిగా ఇచ్చేసాను శ్రీమతి అని..

నీ మతి లేని భర్తలుంగారు వ్రాయునది... (అలా కళ్ళతో వెక్కిరించకోయ్ ఏ మనిషికైనా అవతలి అవతలి వాళ్ళు ఇచ్చే గౌరవం, అధికారం తీసుకోవటం చాలా బాగుంటుంది... భార్య తనకు అప్పణంగా ఇచ్చే అధికారం, ఆయాచితంగా పెళ్ళి అనే బంధంతో తీసుకోవటం ఇంకా బాగుంటుంది. అలా ఇస్తున్నావు కదా అందుకే ఇలా సంబోధించుకున్నా)

ఆషాఢం తరువాత శ్రావణం.. అబ్బో బహు అందం.. అందుకే అవసరం ఈ విరహం.. అని అర్ధంలేకుండా ఈ నవీన కవులు పుంఖాను పుంఖాలుగా వర్ణించి పారేసి, ఆధునిక కాల్పనిక దర్శకులు చిత్రరాజములు తీసి మనమీదకు తోస్తుంటే, తెలియని తనంతో నిజమనుకున్నందుకు నీ దగ్గరకు వచ్చి, నువ్వు ఇచ్చే ఏ శిక్ష అయినా భరించటానికి సిద్ధంగా ఉన్నాను.....

ఈ భార్యా భర్తల హోదాలో ఆషాఢం వచ్చి ఇలా దూరం పెంచుతుందంటే ఆషాఢమే లేని గాంధర్వ లోకంలోకి తీసుకుని వెళ్ళి పరిణయమాడే వాడిని కదా చెలి.! చూశావా మా అను వాళ్ళ నాన్నగారు అన్నట్లు "కలలో కూడా మట్టి ముంతేనా" అని, గాంధర్వలోకంలో కూడా పరిణయమాడాలేమిటి.... ఆ లైసెన్స్ ఉండాలా కలిసి కదిలే మనుగడకు!? అసలు గాంధర్వ లోకంలో ఆషాఢ ముండదు అని నమ్మకం ఏమిటిరా? ఎవరైనా ఏ పురాణాలలో కాని గాంధర్వలోకాలలో కూడా తిథులు, మాసాలు ఉంటాయని చెప్పారేమో మీ రాక్షసి నాయనమ్మను కనుక్కో. ఉంటే అక్కడకు కూడా వచ్చి ఇలాంటి వెధవ రూల్ ఏదో పెడుతుంది ఆవిడ. ఐనా నువ్వేమి తక్కువా!? అణకువగా మా అమ్మ చెప్పిందని మీ బామ్మ అందని, జీవితాలకు ఉపయోగపడే పని చేయకుండా రోజంతా ఆ పూజలేమిటో, రాత్రికి నాకు ఉపవాసమెందుకో!? సరేకాని.... కర్మ సిద్ధాంతం నాదైతే, భక్తి సిద్ధాంతం నీది.... హ్మ్..!

ఏమిటోరా ఏమి తోచటం లేదు. కాలం కదలటం లేదు. నువ్వుంటే సాయింత్రమైతే కాలానికి పంచకల్యాణి రెక్కలొచ్చేవా!? ఇప్పుడేమో కాలాన్ని ఎవరో గుప్పిట బిగించేసారేమో కదలటమే లేదు అనిపిస్తోంది. నిన్న సాయింత్రం ఇంటికి వచ్చేసరికి ఏదైనా మాజిక్ జరిగి నువ్వు మన బెడ్ రూంలో రాకింగ్ చైర్‌లో, ఆ ఊదా రంగు చీరలో, తలలోని జాజుల మాలను మునివేళ్ళతో తిప్పుతు పుస్తకం

చదువుతూ కనపడతావేమో అని ఎంత ఆశగా వచ్చి చూసానో! ఏమిటో అలాంటి మాజిక్‌లు పుస్తకాలలో తప్ప నిజ జీవితంలో జరగవనుకుంటా, రాత్రి నిద్రపోతున్నా ఎప్పుడో చెవి మీద నీ మునిపళ్ళ స్పర్శ గిల్లుతు "కృష్ణం కలయ సఖి సుందరం" అని గుస గుసలాడుతు పాడినట్లే ఉందిరా! అది స్పర్శ బలమో లేక ప్రేమ మహిమో మరి ఇంక మిగతా రాత్రి అంతా జాగారమే.

రాత్రి అలానే నిద్రపట్టక ఆలోచిస్తూ అనుకున్నా. నేను ఎప్పుడూ ప్రేమించి పెళ్ళి చేసుకోవాలి అనుకునేవాడిని. ప్రేమించకుండా, ఎవ్వరో.. ఎలాంటి వాళ్ళో తెలియకుండా ఎలా మొదలు పెడతాము జీవితం అని. కాని దురదృష్టవశాత్తు ఎప్పుడు అంత టైం దొరకలేదు. ప్రేమిద్దామనుకునే సరికి పిల్ల దొరకలేదు. అమ్మకేమో ఆగేంత తీరిక దొరక లేదు. ఇదుగో ఇలా నా పక్కన నువ్వు. కానీ ఇప్పుడిప్పుడే అర్ధం అవుతోంది, నాది ఎంత మంచి ఆలోచనో! నిన్నే నేను పెళ్ళికి ముందు కలుసుకుని ఉంటే, నీ సున్నితమైన మనసు నీ అవధులు లేని ప్రేమ నాదవటం కోసం నే పాట్లు పడితే, ఆ పాట్ల ఫలితంగా నా చిన్నారి అపరంజి నాదై.. నాప్రేమైవుంటే!? ఇంకా ఎన్నెన్నో అద్భుతమైన ప్రేమ పరిమళాలు మన జీవిత కదంబంలో తోడయ్యేవి కదా అని! అబ్బ ఆశకు అంతులేదంటావా?

అంత ఆశ ఎందుకులే, వెళ్ళేవు, ఇంతవరకూ ఉత్తరం రాసావా? ఫోన్ చేసావా? ఈ రోజు పొద్దుటే చేరావు కదా ఒక్క ఉత్తరమైనా రాయలేదు. ఒక్క ఫోన్ కూడా చెయ్యలేదు! మీవాళ్ళను చూస్తే ఇంక వీడేమి గుర్తుకువస్తాడులే.

ప్చ్.. నా దురదృష్టం కాకపోతే మీనాన్నకు ఇప్పుడే ఆ ఢిల్లో బదిలీ అయ్యి అక్కడికి వెళ్ళాలా!? నాకేమో ఈ హాస్పిటల్ పని ఇంత వత్తిడిగా ఉండాలా? ఇంకా 3వారాల 4 రోజులు అంటే 25 రోజులు... అంటే 600 గంటలు.. అంటే 36000 నిమిషాలు... అంటే 2160000 సెకండ్స్... ఎలా రా చిన్నా!? పోని ఒక పని చెయ్యి. హఠాత్తుగా చాలా జబ్బు చేసింది.. గుండె సరిగా కొట్టుకోవటం లేదు... ఊపిరి ఆడటం లేదు... నాలిక పిడచ కట్టుకుపోతోంది అని చెప్పు. బయలుదేరే ముందే అలా ఉంది అనే కదా చెప్పావు, అదే మీ వాళ్ళకు చెప్పు.. నేను వెంటనే మొగుడు ఇంత పెద్ద కార్డియాలజిస్ట్ అయ్యి ఉండి చూడకపోవటమా అని ఆ వంక పెట్టుకుని వచ్చేస్తాను.!

బాగోలేదా ఐడియా? బాగోలేకపోతే బాగోలేదు అని చెప్పాలి. భార్యారత్నం..! అంతలా తుళ్ళి తుళ్ళి నవ్వకు నాకు వెక్కిళ్ళొచ్చేస్తున్నాయి మరి.

ఇంక కష్టపడాలి నిద్రకోసం.. మళ్ళీ రేపు ఎల్లుండి నూజివీడు దగ్గర మెడికల్ కేంప్ ఉంది. ఏమిటోరా కొందరికి ధనదారిద్ర్యం. కొందరికి మనో దారిద్ర్యం, కొందరికి భావ దారిద్ర్యం, కొందరికేమో భార్య ఉండి భార్యా దారిద్ర్యం.. నీ తలపుల వలపుల్లో చెలినే! సదా ఒక ప్రేమ పిపాసినే!!

నీ కనుల కొలుకుల్లో నేనెప్పుడు నీ ప్రతిరూపాన్నే!

నీ గుండెలోతుల్లో మరెప్పుడూ... ప్రేమ ఖైదినే.!

ఇప్పటికి మాత్రం నీ చేతులలో మెలగబోయే అదృష్టానికి నోచుకోబోతున్న ఈ కాగితాన్ని ఈర్ష్యాసూయలతో పరికిస్తున్న విరహబాధితుడినే..

ఉండనా మరి.

ప్రేమతో,

అపరంజి పక్కన నీలిమేఘం

నీ నల్లనోడు...

✡ ✡ ✡

రాజధాని,

01/07/86

"శ్రీ"వారికి,

మీ మతిని మాత్రం నా దగ్గర ఉంచుకుని "శ్రీ" ను తిరిగి పంపించేస్తునా.

ఆషాఢ భూతం మన మధ్య శారీరక దూరం పెంచగలిగిందే కాని మానసిక దూరాన్ని కాదుగా. రెప్ప వాల్చండి మీ కనురెప్పల మాటున నేను, కనుమూసిన కునుకై. నన్నల్లుకున్న మీరు... వేరు ఎలా అవుతాము!?

అంత నెపమా నా మీద...!!! "నువ్వు ఊపిరి పీల్చటం మర్చిపోయావు... నీ గుండె కొట్టుకోవటం ఆపావు" అని అభియోగం మోపినట్లు ఉంది మీరు నాపైన వేసిన అపవాదు వింటే. నేను మిమ్ములను మర్చిపోయేనా మా వాళ్ళనందరిని చూడగానే! "మా వాళ్ళ" లిస్ట్‌లో మొదటగా వచ్చేది నావాడివి నువ్వేగా. ఎలా మర్చిపోతాను!? మీరు రోజు నాతో పోట్లాడి "మీరు" ఏమిటి పరాయివాడిలా నువ్వు అనమన్నప్పుడు కలిగే బిడియమే, నెరుకే ఆపింది నన్ను, ఇంటికి రాగానే ముందుగా మీకు ఉత్తరం రాయకుండా...

ఎందుకలాగా అని అలగకండి అల్లరి కృష్ణయ్యా! కృష్ణయ్య ఊపిరి వదిలిన మాధురులతో వేణుగానం పలకగలదు కాని, తనంత తానై మోగగలదా? మ్రోగినా ఆ గానానికి విలువ ఉంటుందా? మీ నుంచి లేఖ రాకుండా నేను రాసే జాబైనా అంతే. కోపగించకోయి చిన్ని కన్నా... వలపులిస్తా... వెన్నంటి వయసునిస్తా! చాలదంటే గుండెగదిలోన మారుమోగే వలపుల అగరు దీపాల ఆరతి రాత్రికిస్తా!! చాలా ... కోపం పోయిందా? నవ్వాలి మరి. మీరు నవ్వకుండా ఎవరో పేషెంట్‌ను పలకరిస్తే అతను ఆ తరువాత ఎంత వైద్యం చేయించుకున్నా జబ్బు తగ్గనే లేదట. మొన్న మీ హాస్పిటల్‌కు వచ్చినప్పుడు నర్స్‌లు చెప్పుకుంటుంటే విన్నా. కృష్ణా, ఇక్కడకు వచ్చిన క్షణం నుంచి అనిపిస్తోంది.. ఏమిచ్చి దేవుడికి పొందగలిగేను ఇంత మంచి సహచరుడిని అని! ప్రేమించి పెళ్ళి చేసుకుందామనుకున్నారా? అపుడూ నా స్థానంలో వేరే అమ్మాయి ఉండేదేమో!? ఎందుకంటే మిమ్మలను ప్రేమించి, మీ అల్లరిని భరించి (ముద్దుగా నేలే) మీతో కలిసి తిరగగల అనుభవం, అదృష్టాన్ని మా అమ్మా నాన్నలు నాకు ఇచ్చేవారా అంటే అనుమానమే!? కాదేమో ఖచ్చితమే... ఇచ్చేవారు కాదు... అమ్మో నేను కాకుండా ఇంకో అమ్మాయా ఆ ఆలోచనే, హేమంతాన మంచుకు వణికి రాలే ఆకల్లే మనస్సుని కుదిపేస్తోంది. మరుక్షణమే యశోదగా మారి నా కృష్ణుడిని కట్టెయ్యాలనిపిస్తోంది. యశోదగా మారి రోటికి కట్టినా, రాధగా మారి వలపుతో ఆకట్టినా... రుక్మిణిగా మారి భక్తితో జోకొట్టినా.... అన్నిటి అంతరార్థం, అంతఃసూత్రం ప్రేమే కదా కాదంటారా?

ఇలా ఇంటిలోకి అడుగుపెట్టి అమ్మ అడిగిన ప్రశ్నలకు సమాధానం పూర్తికూడా చెయ్యలేదు నాన్నగారు, "అపర్ణా అల్లుడిగారి ఫోన్" అని పిలుస్తుంటే అందరి కళ్ళలో కదిలిన నవ్వు చూస్తే ఎంత సిగ్గు! అంతలోనే ఎంత గర్వమనిపించిందో తెలుసా? ఇందాక భోజనాల దగ్గర "ఏంటమ్మా అలా చిక్కిపోయావు? " అని అమ్మ ప్రేమగా అడుగుతుంటే, వదిన కన్ను మలిపి, "సరిగా నిద్ర ఉండటం లేదేమో, అదే ప్రయాణం హడావుడిలో" అని అన్నయ్యవైపు తిరిగి నవ్వుతుంటే, ఆ నిద్రలేమికి కారణమైన మీ మీద చాలానే కోపం వచ్చింది. కాని మరి ఆ నిద్రలేమి అలవాటు అయ్యో ఏమో మరి, రాత్రులు నిద్రరావడం లేదు నాకు కూడా మీకు లానే!

ఈసరికే నూజివీడు కేంప్‌లో ఉండి ఉంటారు కదు... కృష్ణా నాకు మిమ్మలను తలుచుకుంటే ప్రేమతోపాటు గర్వంగా కూడా ఉంటుంది తెలుసా...

"ఉన్నవాడికి వెండి పళ్ళెంలో విందుపెట్టటం కాదు, లేనివాడికి విస్తరిలో ఒక కూరతో అన్నం పెట్టటం తృప్తి. మనకున్న విద్య మనకు ధనాన్ని సంపాదించి పెట్టటం మనకు ఉపయోగపడటం. కాని మనవిద్య ప్రయోజనం ఆశించకుండా నిండు జీవితాలను కాపాడటానికి ఉపయోగపడటం విద్యకు పరమార్థం" అని నిర్వచించి వాటిని ఆచరించే ఒక అద్భుతం నా సహవాసిగా సహచరుడిగా నాకు లభించటం.... ఈ అపురూప వరం మళ్ళీ మళ్ళీ ఎప్పటికి నా సొంతం కావాలని కోరుకుంటూ అయ్యగారి నుంచి ఈ క్షణానికి కాగితం మీద సెలవు తీసుకుంటు, తలపులలోకి ఆహ్వానిస్తూ

మీ - అందాలగని - అపర్ణ (సంతోషంగా ఉందా!? మీరడిగిన సంతకం పెట్టాను)

✡ ✡ ✡






## స్వేచ్ఛాభిలాషులు

**శేఖరం,**

అలసి ఆగిన పాదం కదలనని మొరాయించే ఈ వయసులో, 'క్షేమమా? ' అంటే 'ఇంకా బతికే వున్నావా? ' అని అడగటం అని- మొన్న కలిసినప్పుడు మూర్తి అన్నప్పటినుంచి ఎవ్వరిని ఐనా 'క్షేమమా? ' అని అడగాలంటే బాధగా ఉందిరా. కాలధర్మాన్ని ఎదిరించాలని కాదు.... ఎదిరించాలని కూడా లేదు. ఈ వైపరీత్యాలను చూడాలని ఎవరికి మాత్రం ఉంటుందిలే. ఎలా నడిపిస్తోంది జీవితం నిన్ను...? పరుగెత్తే జలపాతం దూకి దూకి, పిల్ల కాలువలను మహా వేగంగా తనలో కలుపుకుని, నదిగా మారి తన ప్రశాంత పయనం సాగించి, అనంత సాగర కెరటాల హోరులో దాని వెనక విలీనమయ్యే మౌనముద్రలా మిగిలిపోవటం అనే జీవిత ప్రక్రియలో ఈ ఆఖరి మజిలీలో మౌనమే ఉత్తమమనిపిస్తోంది.

ఇప్పుడే విక్రం టీవీ పెట్టాడు వాడి హోం వర్క్ ఐపోయినట్లుంది... "గుంటూరు జిల్లాలో వానలే పడలేదని, జంతుబలి, ఈశాన్య రాష్ట్రాలలో వానలతో చెరువులుగా మారిన గ్రామాలు, ఇరాక్‌లో 1930ల కార్ షో చూడటానికి పెరుగుతున్న జనాలు, అన్ని దేశాల నుంచి చేరుతున్న ప్రజలు, మోడలింగ్‌లో అవకాశం దొరికిందని ఉవ్విళ్ళూరుతున్న నలుగురు అమ్మాయిలు.. వాళ్ళకు, జుట్టుకు వేసే రంగు గురించి సమాలోచన"..... అన్నిటిని ఏమి పెద్ద తేడా లేకుండా చూస్తున్న మనం.. నవ్వుతుంటే అడుగుతున్నాడు విక్రం 'ఎందుకు తాత నవ్వుతున్నారు? ' అని ఏమి చెప్పాలో చప్పున సమాధానం దొరకలేదు కారణం ఏమిటి అంటావు? ... నువ్వే చెప్పాలి అన్నిటిని విశ్లేషిస్తావు కదా... !

ఆగస్ట్‌లోకి వచ్చేము..!!!

అవునురా శేఖరం నాకు అనుమానం వస్తోంది, ప్రతిది ప్రభుత్వం పని అని అనుకుని తప్పేదో ఒప్పేదో వాళ్ళు చెపితేకాని వినం, విన్నా ఆ తప్పును ఒప్పు ముసుగులోకి ఎలా తేవాలా అని ఆలోచించే మేధావి వర్గం. అంతకు మించి, చాలా మటుకు మర్చిపోయిన స్వతంత్రత... బానిసత్వం... ఆశలకు, డబ్బులకు, పదవులకు, పెదవులకు... టీవీ వాళ్ళు, సినిమా వాళ్ళు ఇలా ఎవరో ఒకరు అనునిత్యం మనం ఎలా ఉండాలో, ఎలా తినాలో, ఏది చెయ్యాలో, ఏది గొప్పో, ఏది దిబ్బో నిర్ణయిస్తున్న ఈ కాలంలో మనకు నిజంగా స్వతంత్రం వచ్చింది అంటావా? మన కాలం నాటి స్వాతంత్రత అనే పదానికి మనం అనుకున్న అర్థం మార్చి రాయాలి అనుకోవాలా అని

అనుమానంగా ఉంది. మనం స్వాతంత్ర్యం గాఢంగా ఆకాంక్షించాము, ఆ భావన మన అణువణువులో జీర్ణించుకుందేమో అనేంతగా నమ్మాము. కాని ఇదేమిటి... ఎవరి నుంచో బానిసత్వం పోయి మనకు మనమే బానిసలం! ఇలా ఉన్నప్పుడే కదా ఆంగ్లేయులు వచ్చి దానిని అవకాశంగా తీసుకున్నారని, అప్పటి రాచరికపు ఫ్యూడలిజపు అవశేషాలను మన తాతలు గుర్తున్నంత వరకు, విన్నంతవరకు మనకు చెప్పారు. మళ్ళీ అదే పునరావృతం అవుతుందా? ఆ దుస్థితి చూడవలసి వస్తుందంటావా మనం? లాఠీ దెబ్బకు కూడా ఇంత వెరవలేదే మనం ఈ ఆలోచనకే భయం వేస్తోంది...

1947 ఆగస్ట్ నెల అంతా పరవళ్ళు తొక్కిన ఉత్సాహం, ఇక రేపో మాపో ఎగురవేయబోయే జాతీయ జెండాలు నేయించుకుని భద్రంగా గుండెలకు హత్తుకున్నప్పటి ఆ నూలు మెత్తదనం... రాబోతున్న కాలమంతా ఇక మనదే, కలిసి వేసేద్దాము ప్రగతి సోపానాలు, ఎక్కడా ఆగనే ఆగదు ఈ విజయపు బావుటా.. అని కళ్ళు తెరుచుకునే కన్న కలలు... కొత్త రాజ్యాంగంలో ఏమేమి ఉండబోతున్నాయి, దాని ఫలితాలేమిటి అని మన నాన్నలు బాబాయిలు రచ్చబండ దగ్గర కూర్చుని చేసిన ఆలోచనలు, మెలి తిప్పిన మీసం చూసి ముసి ముసిగా నవ్వి మూతి తిప్పిన మీ వదిన దరహాస చంద్రికల వెలుతురు.. అన్నీ నాకింకా నిన్నో మొన్నో జరిగినట్లు ఉందిరా శేఖరం... ఇన్ని సవరణల తరువాత కూడా సరి కాని రాజ్యాంగం, సరిచేయలేని మన భవిష్యత్తు మళ్ళీ గాంధీగారు వచ్చి కష్టపడ్డా సరికావేమో...

ఏమంటావు?

ఇంటికి పోస్ట్‌మాన్ రాగానే పైన ఏమి ఉందో కూడా చూడకుండానే ఇంటిల్లిపాది "మీకోసం పోస్ట్" అని గదిలో పెట్టేసి వెళతారు... అంత నమ్మకం ఈ ఇంట్లో నాకోసం తప్ప పోస్ట్‌మాన్ రాడు అని. మొన్న విక్రం స్కూల్ నుంచి ఆ హెడ్ మాష్టారు కూడా నాకు మల్లే పాతకాలం మనిషో ఏమో.. ఈ మెయిలో, ఆ మెయిలో.. ఏదో అది పంపకుండా, ఉత్తరం రాస్తే వీడి చదువు గురించి, పైన "విక్రం తల్లి తండ్రులకు" అని రాసి కూడా ఉంటే నా కొడుకే తీసుకు వచ్చి గదిలో ఇచ్చి వెళ్ళాడు. ఎంత అలసత్వమో చూసావా? ఇదే మూస పోసిన మనస్తత్వం అందరిలోను... నాదికాదు, నాకు లాభం లేదు అనుకుంటే దేనిని పట్టించుకోరు. నిస్వార్థం అంటే నిలకడగా చూపించే స్వార్థం అని అర్థం చెపుతారేమో ముందు ముందు తరాలకు. ప్రతిదానికి పోల్చుకుని బాధపడతావు మార్పు సహజం అని అందరు విసుక్కుంటున్నా ఈ ధోరణి మాత్రం మారటం లేదురా శేఖరం నాకు.

సరే మరి అలుక్కుపోతున్న కంటి చూపుకు ఈ మిల మిల లాడే దీపపు వెలుతురు కూడా సాయం చెయ్యలేకపోతోంది.. నీ జాబు కోసం ఎదురు చూస్తూ..

స్నేహితుడు,

క్రిష్ణయ్య వ్రాలు..

క్రిష్ణయ్యా,

క్షేమమే నేను ఇక్కడ.. నువ్వు క్షేమమని ఆశిస్తున్నా.

నీకు ఇంత వయసు వచ్చినా దూకుడు తగ్గలేదురా.! ఆవేదన, ఆవేశం సమస్యలకు పరిష్కారం కాదు. అంటే అవి లేకుండా ఉండమని కాదు అర్థం వాటిని తులనాత్మకంగా పరిశీలించి జీవితాలకు సమన్వయ పరచుకోవాలి. మార్పు మానవ సహజం. ఆ మార్పు మంచి వైపు మళ్ళాలని మన జీవితానికి దేవుడు ఉనికిని ఊపిరిని ఇచ్చినంత వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి.. ఇంక మారటం మారకపోవటం మన ఇష్టం కాదు... మనమే ఆ మార్పుకు మూల కారణమవుతామా..!? మంచిది..! కాదా..!? కానీ....! మన వెనుక మనవంటి వాళ్ళు ఎందరో పరిశ్రమిస్తూనే ఉంటారు, మంచి కోసం సమానత్వం కోసం మార్పు అనేది తరాల నుంచి యుగాల నుంచి సమాజంలో అనునిత్యం జరుగుతునే ఉంది. ఇంకా జరుగుతూనే ఉంటుంది...

ఈ మార్పు అంతా 'చెడ్డ' అని ఎందుకు అనుకుంటావు క్రిష్ణయ్యా? ఇంత పెద్ద ప్రపంచం చిన్నది ఐంది. జరుగుతున్న పనులు నిమిషాలలో అందరికి తెలుస్తున్నాయి.. ఎక్కడో దక్షణాఫ్రికాలో నెల్సన్ మండేలాను చూస్తే సంతోషం కాగటం లేదా? ఇంకెక్కడో అమెరికాలో ఆడవాళ్ళకు మొన్న మొన్నటిదాకా ఓటు హక్కేలేని దేశంలో... నల్లవాళ్ళను నడివీధులలో లాగి కొట్టిన ... కొడుతూనే ఉన్న దేశంలో... ఒక అమ్మాయి, ఒక నల్ల జాతీయుడు అత్యున్నతమైన ప్రెసిడెంట్ పదవికి పోటీ చేయటం, అందునుంచి ఒక నల్ల జాతీయుడు ఆ పదివిని అధిష్టించటం ప్రపంచానికే గర్వకారణం కాదా? ఆ విజయం మన 1947 నాటి ఒడలు చెమరించిన ఆనందాన్ని తలుపుకు తేలేదు..? అవి అన్నీ ఈ పెరిగిన సాంకేతికత మూలంగానే కదరా మనకు అంత తొందరగా సవిస్తరంగా తెలియటం జరిగింది. మన మట్నూరి క్రిష్ణారావుగారు పత్రికలో విషయ సేకరణ కోసం, దానిని బ్రతికించటం కోసం మనం పడిన ప్రయత్నం అప్పుడే మర్చిపోయావా? అప్పటికి అధి ఆధునికతే కదా...

ఇక వాటిని వక్రీకరించటం దుర్వినియోగపర్చటం ఎక్కువగానే ఉంది కాని, మనం బాధపడి ఏమి ఉపయోగం!? స్పందించగలగాలి... మనకు చేతనయినంత వరకు ప్రజాహితం కాని దేనినైనా బాధ్యతాయుతంగా శాంతియుతంగా మనం ఖండించాలి. అది పౌరుడిగా మన ధర్మం! ఎవరో మర్చి పోతే మనకేమిరా..!? గుర్తు ఉందా? మనం ఖద్దరు నేసి మల్లు గుడ్డలు కట్టి మన నాన్నల వెనుక జైజైలు కొట్టి పరుగులు తీస్తే, మన వీధి చివర మల్లయ్య మామ, అతని కొడుకు ఒక్క రోజన్నా వడ్డీలకు తిప్పటం ఆపలేదు! వాడి ఇనుప పెట్టె పగల కొట్టాలని మనం ఎన్నిసార్లు అనుకోలేదు ఆ చిన్న తనపు ఉషారులో..? వ్యవస్థలో 100 శాతం ఎప్పుడూ మారరు, అది ఎక్కడా ఎప్పుడు జరిగేపని కాదు.

నీకు ఆ వార్తలన్నీ చూసి ఎందుకు నవ్వు వచ్చిందో చెప్పనా? ఆ టీవీలో వార్తలు చదివే అమ్మాయి ఈ వార్తలన్నిటిని ఒకే భావంతో, ఒకే గొంతుతో చదివి ఉండి ఉంటుంది అవునా... భావ వ్యక్తీకరణ కూడా మరి వాళ్ళు నేర్పిన చిలకల్లేనే పలకాలి కదా.. అది ఒక రంగుల పెట్టె, దాని నుంచి మనకు కావలసిన విషయాలు తెలుసుకుంటున్నాము అంతే! ఈ తరంలోను తెలివిగల వాళ్ళు అంతవరకే, అవసరమైనంత వరకే తీసుకుని వదిలేస్తున్నారు. తెలివి తక్కువ వాళ్ళు వాటిని చూసి అనుకరించి లీనమయ్యి జీవితాలను పాడు చేసుకుంటున్నారు..

మనం చూసిన ఆ స్వతంత్రం మళ్ళీ పోగొట్టుకుంటాము అంటావా? ఏమోరా క్రిష్ణ. దీని గురించే నా ఆలోచన ఎటూ తేలటం లేదు...

అసలు ఇంకా స్వతంత్రం ఉందా? ఎప్పుడో మన ఆత్మలు డబ్బు కోసం తాకట్టు పెట్టి, ప్రపంచ నిధి నుంచి అప్పు తెచ్చి మన పసుపు, మన బియ్యం, మన వేపాకును ఇచ్చేసి తెచ్చుకున్న బర్గర్లు పిజ్జాలు... ఊపిరాడని పారిశ్రామికరణ, వదిలేసిన పల్లెలు, వెగటైన ఆ బతుకులు.! మన కోహినూర్ వజ్రంను, మన వెలకట్టలేని సంపదను ఇచ్చి తెచ్చుకున్న గుమస్తా వ్యవస్థను చూసి సంతోషపడటం లాంటిదేనేమో అనిపిస్తుంది ఒక్కోసారి. మననే కూలీలుగా పెట్టి మననే హీనం చేసి మనకోసం ఇచ్చిన రైల్వే వ్యవస్థ, బ్రిడ్జ్ లానే ఈ కొసమెరుపేమో మనకు విసిరేసే ఈ ఐటి ఉద్యోగపు కుక్క బిస్కెట్లు అని.!

మనం చూడకపోయినా మన తరువాతి తరాలు చూస్తాయిగా వీటి ఫలితాలు. మనకు చేతనయినంత వరకు మంచి చేద్దాము, మర్చిపోకు. .. మర్చిపోకు.. "సత్యమేవ జయతే.. చెడు వినకు, చూడకు మాట్లాడకు.... అహింసో పరమో ధర్మహ"... మర్చిపోకు... మనం ఒక గొప్ప నాగరికతకు ఆనవాళ్ళము, ఒక ప్రాచీన వ్యవస్థకు మిగిలిన గురుతులము... తప్పక విజయం సాధిస్తాము మంచిని నిలపెడతాము... వంద మాటలు కంటే ఒకే ఒక్క ఆచరణ గొప్ప... నమ్మకమే మనలను ముందుకు నడిపిస్తుంది...

జైహింద్.

మిత్రుడు **శేఖరం** వ్రాలు. ✡ ✡ ✡



# లేఖాయణం

## ఉమ యేలూరి



## మారిన విలువలు

**అన్నయ్య,**

ఎలా వున్నావురా..? నేను చాలా బాగున్నా (అదే నీ దృష్టిలో ఏడ్చినట్టు) :-)

అమ్మ వాళ్ళు ఎలా ఉన్నారు? నాన్న చాలా సంతోషంగానే ఉండి ఉంటాడు.. నీ దగ్గరకదా ఉంది. అమ్మకు నాన్న సంతోషం తప్ప ఏమీ అక్కర్లేదు కాబట్టి ఆమె సంతోషంగానే ఉండి ఉంటుంది. "సర్వేజనా సుఖినోభవంతు" అని ముగించెయ్యవచ్చు ఈ ఉత్తరాన్ని ఇక్కడికి, కాని నా ఈ ఉత్తరం ఉద్దేశం అదికాదు కాబట్టి ఇంకా రాస్తున్నా. అసలు రాత్రి ఫోన్ చేద్దామనుకున్నా కాని నీ దొరతనం బైట వెలగబెట్టి కొంపకు చేరే సరికి ఏ అర్థరాత్రో అవుతుంది, అప్పుడు మాట్లాడే ఓపిక నీకు ఉండదు అని ఉత్తరం రాస్తున్నా...

ఒరే అన్నయ్య గుర్తుందా మనం చిన్నప్పుడు, నాకు తొమ్మిదేళ్ళు, నీకు పదిహేను ఏళ్ళువుండి ఉంటాయి అప్పుడు, నాకు సైకిల్ నేర్పటానికి నువ్వు నీ ఫ్రెండ్ కృష్ణా ప్రయత్నిస్తున్నారు. నేను అరుస్తున్నాను.... మీమీద నేను ఆధారపడి అసలు సరిగా నేర్చుకోవటం లేదు అని ఉన్నట్లుండి వదిలేసారు నాకు చెప్పకుండా, కొంచెం సేపు అయ్యాక చూసుకుంటే మీరు లేరు దెబ్బకు భయపడి, నేను వెళ్ళి మన వీధి చివర శంకర్రావుగారి ఇంటి ముందట ముళ్ళ గోరింత పూలచెట్టు మీద పడ్డాను. నేను ఏడుస్తుంటే వచ్చి ఏమన్నావో గుర్తుందా..? 'వ్యక్తి స్వాతంత్ర్యం సాధించాలంటే ములుకు మాటలు, ముళ్ళ మార్గాలు కూడా ఉంటాయి తీసి పారెయ్యాలి కానీ ఇలా ఏడిస్తే ముళ్ళు ఇంకా నేప్పేస్తాయి' అని.. నాకు అప్పట్లో పూర్తిగా అర్థంకాక పోయినా, నీ మాట మాత్రం గుర్తువుండి పోయింది. తరువాత ఇంటికి వచ్చాక నాన్న "ఆడముండకు ఈ సైకిళ్ళు.. గోలా ఎందుకురా" అని తిడుతుంటే అంటే ఎంత రోషపడ్డావో.. నన్ను ఇంటి వెనుక బాదం చెట్టు దగ్గరకు తీసుకుని వెళ్ళి నాతో ఒట్టు పెట్టించుకున్నావు గుర్తుందా "ఎప్పటికి ఈ ఆడదాన్ని అనే బేలతనం, నా పని కాదు అనే అధైర్యత రానివ్వను నా జీవితంలో" అని, అప్పట్లో ఆ ప్రమాణంకు అర్థం ఏమిటో తెలియకపోయినా నీ కళ్ళలో నీళ్ళు చూసి ఏడుస్తూ ఒట్టు పెట్టాను.. ఇప్పుడు తలుచుకున్నా ఎంత సంతోషంగా ఉంటుందో నాకు, నీలాంటి అన్నయ్య నాకు తోడుగా ఉన్నాడు అని. అప్పుడనే కాదు పెద్ద అయ్యేదాక ఎన్నిసార్లు నాకు ఎన్ని తెలియనివి తెలియచెప్పావురా...

ఇవి అన్ని ఇప్పుడు ఎందుకు గుర్తుచేస్తున్నావు అంటావా.. "చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా.... గతమెంతో ఘనకీర్తి కలవోడా" అని పాడుకుంటానికి తప్ప ఎందుకు ఉపయోగం లేని మనకీర్తల్లే మన గత అనుభవాలు అవ్వకూడదనిపించింది....

జీవితంలో నిరాసక్తత మొదలయ్యి నిర్లిప్తత మన జీవన పదమవుతుందో, అవకాశవాదం అలవాట్లను, ఆనందాలను మింగేసి మనలను మాయావిలువలున్న లోకాన్నే శాశ్వతమని భ్రమింప చేస్తుందో నాకు తెలియదు కాని - నీ విషయంలో ఏదో అయ్యింది అని మాత్రం తెలుసు, చిన్నప్పటినుంచి నాకు తెలిసిన నా అన్నయ్య ఎక్కడా కనిపించటంలేదు... ఆ స్థానాన నాన్నకు ప్రతిరూపం (మనం ఏదైతే కాకూడదని అనుకున్నామో), డబ్బుకు మారు రూపం ఐ కనపడుతున్నావు. అమ్మకు బదులు వదిన మార్పు అంతే... అదే కథ పునరావృతం...! నువ్వు మారని నాన్నకు ప్రతి రూపమై ఆ ఇంటిపేరు నిలబెడుతున్నాను అని అనుకుంటున్నావేమో కాని ఆ మూర్ఖత్వపు ఆనవాళ్ళను పతీవ్రతా రూపంలో ధరించే అమ్మకు తరువాతి తరం వదిన అని గుర్తించలేకపోతున్నావు. *చెల్లి కళ్ళల్లో అసహాయత రానీయకూడదని ఆరాటపడిన నా అన్నయ్య, భార్య కళ్ళల్లో నీలినీడలు గుర్తించలేని గుడ్డివాడయ్యాడేమిటా అని ఆశ్చర్యంగా ఉందిరా... ఉహు... అవమానంగా ఉందిరా...*

మొదటిసారి నాలోని బలాన్ని... నా భావాలని తట్టిలేపి మార్క్సిజం నుంచి ఫెమినిజం దాకా పరిచయం చేసిన నా అన్నయ్యను ఆ ధృఢ వ్యక్తిత్వంతో మళ్ళీ చూడాలంటే, కొంప తీసి మళ్ళీ నిన్ను ఆ ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ మెట్లమీద నిలబెట్టాలా ఏమిరా? ఆలోచించు నువ్వే మరి పరిష్కారాన్ని కూడా..

*సాధన ఒక ప్రయత్నం, అర్ధవంతమైన జీవనం జీవిత సాధనకు గమ్యం. భౌతిక లాభమే సాధించటం అంటే అని జన సామాన్యం అనుకోవటం మూలంగానే కొలతలు బేరీజులు మొదలయ్యి, అర్ధం పరమార్ధం మారి, జీవితంలో అసంతృప్తి జీవిత పథమవుతోంది అని జీవితవేదాంతాన్ని నాకు పరిచయం చేసిన నా మొదటి స్నేహితుడికి ఇంత కంటే ఏమి రాయగలనురా...* ఎంతో పౌరుషంగా నిన్ను మాటల తూటాలతో బాధపెట్టాలని మొదలుపెట్టి (నాకు తెలుసు ఇప్పటికి నీ వీక్నెస్ అదే అని) నాకు తెలియకుండానే ఏడుస్తు ముగిస్తున్నా...

ఉంటాను మరి... నీ చిరకాల స్నేహితుడు, నా సహచరుడు అడుగుతున్నాడు 'ఏమయ్యింది మీ అన్న గుర్తు వచ్చాడా?' అని. చూసేవా నా బలం, బలహీనత నా అన్నే అని కృష్ణకు కూడా తెలిసిపోయింది..

ఉండనా
ప్రేమతో
**నేను.**

ఒసేయ్ పిచ్చి,

నువ్వు ఇంకా మారలేదు, ఎప్పటికీ మారవే... ఐనా నీది కాదు తప్పు, నిన్ను చిన్నదానివని గారాబం చేసి అడిగినవి అన్ని ఇచ్చి ముద్దుచేసి నెత్తికెక్కించుకున్నాను చూడు నన్ను అనుకోవాలి, అది చాలదన్నట్లు మళ్ళీ ఆ సెంటిమెంటల్ ఫూల్ గాడిని పెళ్ళి చేసుకుంటాను అంటే ఒప్పుకుని చేసాను చూడు... అది ఇంకో తప్పు. సరేకాని, చేసినదానికి నువ్వు ఏమి రాసినా వినక తప్పుతుందా..

ఏమంటావే ఐతే ఇప్పుడు... పొద్దుగూకులు డబ్బు ధ్యాసలో పడి మీ ఒదినను పట్టించుకోలేదంటావు... మీ వదిన ఏదో నాతో చాలా కష్టపడిపోతుందంటావు... అంతేనా..? ఈ తాపత్రయం అంతా ఎందుకు చెప్పు.. దానికోసం, దాని పిల్లల కోసం కాదు.... ఇంతమాత్రానికే నన్ను అంత విలన్ను చేసేస్తున్నావు.

ఇంత వయసొచ్చాక కూడా ఇంత సున్నితమైతే నిన్ను కాదు... నీ మొగుడిని అనాలి, నిన్ను ఇంకా అంత గారాబం చేసి చెడగొడుతున్నందుకు. నీకులా అర్ధరాత్రి వరకు చీకటిలో పువ్వులు చూడటం కోసం తోటలో కూర్చోవటం, తెల్లవారుఝామే, వేకువ అంచున చీకటి నురగను చూడటం కోసం సముద్రపుటొడ్డుకు పరుగెత్తటం ఇలాంటి వెర్రిమొర్రి పనులన్ని చేస్తూ కూర్చుంటే మీ ఒదిన సంతోషంగా ఉంటుందా....! అలా అని నీకు చెప్పిందా...! అది ఒక వెర్రిమాలోకం, నిన్ను చూడగానే దాని ఆనందం, నవ్వులు చూసినప్పుడే అనుకున్నా ఇలాంటివి ఏదో నూరిపోస్తున్నావు అని.

అమ్మా.... తల్లి.. దానికి లేనివి నేర్పి నా మీదకు ఉసిగొల్పమాకు.... ఏదో చిన్నప్పుడు, చదువుకునేప్పుడు ఏదో ఆలోచించాము, ఏవో మాట్లాడాము అని ఇక జీవితాంతం అలానే ఉండాలి అంటే ఎలా కుదురుతుంది చెప్పు.? పరుగెత్తి జీవితాన్ని అందుకోవాలే... అప్పుడే ఆ జీవితానికి అర్ధం... పరమార్ధం... ***పరుగెత్తి పాలు తాగలేని చవటలందరు ఇలా నిలబడి నీళ్ళు తాగటంలోని లేని ఆనందాన్ని తలుచుకుని మురుస్తూ ఉంటారు,*** ఇది ఈ కాలానికి మన వయసుకు తగిన జీవిత సిద్ధాంతం, వేదాంతం! అంతలా అన్నయ్య మాట వినే దానివైతే ఇకనైనా ఆ పిచ్చిగోల ఆపి, ఆ పనికిరాని టీచర్ ఉద్యోగం మాని పిల్లా పీచు రాకముందే గ్రూపు 2 పరీక్షలకు కూర్చుని పూర్తి చెయ్యి. తెలివంతా ఇలా ఎవరో రాసేసిన కవితల పుస్తకాలు చదవటంలో కాదు.. నీ భవిష్యత్తును నువ్వు సరిగా రాసుకోవటంలో చూపించవే పిచ్చి మొద్దు.

ఇదుగో ఇలా రాస్తుంటే తెల్లారుతుంది.. దీని బదులు కాసేపు ఏదైనా ఉపయోగపడే పని చేసుకుంటే పుణ్యం పురుషార్ధం. రేపు మళ్ళీ ఆడిటింగ్ ఉంది, ఈ సంవత్సరం మన శ్యాంగారు, లలిత అక్కవాళ్ళ ఆఫీకు కూడా వస్తాను అని చెప్పాను. అవును అమ్మ ఒకటే గోల చేస్తోంది. కిందటి వారం వెళ్ళిన దగ్గరనుంచి నువ్వు ఒక్కసారి ఫోన్ కూడా చేయలేదంట, ఇంకో నెలలో ఏదో అన్నా చెల్లెళ్ళు బట్టలు పెట్టుకోవటం... ఏదో చెయ్యాలి అట, మీ ఒదినకు చెప్పాను.. మంచి చీర తీసుకోమని వీలున్నప్పుడు రా మరి... వాడిని, కృష్ణని కూడా రమ్మను మరీ బొత్తిగా నల్లపూసైపోయాడు.. వాడికోసం మొన్న ఎక్కడో దొరికితే నవీన్ "అంపశయ్య" తీసుకున్నా.

ఉంటాను మరి.

ప్రేమతో,

***అన్నయ్య.***

✡ ✡ ✡



# లేఖాయణం
## ఉమ యేలూరి



# పరిచయమయ్యే ప్రేమలేఖ

ప్రియమైన మీకు,

నేనెవరో తెలియకుండానే మీ ముందు పరచిన ఈ పిచ్చివాడి మనసును మీరు తొక్కేస్తూ వెళ్ళిపోతారేమో నన్న బెంగే నన్ను మీ ముందు వ్యక్తపరచుకోనివ్వకుండా ఆపింది, కాని నన్ను నేను వ్యక్తపరుచుకోకుండా మీకు నేనెలా తెలుస్తాను? తెలియకపోతే నా హృదయం మీకెలా అర్థం అవుతుంది.. నా ప్రేమ మీ వెంబడి తిరిగే అనేక కోట్ల చూపులలోని ఒకటి కాదు... దానికొక రంగు, రూపం, మాధుర్యం ఉంది అది మీకోసమే పుట్టింది. మీతోనే జీవితాంతం తోడుంటుంది అని మీకెలా చెప్పాలో తెలియక సతమతమవుతూ చేసిన ఒక చిన్ని ప్రయత్నమే ఈ ఉత్తరం. నా హృదయంలోని ఒక చిన్ని భాగాన్నైనా మీ ముందు ఈ ప్రయత్నంలో పంచుకోగలిగితే చాలు...

వసంతాన్ని  ప్రకృతి అందరికి సమానంగా అందించినా, దానిని చూడగల, అనుభవించగల రసజ్ఞులకే ఆ వసంతోద్వేగం అనుభవైకమవుతుంది.. మీరూ అందరితోపాటు అందరిలానే తిరుగుతున్నా మీ ఉనికి కలిగించగల ప్రత్యేకత ప్రతి క్షణం నాకు మాత్రమే పరిమితమవుతోంది.

వాల్చిన కనురెప్పల వెనుక సాగే హిందోళం, అలవోకగా ఎత్తి చూసినప్పుడు సాగే దీపక రాగం, నవ్వినప్పుడు వినిపించిన సింధుభైరవి, కనుబొమ్మలు చిట్లించినపుడు మధ్యమంలో సాగే కల్యాణి, మీరు ఏదో ఆలోచిస్తూ దిగులుగా మార్చిన ముఖకవళికలలో పుట్టే గాంధారం.. ఇన్ని రాగాలను ఇముడ్చుకున్న మీరే ఒక కృతిలా అలవోకగా తేలివచ్చే రాగమల్లే నా మనసును దోచిన ఏ నిమిషాన్ని మీకు ప్రత్యేకంగా చెప్పగలను.. చెప్పండి! నేనే మీరై ఆ రాగాలాపనలో కరిగిపోయిన క్షణాలను చెప్పగలను కాని. మీరు నన్ను అసలు గమనించి ఐనా ఉంటారని నేను అనుకోవటం లేదు కాని నా చూపు మాత్రం అనుక్షణం మీ వెంట మీ నీడలా మీ వెనుక సాగే

నాశ్వాసలా తిరుగుతోంది.. మీకు నాకు రెండే గోడలు అడ్డం భౌతికంగా, కాని మీ మనసును నేను అందుకోవటానికి ఎంతదూరమో నాకు తెలియటం లేదు....

క్రిష్ణవేణల్లే సాగే మీ కేశాల మధ్య చిక్కిన చేమంతిని అలవోకగా తీస్తూ మీ స్నేహితురాలితో మీరు "నల్లని క్రిష్ణయ్యను బంగారు వన్నెల రాధమ్మ వదలటమే లేదే" అంటే నాకెంత ఆశ్చర్యమయ్యిందో 'అరె ఈమె నా మనస్సెలా చదివేరు? ' అని. అంతకు ముందు రోజే మీరు జారుతున్న జాజిపువ్వుని ఆపి దాని స్వస్థానానికి చేరుస్తున్నప్పుడు అనుకున్నా, "బిర బిరా సాగే క్రిష్ణమ్మ నీలికెరటం మీద మెరిసిన వెండి నురుగల్లే ఆ జాజికెంత అదృష్టమో విడకుండా ఆమెతోనే ఉంటోది కదా" అని.

ప్రతిరోజు మూసుకున్న కనురెప్పల వెనుక సాగే నా కలల రాజ్యంలో మహారాజ్ఞి సెలవడిగి కనులు తెరిచిన ఘడియ, ఆమె నా హృదయ సామ్రాజ్ఞిగా కనురెప్పల మాటు నుంచి గుండె చప్పుడుతో కలిసి నా జీవితానికొక అర్ధాన్ని, జీవన మాధుర్యాన్ని నింపుతోంది... ప్రభాతాన వినిపించే తిరుప్పవైలో గోదాదేవి కృష్ణుడికోసం పడిన తపన, ఆ కృష్ణుడి మనసులో కలిగించిన భావమేమో తెలియదు కాని ఈ కృష్ణుడి మనసులో ఆలోకించినా.. అవలోకించి మీ మీద ప్రేమ కోటానుకోట్ల నా భావాలను "ప్రేమ" అనే ఒకే పదంగా మార్చి అన్ని వేదాలను ఓంకారంలోకి ఇమడ్చగలిగిన ప్రణవనాదంలా మోగుతోందది...

వెన్నెలా, చీకటి.. మీ రూపులోని లావణ్యాన్ని, మీ కాటుక కంటి మెరుపును కలిపి గుప్పెళ్ళతో నా మీద కుమ్మరిస్తున్న ఈ క్షణం, ఇలా ఈ వెలుగు నీడలు కలిపిన కొబ్బరాకు మాటున జారగిలబడి మీకు రాసే ఈ ఉత్తరం, మీ దాకా పంపే ధైర్యం నాకెప్పుడూ వస్తుందో! మీరు అన్ని ఆఫీస్ కాగితాలలానే దీక్షగా తలవంచి చదివి తలెత్తి మీ పక్కన ఆమెతో, 'చూసేవా ఈ పిచ్చోడు ఇలా నన్ను గమనిస్తున్నాడన్నమాట నాకు తెలియకుండా. అందుకే నాకు ఈ మొగవాళ్ళంటే చిరాకు! స్త్రీకు తనదైన క్షణాలను అనేవిలేకుండా మింగేస్తారు, ఈ వీక్షణ బకాసురులు' అని కాగితాన్ని ఉండచేసి చెత్తబుట్టలో వేస్తారేమో అని ఒక భయం.. (మీరు లంచ్‌లో మీ స్నేహితులతో మొగవాడూ, వాడి ధాష్టీకం అని నిప్పులు కురిపిస్తున్నప్పుడు నేను అక్కడే మంచి నీళ్ళు తాగుతు వింటున్నా మీరు గమనించి ఉండరు)

నేను అలాంటి వాడిని కాదు అని అందరిలా చెప్పాలన్నా భయం వేస్తోంది, కాని నేస్తమా... స్నేహ హస్తమందివ్వడానికి ప్రయత్నిస్తున్న ఈ ప్రేమ పిపాసిని, మీరు మొదటే అనుమానాస్పదంగా కాకుండా, కేవలం ఒక స్నేహితుడిగా, పరిచయస్తుడిగా మీ జీవన యాత్రలో మీతోపాటు కలిసి కొన్ని క్షణాలను పంచుకునే అవకాశమిస్తే, నా ప్రేమ మిమ్మలను గెలుచుకోగలదు అనే ధైర్యంతో మనసు మీదే మూగే ఆలోచనలను వెనక్కి నెట్టి మీకు ఈ ఉత్తరం పంపిస్తున్నా... రెండు గోడల అవతల మీ హెలో కోసం ప్రతి క్షణం వెయ్యింతల భారమై వాటిని మోయలేక.. మోస్తూ.... చూస్తున్నా

ప్రస్తుతానికి

మీ స్నేహితుడు కావాలని ఆశిస్తున్న

**కృష్ణ**

క్రిష్ణా,

మీ ఉత్తరం చదవగానే నాకు కలిగిన మొదటి భావం ఆశ్చర్యం.. మీ ప్రేమ గురించి కాదు దానిని మీరు వ్యక్తపరిచిన విధానాన్ని చూసి.. ఆనంద భైరవి ఆలాపన అనంతగాంధారంలో ప్రయోగం చేస్తున్నట్లనిపించింది మీ ఉత్తరం చూస్తుంటే... ఎవరికైనా వాళ్ళను పొగిడితే బానే ఉంటుంది కదా....:-)

ఇక మీ ఉత్తరంలోని విషయానికి వస్తే.. మీ అబ్బాయిలందరు అనుకుంటారు. 'మేము చాలా బాగా వీక్షిస్తున్నాము. అమ్మాయిలను వాళ్ళకు తెలియకుండా' అని కాని మీకు తెలియని విషయం ఏమిటి అంటే, అమ్మాయిలకు ఈ తీక్షణ వీక్షణాల గురించి కొంచెం స్పృహ

ఎక్కువగానే ఉంటుంది.... మీరు నన్ను గమనిస్తున్నారనేది నాతో పాటు మన ఆఫీస్‌లో ఉన్న ఆడవాళ్ళందరికి ఇంకా కొంచెం మంది మొగవాళ్ళకు కూడా తెలుసనుకుంటా, ఆ విషయమే ఇంకా మీకు తెలియదనుకుంటా...

మాస్టారు.. నా జాజిపువ్వుతో పాటు మీరు కూడ సగం పైగానే వంగారు. అది ఎక్కడ నేల మీద పడుతుందో అన్నట్లు. కానీ మీకు, నాకు అప్పుడు నాలుగు టేబుల్స్ దూరం ఉంది, అని ఆ రూంలో అందరు గమనించారు, మీరు తప్పు... మీరన్నది నిజమే అనుక్షణం ఒకరి చూపు వెంటాడే విహంగమల్లే మన చుట్టూ తిరుగుతుంటే ఇబ్బందిగానే ఉంటుంది. అలా అనుకోవటానికి పెద్ద ఫెమినిస్ట్ అయ్యే ఉండనక్కర్లేదు. నిజంగా చెప్పాలంటే అవును మీ చూపు నన్ను ఇబ్బంది పెడుతూనే ఉండేది...

మీ ప్రేమ శీతల సమీరమల్లే, ప్రత్యూష పవనమల్లే సుఖాన్నే కాదు గ్రీష్మతాపమల్లే ఇరుకున పెట్టిన క్షణాలు ఈ రెండు సంవత్సరాలలో చాలానే ఉన్నాయి. హ్మ్ మొత్తానికి చివరకు ఎలా ఐతే ధైర్యం చేసి.. చూపు చురుకు హెచ్చి, కనులలోని మాట కాగితం మీదకు వచ్చింది. క్రిష్ణా నాకు ఏమని చెప్పాలో తెలియటం లేదు.. మీరు ఎంతో ప్రేమగా మీ భావాన్ని జాజుల జల్లెడ వేసి గంధాల, సుమ భందాల మాలికలల్లి నా ముందు పరిచారు. నేను తప్పకుండా అర్ధంచేసుకోగలను మీ భావాన్ని, ప్రేమైక అనుభవాన్ని.. ఇలాంటి క్షణమేదో వస్తుందని అనుకుంటూనే ఉన్నా. సమయం వచ్చేసరికి పదాన్ని కూర్చటానికి కొంచెం కష్టంగానే ఉంది..

ప్రేమ వేరు (మీరనే ప్రేమ), జీవితం వేరు.. ప్రేమ జీవించటానికి అవసరమయ్యే ఒక సాధనమే కాని ప్రేమే జీవితమంటే ఏమో నాకు నమ్మశక్యంగా ఉండదు... క్షమించాలి ఇది నా అభిప్రాయమే.

నిన్ను నీవు మర్చిపోయి ఆలపించే రాగంలో కూడా తాళం తప్పటం అనే అపశ్రుతి దొర్లకుండా అనునిత్యం నువ్వు జాగ్రత్తపడుతూనే ఉండాలి, "ఎంత గొప్ప రాగమైనా తాళం జతులతో కలిసినప్పుడే సంపూర్తి అవుతుంది" అనేది ఒక అభిప్రాయమైతే దానిని వేర్వేరు వ్యక్తులు వేర్వేరు కోణాలలో చూడవచ్చు... మీరు దానిని "అవును ప్రేమ నీతో కలిసి జీవితాన్ని పంచుకున్నప్పుడే దానికి సార్ధకత. అలా సాగే జీవితమే జీవితానికి, జీవనానికి అర్ధం" అనొచ్చు... మరి నేనేమో "ప్రేమ అందరితో కలిసి పంచుకున్నప్పుడే.. నీ తోటివాళ్ళకు, అవసరమైన ప్రతి వ్యక్తి వివిధ రూపాలలో అందించి, జీవితమనే రాగాన్ని స్నేహం, పంచుకోవటం అనే వాటితో కలిపితేనే సమిష్టి సమాజంగా సంపూర్తి అవుతుంది" అనొచ్చు...

మీకు అర్ధం అవుతోంది అనుకుంటా.. అలా అని జీవితంలో సహచరుడి తోడు, దాని విలువను నేను కాదనటం లేదు. ప్రేమ అనేది మొదలు "మన" అనే కుటుంబంతోనే మొదలవ్వాలి, కుటుంబంలో ప్రేమ, సహజీవనం అనే దానిని సాధించలేకపోతే బయట ఏమీ సాధించలేము... మీరు నా మీద చూపిస్తున్న పెంచుకుంటున్న ప్రేమ నాకు చాలా సంతోషాన్నిస్తోంది, అది ఒక బంధమై... నాకు బలాన్ని, ముందుకు కలిసి సాగే భవితవ్యాన్ని ఇవ్వాలి కాని... ప్రేమ ఒక బంధమై, నే చూసే చూపుకు ఒక ప్రతి బంధకమవ్వకూడదు అని నా ఆశ....

ఇంక ఇంతకంటే ఏమి చెప్పాలో నాకు అర్ధం అవ్వటంలేదు కాని మీ ఆలోచన బాగుంది క్రిష్ణా.. మనం కలిసి సాగి స్నేహితులులా నచ్చిన పరిచయస్తులులా తప్పకుండా ఉందాం. చూద్దాం కాలమే నిర్ణయించని ఆ పరిచయ ప్రభావం మిమ్మలను, నన్ను ఏ దారివైపు తోసుకు వెళుతుందో. ఈ రోజు సాయింత్రం పని అయ్యాక రెండు ఆహ్వానాలున్నాయి నాకు. ఒకటి రంగనాథన్ స్మృత్యర్ధం సాగే మృదంగ వాద్య సభ, ఇంకోటి ఆధునిక రచయితల మీద గోపీచంద్ ప్రభావం.... మీరు వస్తానంటే నా కైనటిక్ వెనుక సీట్ ఖాళీనే...:)

ఉంటాను మరి,

**విరాజిత**

✡ ✡ ✡



# లేఖాయణం
## ఉమ యేలూరి



# అక్కా అంతేనంటావా!

*అక్కా!*

ఎట్లా ఉన్నావు? నేను నా పతి.. పుత్ర, పుత్రికా రత్నాలతో సహా నిక్షేపంగా ఉన్నాము. నిక్షేపంగా అంటే గుర్తువచ్చిందే మొన్న నాయనమ్మ నిక్షేపం లాంటి నా జాజికాయ పెట్టె కనపడలేదు అని గోల గోల పెట్టింది అని చెప్పాను కదా. నాయనమ్మ అత్త వాళ్ళ ఇంటికి వెళ్ళిన సందు చూసుకుని, నాన్నేమో ఆ పెట్టెని పెదనాన్నగారింటికి పంపించేసారంట.. 'ఎందుకలా చేశావు నాన్నా ?' అంటే... 'రోజు దాని గురించి మీ అమ్మకు నాయనమ్మకు గోలే.. ఆమెకాపెట్టె ఎత్తే ఓపిక లేదు ప్రతి అరగంటకు ఒకసారి అమ్మను రమ్మని, రాత్రి తోడు పెట్టిన పాలగిన్నె ఇంకా తీసినట్లు లేవు తియ్యవే అనో, మొన్న మధ్యాహ్నం రెడ్డిగారింటి నుంచి వచ్చిన ఉలవల మూట అందులోనే పెట్టానే తీస్తావా, దాలి పొయ్యి పొద్దుట నుంచి ఊరికే ఉంది' అని ఏదో ఒకటి గొడవ చేస్తోందన్నారు నాన్న. పూర్తిగా మతిమరుపు ఎక్కువయిపోయింది.

ఏనాటి అబ్బురాం, జరుగులు మొన్నీ మధ్యన 'వాళ్ళు పొలం నుంచి వచ్చేటైం అయ్యింది నువ్వు ఇంకా అన్నం ఉండలేదు' అని గోలంట. మనకు వినటానికి నవ్వుగానే ఉంది కాని పాపం, అమ్మకు కష్టంగానే ఉంటోంది అనుకుంటా. ఒక పక్క నాన్న చాదస్తం.. అది చాలదన్నట్లు ఇప్పుడు ఈ నాయనమ్మతో కూడా. కానీ అమ్మకెంత ప్రేమే నాయనమ్మ అంటే..!! నాకు ఆశ్చర్యంగా ఉంటుంది.

నాకు మా అత్తను చూస్తేనే చిర్రుమంటూ ఉంటుంది. లోన ఆమె మాట్లాడే వెటకారం మాటలకు మొన్న ఎంత నీలిగిందని!? ఇంటికి రాగానే కొడుకు తనంతట తనే కాఫీ పెట్టుకున్నాడంట 'ఎంత కష్టపడుతున్నాడో చంటి' అని, అక్కడికి నేనేదో తిని అరగక తిరుగుతున్నట్లు.. నాకు మాత్రం ఎంత కష్టంగా ఉందే ఈ ప్రయాణం చేసే ఉద్యోగం చెయ్యాలంటే... అక్కడికి రవి ఏదో సాయం చెయ్యబట్టి లాక్కొస్తున్నా కాని. దానికి తోడు వచ్చినప్పుడంతా ఈమె సూటి పోటీ మాటలు. 'మేము మాత్రం చెయ్యలేదా ఉద్యోగాలు? ' అంటు..! ఏమి చేసిందే ఆ పనికి రాని టీచరుద్యోగం. ఒక్కనాడన్నా ఎలక్షన్ పనులకు కూడా వెళ్ళకుండా, వాళ్ళ ఆయన పదవిని అడ్డం పెట్టుకుని ఒక్కసారి కూడా పల్లెటూళ్ళకు బదిలీలు లేకుండా ఆ గుడివాడలో పడి హాయిగా బతికేసి.. వృద్ధనారి అన్నట్లు చెపుతుంది..

సరే ఈ సోదికు ఏమి వచ్చే కాని బాబిగాడు బాగున్నాడా? మొన్న వచ్చినప్పుడు వాడి వచ్చిరాని తెలుగులో ఎంత ముద్దుగా మాట్లాడాడో. ఇంకా నువ్వు తెచ్చిన అన్‌కట్ పగడాలదండ చేయించుకోలేదు. పైన అపార్ట్‌మెంట్ పార్వతిగారు 'ఏమి చేయించుకోకపోయినా అలా కొక్కెం పెట్టి వేసుకోవచ్చు మూడు వరసలుగా, తరువాత నెమ్మదిగా లాకెట్, దుద్దులు చేయించుకోవచ్చు' అంటుంది. ఏమంటావు? మొన్నీ మధ్యన పరమేశ్వరరావుగారు తీసుకోమన్నారని రవి వద్దు అంటున్నా వినకుండా, ఈడ్పుగల్లు దగ్గర ఆ దగ్గుబాటి వాళ్ళు ప్లాట్‌లు వేసి అమ్ముతున్నారు మంచి ధరకు ఇప్పిస్తాను అంటే ఒకటి బ్లాక్ చేయమని చెప్పాను. తీసుకోకూడదూ..!? పెద్ద దాని పేరు మీద ఉంటుంది కదా.

వచ్చే వయసే కానీ తగ్గేది కాదు కదా! ఏమిటో అప్పుడే ఈ మధ్యన కళ్ళు తిరుగుతున్నాయి అని రవి గోల చేసి డాక్టర్ దగ్గరకు తీసుకెళితే, ఆయన 'బీపీ బోర్డర్‌లో ఉంది సరిగా తిని ఎక్సర్సైజ్ చేయకపోతే మందులేసుకోవాలి' అన్నారు. రవి పెద్దికి కూడా ఫోన్ చేసి గోల గోల.. 'చూడు నీ స్నేహితురాలు ఎలా చేస్తోందో!? ' అని.

అవునూ బావగారి వాళ్ళ బాబాయిగారు వాళ్ళు అదే వినాయక్ థియేటర్ దగ్గర ఉంటారు చూడు.. వాళ్ళ చిన్నల్లుడు చనిపోయాడంటగా..? నాకు చెప్పనే లేదేమే, నిన్న దినం కార్డ్ వచ్చింది. సాయంత్రం రమత్తయ్యగారు ఫోన్ చేసి చెప్పారు. పాపం ఏమిటో చిన్న వయసులోనే! అందరూ బాగున్నారు. ఇంకా రెండు బస్‌లు కూడా కొన్నారు. కేశినేని ట్రావెల్స్ వాళ్ళవి అని క్రిందటి సంవత్సరమే అనుకున్నాము.

ఏమిటోనే చిన్నప్పటినుంచి నేనేమో ఈ బడబడా వాగే గుణం, నువ్వేమో మాట పెదవి దాటనివ్వని తత్వం మార్చుకోలేక పోయాము. ఏమి చేస్తాము ఈ జన్మకు ఇంతే.. వీలు చూసుకుని అన్ని వివరాలతో ఉత్తరం రాయి. మాట మాటకు ఫోన్ చెయ్యక మొన్న వచ్చినప్పుడు బావగారు కూడా అంటున్నారు. మీ అక్క ఫోన్‌ల మీద పెట్టిన డబ్బులతో నెలసరి వాయిదాలు కట్టుకున్నా విజయవాడలో సగం మాది ఐపోయేది అని. శ్లేషగా అన్నారేమో నాకు తెలియదు కానీ నిజమే కదా.. ఊరికే అమ్మకు, నాకు మావయ్యలకు, పెదనాన్నగార్లకు ఇంకా ఎందరెందరికి చేస్తావో అర్థం పర్థం లేకుండా.. ఉంటాను మరి.. బావగారిని అడిగానని చెప్పు.

ప్రేమతో

నీ చెల్లి,

*చిన్ని.*

✡ ✡ ✡

*చిన్నా,*

నువ్వేమీ మారలేదే వచ్చినప్పుడే చెపుదామనుకున్నాను. ఈ ఉత్తరం చూస్తుంటే మళ్ళీ మనం ఇంటి బయట అరుగు మీద కూర్చుని వాదులాడుకుంటున్నట్లు ఉందే. గుడ్లవల్లేరు లాకులెత్తేసినట్లు నీ ధోరణే నీది కానీ, ఎదుటి వాళ్ళకు మాట్లాడే అవకాశం ఇవ్వవు కదా... నీ చిన్ని ఉత్తరంలో చాలానే విషయాలు కలయ తిప్పేసావు.. చిన్నప్పటినుంచి నీ ప్రత్యేకత అది. నీ బలహీనత కూడా అదేనే చిన్ని. దేనిమీద ఎక్కువసేపు కుదురులేదు. సవ్యసాచిలాగా వయసులో ఉన్నప్పుడు పరుగులు తీయటం బానే ఉంటుందేమో కానీ ఎప్పుడూ అంటే కొంచెం తగ్గించుకోవాలేమో...

నీకు ఎందుకు ఆశ్చర్యంగా ఉందే అమ్మ, నాయనమ్మ అనుబంధం చూస్తే...!!! అమ్మ చెప్పిందా నాయనమ్మతో కష్టంగా ఉందని? నేను నమ్మను.. నాన్నకు అంతా కంగారే. అందుకే పంపించి ఉంటారు ఆ భోషాణం పెట్టెను. నాయనమ్మ చిన్నప్పుడు అందులో పటికి బెల్లం ముక్కలు దాచి సాయంత్రం బడి నుంచి ఇంటికి రాగానే ఆ రోజు ప్రసాదం తీసి పెట్టేది గుర్తువుందా?

ఆమెకు ఎంత అనుబంధం ఆ పెట్టెతో, దాలిపొయ్యితో. నిజమే మన చిన్నప్పుడు ఎప్పుడైనా ఆ దాలి పొయ్యి నుంచి పొగ రాకుండా గుర్తు ఉందా? నాకు మన ఇల్లు అంటేనే ఆ చుట్టింటి పక్క నుంచి గాలితో పాటు గడ్డికాలుతున్న వాసనతో తేలివచ్చే దాలి పొయ్యి పొగ కూడా మెదలకుండా ఉంటుందా కళ్ళముందు...

మీ బావగారు 'అబ్బ స్వగృహలో ఉలవచారు..! ఎలా ఐనా ఆ రుచే వేరు' అంటే నేను 'మా ఊళ్ళో పొంత పెట్టి రోజంతా ఉలవలు, గుగ్గిళ్ళు ఉడకపెట్టి దానిలోని సారమంతా మా బర్రెలకు కుడితి కలిపాక మిగిలిన తుక్కులో నీళ్ళు పోసి తీసిన చారు కూడా అంతకంటే బాగానే ఉంటుంది' అంటే తెగ ఉడుక్కున్నారు అనుకో....

సాయింత్రమవ్వగానే గుడిలో నుంచి వచ్చే పాట "ఆజానుబాహుడమ్మ... అరవింద నేత్రుడమ్మా... కోదండ రాముడమ్మా... సీతమ్మ వలచిన, గోపన్న కొలిచిన, భద్రుని బ్రోచిన శ్రీరాముడు.... శంఖ చక్రధారుడు. అదిగో గౌతమి ఇదుగో భద్రాద్రి" అనే పాటను వింటూ.. అప్పుడే జరుగులు పితికిన పాలనురుగుతో అమ్మ చేసి ఇచ్చిన కాఫీ తాగుతూ, స్టూల్ వేసుకుని ఎగిరెగిరి కోసుకున్న సన్నజాజుల పూలను మాల కట్టుకుంటున్నప్పటి ప్రశాంతత ఇప్పుడు నువ్వు వెళ్ళే రిసార్ట్‌లలో వస్తుందే?

మనకే అలా ఉంటే మరి పూర్తి జీవితమంతా వాటితో గడిపిన నాయనమ్మకు ఎలా ఉంటుందో ఊహించుకో... మర్చిపోయావా? అమ్మకు మేకు గుచ్చుకుని వాతం కమ్మితే, నాయనమ్మ ఎంత హడావుడి చేసిందో, ఎంత మంది దేవుళ్ళకు మొక్కిందో. తగ్గాక ఒకరోజు అమ్మకు తలకు పోసి దిష్టితీసి, అమ్మకు సంధ్య వేళ సాంబ్రాణి వేస్తూ ఎంత హడావుడి చేసిందో నాయనమ్మ! ఇప్పటికి నా మనోఫలకం మీద అది ఒక చెరగని ముద్ర. అమ్మ కూడా మర్చిపోయి ఉంటుందని నేననుకోను. చిన్నీ ప్రేమానుబంధాలు మనం పెంచుకుంటే పెరిగేవేనే.... నువ్వు చిన్నదానివి అప్పుడు, ఏమి గుర్తు ఉండి ఉండదు...

మీ అత్తగారికి కొంచెం చాదస్తం అంతే నేను మొన్న వచ్చినప్పుడు ఎంత గొప్పగానో చెప్పింది. 'మా సుమాకు క్షణం కూడా తీరిక దొరకదమ్మా అమెరికాలో మీరైనా ఇంత కష్టపడతారో లేదో ఒక్క క్షణం కూడా కూర్చోదు' అని ఎంతో ఆపేక్షగా చెప్పింది.

అలా కాలంతో పాటు పరుగులు తీయకురా చిన్ని! మీ బావగారికి, నీకు ఈ పరుగులు తీసే గుణం ఎప్పటికి ఆగుతుందో.? ఏమి చేస్తారురా ఇన్ని కొని, దాచి.. చెప్పండి. మొన్న కృష్ణ కూడా వాళ్ళ ఊళ్ళో పొలం అమ్మి అదిచేస్తా, ఇది చేస్తా అని ఉరుకులు పెడుతుంటే చెప్పాను 'రైతు బిడ్డలం మనం ఆ భూమినే అమ్మేసి ఏమి చేస్తావు? ఇంత సంపాదించుకుంటున్నాము మనం ఇప్పుడు... ఆ కౌలుదారులు ఇచ్చేది శిస్తు కట్టటానికి వస్తే చాలదా? ఆ భూమిని ఉంచితే నష్టం ఏమిటి?' అని. ఇళ్ళు స్థలాలు కొంటే మాత్రం పని ఉండదా ఏమిటి... వదిలెయ్యండి ఆ గోల.

ఆరోగ్యం జాగ్రత్త! తొందరగా ఐపోతాయని ఆ వేపుడులు చేయక. నాయనమ్మ చేసేది వంకాయ రోటి పచ్చడి, చేసి ఆఖరిలో ఉల్లిపాయ కలిపేది, అదీ.. నాయనమ్మ చేసినట్లు చామదుంపల పులుసు మాత్రం కుదరటం లేదురా చిన్ని నాకు. అమ్మ చేసే ఉప్పూ కారం పప్పు కూడా రావటంలేదు. ఎట్లా ఐనా రాజయ్య తాత చేతి నుంచి వచ్చిన కందులు కావుకదా... మీకు ఇంకా రాజయ్య తాత కందులు, మినుములు పంపుతున్నాడా? తాత పొలం బలే మంచి నేలకదా! దుక్కిదున్నాడంటే రెండో పంట నుంచి కూడా పుట్లు రాలాల్సిందే కదా...

సరే మరి ఉంటాను ఆరోగ్యం జాగ్రత్త. చింటూ, ఛాయమ్మ జాగ్రత్త... కిందటి వారం నువ్వు లేవు, రవితో పిల్లలతో చాలా సేపే మాట్లాడాను. చెప్పే ఉంటారు కదా! రవి ఏదో సిందుబాద్ రాజకుమారుడి కథ చెపుతున్నాడంట. ఆ కథ కూడా చెప్పారు. చిన్నీ... రవి బంగారు తండ్రే.. అడిగాను అనిచెప్పు మరి.

ఉండనా

ప్రేమతో నీ అక్క - ***సింధు***

✡ ✡ ✡






## ఒంటరి గూడు

ప్రియమైన రాధి,

ఇంకా నువ్వు నాకు ప్రియమైన దానివే నీకు నేనుకాకపోయినా.... అచేతనమైన మనః శరీరాలతో జీవితం పునఃసమీక్షించు కోవటం వలనేమో తప్పొప్పుల మాట అటుంచి అసలు ఈ చిందరవందర ఎక్కడ నుంచి మొదలయ్యిందో కూడా అర్ధంకావటంలేదు. జీవితంలో ఇంత దూరం వచ్చాక జీవితపు మొదలును పరిచయం చేసుకోవలసిన అవసరం రావటం నా వరకు దురదృష్టమనే అనుకుంటున్నా. నువ్వేమనుకుంటున్నావో కాని.

ప్రతి ప్రశ్నకు సమాధానం ఉంటుందని ఎవరన్నారో కాని వాళ్ళకు వెళ్ళి చెప్పాలని ఉంది, జీవితమే ఒక అంతు దొరకని ప్రశ్న రా ఇంక చిన్న ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందా అని. నువ్వు నేను కలిసిన ప్రతిసారి ఒక వాగ్యుద్ధం మొదలైతే అది మన ఇద్దరి తెలివితేటలకు ఒక చిహ్నమనుకున్నా కాని అది పగిలే గుండెల దూరానికి పడే బీటు అనుకోలేదు. అవును మన పరిచయమే ఒక ఆర్యుమెంట్‌తో మొదలయ్యింది కదా. గుర్తువుందా... మొదటిసారి అంతర్రాష్ట్రీయ డిబేట్ టీం లో 'కుటుంబం అది పొందుతున్న సామాజిక మార్పులు అది గురి అవుతున్న మిథ్‌లు' అనే విషయం మీద మన చర్చ. ఇద్దరం పూర్తిగా రెండు విభిన్న దృక్పధాలతో నాణేనికి రెండు పక్కలా చూపించటానికి ప్రయత్నించాము అని జడ్జ్ ప్రకటించినప్పుడు ఎర్రబడిన నీ మొహం ఇప్పటికి నిన్నే జరిగినంత ఫ్రెష్‌గా నా మదిలో ఉంది. ఇప్పుడు అనిపిస్తుంది అప్పటి నుంచి మన పరిచయం పెరిగిన ప్రతి మలుపు ఓటములలో ప్రతి విషయాన్ని నువ్వు చాలా సీరియస్‌గా తీసుకున్నావు అని.

కలిసి పెరిగిన అనుబంధాల విలువలను.. అభిప్రాయాల తేడాలతో, అపార్ధాల నీడల తోనో తోసి రాజనుకోవటం 'నువ్వెందుకు చేసావు?' అని నేను ప్రశ్నించను కాని 'ఎందుకు చేసావు, ఏమైనా కారణం ఉందా?' అని మాత్రం అడగాలి అనుకుంటున్నా. మనం 21 వ శతాబ్దంలో ఉన్నాము ఇంకా ఆటవిక యుగంలో లేము కదా ప్రతి సమస్యను చర్చలతో పరిష్కరించుకోవచ్చు అనే నువ్వే పెద్దగా చర్చ అనేది లేకుండా జీవితం నుంచి బయటకు నడిచి నను పిల్లలను కూడా ఎందుకంత చీకటి తెరల వెనుక తోసేసావు? కిందటిసారి కలిసినప్పుడు దాచి, దివ్వు ఇద్దరు నాతో సరిగా మాట్లాడలేదు. నాతో కలిసి ఎక్కువ సేపు కలిసి ఉండటానికి కూడా ఇష్టపడలేదు. అది నాకు ఎంత క్షోభగా ఉంటుందో నీకు బాగా తెలుసు. తెలిసే వాళ్ళను అలా తయారు చేసావు కదూ!. రాధీ ఎందుకు నీకు ప్రతి

విషయంలో ఇంత మొండితనం... నేను అనుకున్నదే జరగాలని పంతం. తప్పు మానవ సహజం కాదా! తప్పని తప్పు ఒప్పుకున్నాక కూడా జరిగిన వాటినే పదే పదే అనుకుని నాకు ఇంతగా శిక్షవిధించటం ఏమో మరి నీకు న్యాయమనిపిస్తుందా...

ఆలోచించు నువ్వేమి చిన్నపిల్లవు కాదు నీ ఒక్కదాని అభిప్రాయంతో, నీ ఒక్కదాని జీవిత విలువలతో (నువ్వు అనుకునే జీవిత విలువలు వాటిని నాకు ఆపాదించకు) మొత్తం కుటుంబాన్ని చిన్నా భిన్నం చేసావు.. రాధి ఈ రోజుకు నువ్వు ఇంటి నుంచి వెళ్ళి సంవత్సరం అయ్యింది కాని నాకు మాత్రం గాయం ఇంకా పచ్చి పుండులా కెలుకుతూనే ఉంది.... ప్రతి క్షణం నువ్వు లేని లోటు నా జీవితాన కనిపిస్తూ నన్ను నా అంతట నేను స్వశక్తితో ఆలోచించనియ్యకుండా నిర్వీర్యుడను చేస్తోంది. ఇంక ఇంతకంటే ఏమని చెప్పాలో కూడా అర్థం కావటం లేదు....

ఒక స్థాయికి వచ్చాక జీవితం మనదే కాదు అందరిది అని చెప్పే నీవే ఆ జీవితాన్ని మా అందరి దగ్గర నుంచి తీసేసుకుని నీ చేతిలో పెట్టుకుని ఆడిస్తున్నావురా రాధి. నీకు తెలుసు ఆ విషయం. నీకు న్యాయమా నన్ను నా తల్లితండ్రులతో మాట్లాడవద్దు అనటం. వాళ్ళు నా తల్లితండ్రులు. నా వల్ల కాదురా అలా వాళ్ళను నిస్సహాయులను చేయటం. ఏమో రా రాధి ఆలోచించు వృత్తి రీత్య, ప్రవృత్తి రీత్యా కూడా ఆలోచించటం, పరిష్కారాలు వెతకటం నీకు అలవాటే కదా.. ఆలోచించు పరిష్కారం దొరుకుతుందేమో ఈ సమస్యకు.

ఎక్కువ మాట్లాడే కొద్దీ నేను బ్యాలెన్స్‌ను కోల్పోతానేమో అని ఇక్కడితో ఆపేస్తున్నా నా మనసు నీకు పంపే వినతి పత్రం మాత్రం నిరంతరం సాగే స్రవంతి అని తెలుసుకదా..

ప్రేమతో
ఎప్పటికీ నీ
కృష్ణ

కృష్ణా,

మీరు చెప్పిన ప్రతిమాట మీరు రాసినంత సూటిగాను అర్థమయ్యింది, ప్రతిపదార్థాలతోనూ, టీకా తాత్పర్యాలతోనూ అర్థం అయ్యింది. ఎంతైనా కలిసి సాగిన పన్నెండేళ్ళ పరిచయం కదా. ప్రతి వాక్యానికి సమాధానం రాయాలనే ఉంది కాని దాని వలన ఏమైనా ఉపయోగం ఉంటుందా అనే ఆలోచిస్తూ దాదాపుగా రెండు నెలలు చేసాను మీకు సమాధానం ఇవ్వటానికి. ప్రతి దానికి జీవితంలో లేటేగా నేను (మీరనే మాటే నాది కాదు). హ్మ్... విభిన్న దృక్పథాల విచిత్ర కలయిక మన పరిచయమైతే, ఆ విభిన్నత లోని మూలమే మనలను విడతీసిన కారణమని నేను అనుకుంటున్నా. ప్రతి కలయిక విడిపోవటానికి నాంది అని మీరు షాయరీలు చెపుతూ అనే వారు గుర్తుందా... అది గుర్తుకొచ్చింది నాకు మీ ఉత్తరం చదివాక.

హ్మ్.. పదాలను నేర్పుగా కూర్చే కళ మీకు స్వతహాగా దేవుడిచ్చిన వరం. అది పట్టుబట్టి నేర్చుకుని జీవనాధారం చేసుకున్న కథనం నాది. చూడండి ఇక్కడ కూడా నాణేనికి రెండు ప్రతిమలమే. అవును ప్రతి సమస్యను చర్చలతోనే మనం ఉన్న స్థాయి కంటే వేరేగా స్పందించి ఆ కోణంలో పరిచయం చేసుకోవటం మూలంగానో పరిష్కరించవచ్చు అనుకునే దానిని నేను కాని కొన్ని కొన్ని సమస్యలకు మౌనమే పరిష్కారమనిపించి మాట్లాడకుండా ఉన్నాను.

ఏమని మాట్లాడమంటారు. అభిప్రాయాల తేడా కాదు అపార్థాల నీడ అసలే కాదు మనలను విడతీసినది, జీవన విధానాలలోని నమ్మకాలలోని వైరుధ్యం కృష్ణా. మన జీవనంలో ప్రతిక్షణం వాటి మూలంగా కలిగిన ఘర్షణే ఈ మార్పుకు కారణం కాదంటారా. సహజీవనానికి పునాదైన ప్రేమ నమ్మకం మన మధ్యన సడలిపోయాయి... అది ప్రేమకు పరాకాష్ఠ అని మీరనుకోవచ్చు. అనుకోవచ్చు ఏమి ఉంది అన్నారు కూడా కదా... మీ ఉత్తరంలో దానిని అడుగడుగునా ప్రదర్శించారు కూడా, కేవలం వాదనలలోని అభిప్రాయ బేధమే గుండె

గోడలు బీట వారటానికి కారణమా? అది కూడా ప్రతిసారి ఆ వాదనను నేను సీరియస్‌గా తీసుకోవటం వలన. ఆ పైన ఎందుకు చేసావు అని నన్ను ప్రశ్నిస్తున్నారు.

మన మొదటి పరిచయంలోని టాపిక్ మీకు బాగా గుర్తు ఉండే.. అవును కుటుంబం అనే మిథ్ మనం విడిపోవటానికి కారణం. కుటుంబంలో ఉండవలసినవి అని మీరనుకున్న, మీరు ఉంచిన పొరల మందం ఎక్కువ అయ్యి కలపవలసిన ప్రేమ, అనుబంధం పల్చనైపోయినట్లుంది. తప్పును తప్పు అని ఒప్పుకోవటం మూలంగా ఒప్పు ఐపోదు కృష్ణా.. ఆ దిశగా సాగే నడక ముఖ్యం. నడిచేరా మీరు ఆ దిశగా. కనీసం ప్రయత్నించారా? ప్రేమ వివాహాలలో కూడ వివాహేతర సంబంధాలు ఉంటాయి అంటే, నేను నమ్మే దానిని కాదు కాని అది నిజమై నా ముందు నిలబడి వెక్కిరించిన రోజు నా క్షోభ మీరు అర్థం చేసుకున్నారా? ఈ క్షణాన ఒంటరితనంతో నిర్వీర్యుడైన నా జీవనసహచరుడా ఈ ఒంటరితనంతో నేను నడిచిన క్షణాలన్నీ యుగాలై ఇంకా నా వెనక నీడలానే ఉన్నాయి. 'తప్పే' అని ఒక్కమాట అంటే సరిపోయిందా. ఏమన్నారు నేను అడిగిన రోజు 'పదే పదే తప్పుచేసి ఒప్పంటున్నారు' అన్నప్పుడు నేను మొగవాడిని బయటకు వెళ్ళినప్పుడు ఉండే అనేకానేక ఒత్తిడుల మధ్యన జరిగే ప్రతి విషయాన్ని కేవలం మన మధ్య ఉండే కాపురం ప్రేమల మధ్యకు కలిపి ముడిపెట్టకు అన్నారు. సున్నితమైన మనసు ఉండటమే కాదు కృష్ణా అవతలి వాళ్ళకు కూడా అది ఉంటుందని గుర్తించటం కూడా అవసరమే కాదు అంటారా.

మీ నాన్నగారిలానే మీరు ఆలోచిస్తున్నారు కాని ఆయన కంటే విద్యాధికులు కదా, ఆ అధికత మీ తప్పును అందంగా కప్పిపుచ్చుకుంటానికి దానిని సమర్ధించుకోవటానికి మాత్రమే ఉపయోగపడింది. కాని బేసిక్ ఇన్స్టింక్ట్స్, ఆ పైన నన్ను అవమానించటానికి మీ నాన్నగారితో కలిసి మీరు పెరిగిన వాతావరణమే ముందుకు వచ్చింది. అందుకే ఆ వాతావరణం పిల్లలకు వద్దని బయటకు వచ్చాను. అనుక్షణం తల్లి తెలివి తేటలు ప్రశ్నించబడుతు, వెక్కిరించబడుతూ అంతలోనే ఆ కుటుంబం అనే మిథ్‌తో ప్రేమించబడుతూ సాగే ఆ ద్వంద ప్రమాణాల జీవన విధానం వద్దు కనీసం ఆ లూప్‌లో నుంచి పిల్లలనైనా బయటకు రాని కృష్ణా. నేను పన్నెండు సంవత్సరాలు ప్రయత్నించాక అర్థం ఐంది అందులోనే ఉంటూ ఆ ద్వందతను ఎదిరించటం కష్టం అని.

కలిసి సాగే సహజీవనంలో ప్రేమ అనేది ఒక మిథ్‌లా కాకుండ ఒకరికొకరు అనే మాటకు ఒకే అర్థంతో, ఒకే ప్రమాణంతో, ఇల్లంటే మొగవాడు అలిసి ఇంటికి రాగానే అతని అలసట తీర్చి అన్ని అందించే ప్రేమ గోపురం ఆ ప్రేమ అందించే భార్య మూలస్థంభం మే కాక, అలసి గూడు చేరిన గువ్వలు రెండిటిని కలిపే ఒక ప్రేమ గోపురమై, ఒకరికొకరు మానసిక ఆలంబన ఇవ్వగల గూడవ్వాలని అటువంటి భావితరాన్ని తయారు చేయాలనే ఈ క్షణపు నా ఒంటరి గూడును నా చేతులతో నిర్మించుకుంటున్నా. దాని అర్థం, విలువ మీకు తెలిస్తే ఎప్పుడైనా తలుపు తట్టవచ్చు.

రాధిక.

✡ ✡ ✡






# హేమంతాల చేమంతులు

**బావా,**

ధనుర్మాసపు చలిగాలి చెంపలను నిమిరి, గుండెలో గిలిగింతల పులకరింతో గుబులు దుమారమో సరిగా తెలియకుండా లేపి, ఎండిన ఆకులను సుడి తిప్పుకుని వెళ్ళి పోతోంది. నాకూ  సుడిగుండంలోని ఆకుకు తేడా లేదేమో.. ప్రపంచంలో అన్నిటికంటే వేగంగా పయనించగల మనసు కూడా నా బావ కోసం ఎక్కడ పయనించాలో తెలియకనో ఏమో, మూడంకె వేసుకుని ముడుచుకొని దిగులుగా వుంది. హేమంతమంటేనే దిగులు! జలదరింపుల పలవరింతలంటే ఇదేనా బావ? ఇది రెండో సంక్రాంతి నువ్వు లేకుండా..! అందరు బానే ఉన్నారు. వాళ్ళెవ్వరికి కృష్ణయ్య  లేని బాధ లేదుగా మరి.

నిన్న మునసబు గారింటికి పనేమి లేక పోయినా దుర్గ దగ్గర  చదివిన పుస్తకాల కోసమే మళ్ళీ వెళ్ళి అడిగేను. మధ్యాన్నం నిద్ర టైంలో ఏమైనా ఫోన్ వచ్చిందేమో, వాళ్ళకు వినపడలేదో వినపడ్డా మధ్యాన్నపు నిద్ర సౌఖ్యాన్ని వొదులుకోలేక వూరుకున్నారేమో అని.  లేదు చెయ్యలేదన్నారు.

శీతాకాలం మధ్యాన్నాలు చాలా తక్కువ ఇలా వచ్చి అలా మాయమై పోతాయి. ఈ రోజన్నా సాయింత్రం దీపం పెట్టమని అమ్మ అరిచేలోపు ఈ ఉత్తరం పూర్తి చెయ్యాలని దొడ్లో వుసిరి చెట్టు పక్కన కూర్చుని  రాస్తున్నా. కాలం కాని కాలంలో ఎక్కడో కోయిల కూత వినపడుతోంది విచిత్రం. అందరు అన్నాలు తిని ఏవో సర్దు కుంటున్నట్లున్నారు. పాపం అమ్మకు అత్తయ్యకు ఈ కాలంలో మధ్యాన్నం కాసేపు కునుకు తీయటానికి కూడా కుదరదు కదా.  నాన్న మావయ్య నూర్పిళ్ళ కాలం వచ్చేస్తోంది అని పొలాల దగ్గరే ఉంటున్నారు. ఇంకో గంటలో లేచి టీ తీసుకుని వెళ్ళి పోతారేమో కూడా. వాళ్ళకు టీ పెట్టాలి, ఇంకా  అరిసెలు అవి చేయాలని గూడెం రంగి వాళ్ళకు కబురంపింది అమ్మ.

వీరాయి గాడొక్కడే  ఏమిటో గొడ్ల సావిడి దగ్గర కూని రాగాలు తీసుకుంటూ ఏదో పని చేసుకుంటున్నాడు. నార పేనుస్తున్నాడు అనుకుంటా. సంక్రాంతికి మన లక్ష్మి కు కొత్త తాడు నేస్తాడేమో బహుమతి కింద. అవును బావా అది తాడయ్యి తనను కట్టినంత

కాలం... అది రంగుల తాడయ్యి, పాత తాడయ్యి, పసుపూసిందయ్యి లక్ష్మికి ఒకటే కదా. దాని పని లక్ష్మిని బంధించటం, అది లక్ష్మికి దుఃఖ హేతువే కదా. అసలు లక్ష్మికి తెలుస్తుందా అలా కట్టెయ్యక పోతే ఎలా వుంటుందో..? ఇది బాగుంటుందో అది బాగుంటుందో పోల్చుకుని చూసుకోగల విచక్షణ. ఏమిటో ఆ ఆలోచనకే నవ్వు వస్తోంది.

వీరాయో, గంగో చూస్తే నవ్వుకుంటారేమో వాళ్ళకు ఒకటే ఆశ్చర్యం, అమ్మాయి గారు అలా దొడ్లో కూర్చుని రాసుకుంటూ ఒకటే నవ్వుకుంటారు, కళ్ళ నీళ్ళు పెట్టుకుంటారు అని, మొన్నెప్పుడో అంది కూడా గంగి, అమ్మాయి గారికి దిష్టి తాడు కట్టించండి ఆంజనేయ స్వామి గుడి పంతులు గారిని అడిగి అని. అది అనుకుంటూoదేమో నాకు పిచ్చి అని.

పక్కన ఎక్కడో దక్షిణపు పక్క మూలకున్న వేప చెట్టు ఆకులు దొడ్డి మొత్తం పరుచుకుపోయినాయి బావా!. ఎంతందంగా వున్నాయో పచ్చ పచ్చగా.. నువ్వేమి చేస్తుంటావో ఇప్పుడు కాలేజ్‌లో వుంటావేమో కదు.. నేను ఇంత తలచుకుంటాను కదా బావా ఒక్క సారన్నా కొర పోదా నీకు? చాలా రాయాలని వుంటుంది రోజు ఇక్కడ జరిగే ప్రతి చిన్న విషయం చెప్పాల్ని వుంటుంది, ఇది వరకు కూడా నీకు చెప్పినా, శెలవలకు నువ్వు వచ్చే వాడివి కదా చెప్పినవన్ని మళ్ళీ చూసే వాడివి.... ఇప్పుడూ....!!! రెండేళ్ళయ్యింది, ఎన్ని పండగలు ఎన్ని విషయాలు జరిగేయి.. ఒక్క దానికి కూడా నువ్వు లేవు.

దిగులుగా వుంది బావ! గుండెలోని గుబులంతా ఏమని చెప్పాలో ఎలా చెప్పాలో కూడా అర్ధం కావటం లేదు. మొన్న పక్కింటి రంగయ్య తాత ఇంకా మీ బావకు నువ్వేమి గుర్తుంటావే.. అక్కడే ఎవరో ఒక తెల్లమ్మాయిను చూసుకుని ఉంటాడు అన్నాడు వెక్కిరింతగా. ఖచ్చితంగా అది నిజం కాదు అలా ఏమి జరగదు నువ్వు ఎప్పటికి నా వాడివే అని తెలుసు కాని ఎందుకో దుఃఖం సాయంకాలం నీడల్లే నా మీదకు దీర్ఘంగా పాకేసింది. ఇంకా ఎన్నాళ్ళు బావా? ప్రతి సారి వస్తానంటావు రానంటావు. ఈ సారి సంక్రాంతికి ఖచ్చితంగా వస్తావనుకున్నాము. అత్తయ్య కూడా ఎంతో దిగులు పడుతోంది. మొన్న సోది అమ్మి వస్తే అడిగింది: నువ్వు ఎప్పుడు వస్తావు? మన పెళ్ళి ఎప్పుడు అవుతుంది? అని. చారెడు బియ్యం పోయించుకుని అమ్మి శ్రీనివాస కల్యాణం లెక్క ఘనంగా జరుగుతుంది మన పెళ్ళి అని చెప్పింది. అయ్యో అంత అప్పు అవుతుందా మావయ్య వాళ్ళకు ఐతే పెళ్ళికు అని అడుగుదామనుకుని అత్తయ్య తిడుతుందని ఊరుకున్నా.

అబ్బ ఒక కాగితం కూడా పూర్తి కాలేదు అప్పుడే గడ్డి వాము నీడ తిరిగింది.. అరటి పిలకల పక్కన మురుగులో చంద్రకాంత పూల మొగ్గ పెద్దది అవుతోంది. ముళ్ళగోరింట పూల ఆయువు ఇంక పూర్తిగా గాలి దేవుడి ప్రతాపం మీదే ఆధారపడిపోయింది. మన పూల కోడికి మాత్రం ఇంకా పొద్దు అవ్వలేదు కదా పిల్లలనేసుకుని హడావుడిగా ములగ చెట్టు దగ్గర తిరుగుతోంది.

ఏమిటో బావ గొంగళి పురుగుల కోసం పూల కోడి, పూల కోడి కోసం తెల్ల రెక్కల గద్ద, ఎక్కడో పెరిగిన వేట పోతు కోసం మనం, మన కోసం గవర్నమెంట్ అధికారులు ఇది ఒక ఆగని చక్రం కదా. వీటన్నిటికి అతీతంగా నీ కోసమే కాచుకుని కూర్చున్న ఈ పిచ్చి పద్మ. హ్మ్ నిరీక్షణ ఎప్పటికి పూర్తి అయ్యేనో.. శ్రీనివాస కల్యాణమెన్నటికో అందాక ఎదురు చూస్తూ..

నీ

పద్మ.

అమ్మయ్యో వీరాయి కి మన క్రరోడి గిట్టల చప్పుడు కూడా వినపడినట్లుంది కుడితి కలపటానికి వెళుతున్నాడు. సరే బావ నిజం గానే వుంటాను. ఫోన్ చెయ్యమని చెప్పమన్నారు నాన్న, మావయ్య కూడా.

*ప్రియమైన నా పిచ్చి మరదలికి,*

మన వూరి కబుర్లను నీ బెంగను కలిపి తామారాకు మధ్యలో కట్టిన కనకాంబరాలంత ఫ్రెష్‌గా నా ముందుంచింది నీ కబుర్ల కదంబ మాల. అది కాదు రా నల్ల బంగారం.. ఎన్ని సార్లు చెప్పేను మీకు మాకు ఒక రాత్రి పగలు తేడా వుంటుందని. నువ్వు మధ్యాన్నపు వెలుగు నీడలను నీ పవిట చెంగున కట్టి కలయ తిప్పేటప్పుడు నిశి రాతిరి నీడల మధ్య నిద్రా దేవితో నా సావాసం, నువ్వు కట్టిన వెలుగునీడల మూట పొద్దుటే నే విప్పుకుంటున్నప్పుడు సాయం సంధ్యతో నువ్వు కలిసి వేసే జడ కోలాటం వివరాలు ఎన్ని సార్లు చెప్పినా మర్చిపోతావేరా?

నేనూ చాలా మిస్ అవుతున్నాను మన ఊరును, సంక్రాంతి సంబరాలను. ఈ సారి నిజంగానే వద్దామనుకున్నాను కాని అనుకోకుండా మంచి రిసెర్చ్ వర్క్ ఒకటి వచ్చింది రా. ఈ అసిస్టెంట్ షిప్ చేస్తే తొందరగా పేపర్ సబ్‌మిట్ చెయ్యొచ్చు అందుకని ఆగిపోయాను. నేను ఇక్కడ పని చేసుకుంటున్నా నా మనసు అంతా మన ఇంట్లోనే వుంది. నాన్న మావయ్య ఇద్దరు నేను పంపించిన స్వెటర్‌లు వేసుకుంటున్నారా రాత్రి పొలం దగ్గర పడుకునేప్పుడు? టార్చి లైట్ మర్చిపోవద్దని చెప్పు, నువ్వు మర్చిపోకుండా ప్రతి రోజు వెళ్ళేప్పుడు చూడు చేతిలో వుందో లేదో లైట్.

ఇక్కడ చాలా చలిగా వుంది. ఇంకా స్నో పడ లేదు కాని చలి మాత్రం విపరీతంగా వుంది. ఇక్కడ వాళ్ళ సంక్రాంతి నవంబర్ లోనే వస్తుంది. రెండు వారాల క్రితమే ఐపోయింది సంక్రాంతి ఇక్కడ. అరిసెలు, పొంగల్ తినలేదు కాని వీళ్ళు వండుకునే గిన్నెకోడి, మొక్కజొన్న పొత్తులు తిన్నాను. మా ప్రొఫెసర్ పిలిచింది అని చెప్పేను కదా భోజనానికి. ఈ రోజు పని ఐపోయింది ఇప్పుడే రూంకు వచ్చి తిని కూర్చున్నా నీకు వుత్తరం రాసి హోం వర్క్ చేసుకుందామని. నాకు తెలుసు నువ్వు నవ్వుతావు పెద్ద అయ్యాక కూడా ఇంకా హోంవర్క్ ఏమిటి బావా అని.

పద్దూ ఈ మిస్ యూ సో ముచ్ రా! ఒక్కడినే కూర్చుని నీకు వుత్తరం వ్రాస్తుంటే నా మనసంతా నీ కాలి గజ్జెల సవ్వడిలో లీనమయ్యి నీవు సిగ్గు పడుతూ వాల్చిన నీ కనురెప్పల నీడలలో కలిసి ఏకమయినట్లుంది రా. అలాంటి నన్ను నా మీద అంత అపవాదు వేస్తావా? నిను వలచిన మనసుతో ఇంకొక ఆలోచన రాగలదనే ఊహే నాకు అయిష్టంగా వుంది. తాతకు చెప్పు అమ్మాయి అంటే పడకింటి భోగ వస్తువుగా చూసి గుటకలు వేసే వాళ్ళ తరం నుంచి, స్త్రీని తోటి మనిషిగా మనసున్న ఒక అపురూప సంపదగా భావించే తరం వచ్చిందని. నువ్వు మన పెరడులో ఉసిరి చెట్టు పక్కన కూర్చుని రాసిన ఈ కాగితం ఎన్ని సుగంధాలను తోడు తెచ్చిందనుకున్నావు? నువ్వు చెప్పినవే కాదు... చెప్పని చెప్పలేని ఊసుల మాలలను పెనవేసుకుని కాగితానికి అలముకున్నట్లున్నాయి సుగంధాలు.

హేమంత కాలాన ముకుళించుకున్న పద్మాలున్న కొలనులో విరిసిన పద్మపు శోభ చూడటానికై ముసిరిన భ్రమరాల మధ్య కోనేట మునిగి హైమవతి తపస్సు చేసిందట శివుడి కోసం. హేమంతాన మన ఊరి చెరువు మీద పొగ మంచు పేర్చిన మబ్బు తెరలను, తెరల మధ్య సూరీడు కోసం వెతుకుతూ బిక్క మొఖం పెట్టిన పద్మాల పక్కన వయ్యారాలు వొంపుతూ బిందె నింపే పద్మమొకటి కన్నుల ముందు మెదిలింది.

మంచి ఆలోచన పద్దు స్వేచ్ఛకు కట్టివేయబడటానికి తేడా మన లక్ష్మికు తెలుసా అని అడిగేవు. ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదు కాని చాలా మంది మనుష్యులకు తెలుసా? స్వేచ్ఛకు కట్టివేయబడటానికి మధ్య తేడా......ముఖ్యంగా ఆడవాళ్ళకు. తరతరాలుగా రక రకాలుగా కట్టివేయబడుతున్న స్త్రీకు కట్టించుకున్న తాడు రంగు, నాణ్యతతో చూసి మురవటం చూస్తుంటే మరి నాకైతే తేడా తెలియదనే అనిపిస్తుంది మనకే తెలియనప్పుడు ఇంక ఆవుకేమి తెలుస్తుంది చెప్పు. సమాజంలో తాడు పెద్దది గా చేసి ఒక గాడిలో తిప్పుతుంటే తిరిగే అందరికి అసలు తాడే లేని స్వేచ్ఛను అనుభవిస్తే కాని అంతకు ముందు చేసిన దాస్యపు నీచత్వం అర్థం కాదు. కాని తాడు వదిలే దెవ్వరు, వదిలినా అర్థం చేసుకునే మనఃశరీరాలతో ఈ సమాజం మనగలదా వికృత రూపాలు ధరించకుండా.. హ్మ్.. ప్రశ్నలను దద్దోజనంతో కలిపి ధనుర్మాసపు నైవేద్యంగా రాముడికి పెట్టి కృష్ణయ్య గుండెలో కొలువైన దేవేరి తలపులను సమీక్షించుకుంటూ ఈ రోజుకు శెలవా మరి..

**ఎప్పటికి నీ వాడు.**

✡ ✡ ✡



# లేఖాయణం

## ఉమ యేలూరి



**రమా,**

నేను బానే వున్నా, నువ్వు ఎలా వున్నావు? మావయ్య వాళ్ళు అందరు బాగున్నారా? దుర్గ బాగుందా? చిన్న మావయ్య వాళ్ళు కూడా బానే వుండి వుంటారు. చాలా రోజులయ్యింది నీతో మాట్లాడి, మొన్న సంక్రాంతి శెలవలకు అమ్మ పంపిస్తానని అంది. నేను బట్టలు సర్దుకున్నాను, అమ్మతల్లి వాళ్ళకు అందరకు చెప్పేసేను కూడా. కాని పండగకు రెండు రోజుల ముందు రాంబాబు చని పోయాడు. ఇంక నాన్న ఎక్కడకు వద్దు అన్నారు. నాకే ఇంక అసలు రావాలనిపించలేదు. పాపం మా రాంబాబు ఆత్మహత్య చేసుకున్నాడు తెలుసా... బలే బాధ, భయం వేసింది.

ఇంక సంక్రాంతి శెలవలు రెండు రోజులలో మొదలవుతాయి అనంగా రోజు పొద్దున్నే నేనేమో టిఫిన్ ఒక చేత్తో, పుస్తకం ఒక చేత్తో స్వాహా చేస్తూ బుర్రలో ఒక పక్క సిలబస్ ఇంకో పక్క అమ్మ తిట్లు ఎక్కించుకుంటున్నా. నాయుడు తాత గారు వాళ్ళ తలుపు తీసుకుని పరుగెత్తుకుని వచ్చారు ప్లీడరు గారు రాంబాబు మాట్లాడటం లేదు అని. నాన్న అమ్మ, వెళుతూ.... నాన్న పైన రాఘవరావు మాష్టారును పిలిచారు ఆయన నేను శేషు అందరం పరుగెత్తుకుని వెళ్ళేము, డాబా మీద పెద్ద పట్టె మంచం పైన పడుకుని వున్నాడు. పక్కన ఏదో కాగితం వుందనుకుంటా నాన్న తీసి లోన పెట్టేసేరు, రామచంద్ర మావయ్య గారికి ఇంకా అందరికి ఫోన్‌లు చేసేరు రిక్షా లో హాస్పటల్‌కు తీసుకుని వెళ్ళేరు.

ఇంక తరువాత నాలుగు రోజులు ఎలా గడిచాయో ఎవ్వరికి వూహ కూడ లేదు. మామ్మ గారు వచ్చారు, విశాలక్క, శేషు అక్క, హర్ష మావయ్య అందరు వచ్చారు. అందరు పాపం తాత గారిని తిట్టేరు... యన మూలం గానే ఇంత జరిగింది అని, రోజు విశాలక్క అమ్మ దగ్గరకు వచ్చి ఏడ్చేది పాపం. మూడో రోజు చచ్చి పోయాడు రాంబాబు అంతకు ముందు వారమే నన్ను "ఏమే లింకా బాగా

చదువుతున్నావా లెక్క లు అర్థం అవుతున్నాయా లేకపోతే అడుగు" అని పలకరించిన రాంబాబు, కనపడినప్పుడల్లా "ఏమే జాంకాయల కోసం నిన్న దూకింది గోడ నువ్వే అంటగా" అని వుడికించే రాంబాబు ఇంక ఎవ్వరికి తెలియని లోకాలకు వెళ్ళి పోయాడంట రమ. రమా పది రోజుల నుంచి వాళ్ళందరి బాధ చూస్తుంటే రాంబాబు మీద బలే కోపం వస్తోంది, పద్మక్క ఐతే ఎట్లా ఏడుస్తోందో అమెరికా నుంచి వచ్చిన దగ్గరనుంచి, పాపం అన్నం కూడా తినటం లేదు. అంత మంది ప్రేమించే వాళ్ళు వుండగా నాకు ఎవ్వరు అక్కరలేదు అని ఎలా అనుకోగలిగాడో...

మనం పిరికి వాళ్ళు ఆత్మహత్య చేసుకుంటారు అనుకుంటాము కాని, నిజానికి ఆత్మహత్యకు ఎంత ధైర్యం కావాలి కదా.. పది రోజుల నుంచి నాయుడు తాత గారి డాబా మీద పద్మ అక్కకు మందులు ఇవ్వటానికి అన్నం పెట్టటానికి నన్నే వుంచారు అక్క నాతోనే కదా మంచిగా వుంటుంది మరి. గుర్తు వుందా నువ్వు వేసవి కాలం శెలవలకు మొదటి తడవ వచ్చి నప్పుడు చూపించా కూడా, డాబా మీదే నాయుడి తాత గారి గతించిన గత వైభవ చిహ్నలుగా పెద్ద సోఫాలు, దివాన్‌లు పేద్ద పేద్ద బీరువాలు, పేద్ద పేద్ద మంచాలు దాని పందిరికోళ్ళు, ఎంత అందంగా కాని దిగులుగా వుంటాయో. దిగులుకు తోడు పక్కన వరండా పిట్టగోడ నిండా పాకిన రాధా మనోహరాల సువాసనలు. అన్ని సార్లు పరిమళాలు మంచి తలపులను ఆహ్లాదాన్నే కాదు ఒక్కోసారి పరిమళాలు కూడా ఎంతో గుబులు దిగులును లేప గలవు కదా.. అసలే గత వైభావల దిగులుకు ఇప్పుడు రాంబాబు చేసిన పనితో ఇంకా వాతావరణం గాలిలో కూడా బాధ సాంద్రత, దుఃఖపు ఆర్ధ్రత వెయ్యి రెట్లయ్యి నెమ్మదిగా వీస్తూ వుక్కల చిరాకులతో కలిపి విసిగిస్తోంది అక్కడ ఇప్పుడు.

అక్కడే నేను చదువుకుంటూ వుంటే పద్మక్క రాంబాబు కబుర్లు చెప్పుకుంటూ వుండే వారు, నాకు వినపడటం లేదు అనుకుని అక్క తన యూనివర్సిటి ప్రేమ కథ అంతా అక్కడే రాంబాబుకు చెప్పి, ఇద్దరు తాత గారిని, మామ్మ గారిని ఇంకా అందరిని ఎలా వొప్పించాలో తర్జన భర్జనలు పడుతుంటే అప్పట్లో అదే పూల గాలి ఎన్ని మధురమైన ఆశలను చిరు గాలితో కలిపి, వుక్కపోసిన తనువు కు స్వాంతనను, వుక్కిరి బిక్కిరిగా వున్న అక్క వాళ్ళ ఆలోచనల క్రమానికి విశ్రాంతిని ఇస్తుండేది. ఇప్పుడు అక్కడే అక్కను నిండు నెలలతో అలా మంచం మీద పొడుకుని అవి అన్ని తలచుకుని ఏడుస్తూ వుంటే రాంబాబు ఆత్మ అక్కడే తిరుగుతూ అవి అన్ని పద్మ అక్కతో పంచుకుంటున్నాడేమో అనిపించింది నాకు

అవును రమా ఎవరైనా ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారు? ఇంక జీవితం మీద అశ లేకనా? ఇంక జీవితంలో ఏమి సాధించలేము అని వాళ్ళకు ఖచ్చితంగా తెలిసి పోవటం వలనా? ఎవరికైనా భవిష్యత్తులో ఏమి అవుతుందో తెలియదు కదా ఇంక ఏమి సాధించలేము అని ఎలా అనుకుంటారు? అది కాదేమో కారణం. ప్రస్తుత ఆలోచనలకు ఆశలకు ఆశయాలకు తీరని తీవ్ర అఘాతం ఏర్పడి ఇంక ముందు జీవితమంతా అగమ్య గోచరమై, బతుకు బాట ఇక్కడితో ముగించి కొత్త బాట పట్టాలని ఆశ తోనేమో.. ఐనా తెలిసి తెలిసి......... రేపనే ఒక రోజు నాకొద్దు అని తనకు తానే నిర్ణయించుకుని ఈ క్షణంతో ఆఖరు ఈ వూపిరి అనుకోవాలంటే అమ్మో వూహే వెన్నులోనుంచి వణుకు తెస్తోంది కదా.. ఎన్నో తెలిసి, ఎన్నో చదివిన వేదాంతులు లేదా జీవితాన్ని నెమ్మదిగా అనుభవించి, పరి పూర్ణమైన పెద్ద వాళ్ళు చిరునవ్వుతో "ఇంక మా పాత్రలు చాలు ఈ జీవిత నాటక రంగపైన, పైన వాడి పిలుపు ఎప్పుడొచ్చినా ఆనందమే" అనటం చూసాను కాని, చాలా వరకు పెద్ద వాళ్ళు కూడా ఇంకా తాపత్రయం పడుతూ ఆశలు పెంచుకుంటూ వుంటారు కదా అలాంటిది అంత చిన్న వయసులో అలా ఎలా నిర్ణయం తీసుకోగలిగాడో రాంబాబు.

కారణం ఏదైనా ఫలితం మాత్రం అంతు చిక్కని వేదనను, ఆ కారు చిచ్చును వాళ్ళ కుటుంబం లో రేపింది. తెలియని దేవుడి కి తలవొంచి మొక్కుతూ అడుగుతున్నా ఏమి ఆశించి రాంబాబు ఈ పని చేసేడో ఫలితాన్ని ఐనా ఇచ్చి కుటుంబాన్ని ఒక దరికి చేర్చు స్వామి అని. వింటాడంటావా?

- ఉమ

✡ ✡ ✡

**ఉమా,**

నీ వుత్తరం అందింది, మొన్న నాయనమ్మకు వొంట్లో బాగోలేదని అత్త రావటంతో నువ్వు వుత్తరంలో చెప్పని కబుర్ల వివరం కూడా పూర్తిగా తెలిసింది. ముందుగా నీ పరీక్షలలో ఫస్టున పేస్ ఐనందుకు శుభాకాంక్షలు. నాకు తెలుసే నీ పట్టుదల నిన్ను తప్పక నువ్వు అనుకున్న గమ్యానికి చేరుస్తుంది. పట్టుదలకు అదృష్టం తోడైతే నీ వనుకున్న గమ్యానికి చేరే దారి నీకు సులువుగా కనపడుతుంది. కనపడిన దారిలోని ముళ్ళు పువ్వులుగా చేసుకుని సాగే ధైర్యం తోడైనప్పుడు నడక కూడా సుగమం అవుతుంది. నడకలో అలసట కమ్మి, కష్టం కారు చీకటై ముంచేసి, ధైర్యాన్ని నీరు కారిస్తే అదృష్టం భయపడి వెనక్కు పరుగెడుతుంది.

నేను పైన రాసింది మామూలుగా మన వంటి మధ్య తరగతి కుటుంబాలలో పెరిగే వాళ్ళ గురించి చెపుతున్నా. ఇంక ఎంత పట్టుదల వున్నా పరిస్తితుల ప్రభావానికో, దురదృష్టం విడువని చెలిమి వలనో, అపజయాల పరంపరను జీవితపు కొంగున కట్టి బరువు ఎక్కువైనప్పుడు తెలియకుండానే మునిగే వాళ్ళు అలానే కొన వూపిరితో ఈదే వాళ్ళు, బరువు భారానికి ఈడుస్తూ నడక సాగించే మధ్యతరగతి మందహాసాలు కూడా వుంటాయి, ఇది చదువుకే కాదు జీవితానికి కూడా వర్తిస్తుంది. అవి ఇంకా మనకు పరిచయం కాక పోవటం వలన రాంబాబు చేసిన పని నీకు అంతు లేని ఆశ్చర్యాన్ని కొండకచో తనిపై ఆగ్రహాన్ని రప్పిస్తోంది.

అవును ఇక చాలు అనే చాలా ధైర్యమో, ఈ సమస్యకు ఇదే పరిష్కారమనే వెర్రి ఆవేశమో, లేదా వివరం తెలియలేనంత దుఃఖమో మనిషి ని కమ్మినప్పుడు చావు ఒక్కటే వాటన్నిటికి పరిష్కారమల్లే తోస్తుంది. అంతే కాదు ఇంకో పక్కన మనకు తెలియని ఆనందం వుందన్నపిలుపుల ఆశ కూడా ఒక్కోసారి ఇలాంటి పనులకు పురికొల్పు తుంది. నాకు ఏదో పెద్ద తెలుసు అని కాదు కాని నా పరిధి లోని వితరణ ఇది.

అంతా ఐపోయాక దుఃఖపడటం తప్పు అని నేను అనటం లేదు, అలానే వాళ్ళ దుఃఖంలో న్యాయం లేదు అందులో నిజాయతి లేదు అని కూడా నేను అనటం లేదు. కాని ధర్మారావు తాత గారి రాంబాబు విషయంలో మాత్రం అతనిని ఒక్కడిని సమస్యల వలయంలో ముంచి ఎవరికి వారు పక్కకు తప్పుకున్నారేమో అనిపిస్తోంది నాకు. ఆలోచించు. వయసులో మామ్మ గారు, తాత గారిని వదిలి విశాలక్క దగ్గర వుండటంలో ఆమె చిన్నతనం నుంచి పడిన వేదన, ఆక్రోశం కనపడుతోంది నాకు. పాపం ఎప్పుడూ అవమానాల, విదిలింపుల లెక్కలేని తనంలో వంట ఇంటికి మారాణి ఆమె. అవును పలుకలేని కుండల, చట్టుల మధ్యలో తేలి వస్తున్న పొగ లమధ్యన తేలుతూ ఒక నడిచే ప్రేతమల్లే వుండే వారు ఆమె నాకు, మీరంతా (నువ్వు కాదులే అత్త, మావయ్య ఇంకా అందరు) ఆమె చాలా సహన శీలి, చాలా వుత్తమ ఇల్లాలని ముద్రలతో బరువులతో పాపం ఇంకా కుంచించుకు పోతూ వుండేవారు అనుకుంటా.

ఆమెకు ఎందుకు  అంత విసుగు వచ్చిందో? పిల్లలు పెద్ద అయ్యి అల్లుళ్ళ ముందు కోడళ్ళ ముందు కూడా  ముండరికాల గోలలలో ఆమె ఆత్మ ఎంత క్షోభించి....... తన మాట చెప్పుకోగల కూతురు అల్లుడి దగ్గరకు వెళ్ళి వున్నారో మనకు తెలియదు కదా. కాని సమస్య ఏదైనా, ఎవ్వరు దానికి పరిష్కారం వెతక కుండా ఎవరికి వారు మాకెందుకులే, మొదలు పెడితే ఎటు వెళుతుందో మౌనంగా గడిచి పోని, కాలమే పరిష్కరిస్తుంది ఇప్పుడు బజారున పడటం అవసరమా అనుకుంటూ ఒక అగ్ని పర్వతం రగులుతూ నీలి మంటలు కనపడుతుంటే పేలనీ చూద్దాములే అన్నట్లు నిర్లక్ష్యం చేసేరు. మరి రాంబాబు ఒక్కడే ఎందుకు మొదలెట్టేడో ఈ సమస్యకు పష్కారం కనిపెట్టాలని పిచ్చి ప్రయత్నం.  ప్రయత్నంలో అన్నిటా విఫలమయ్యి తన మరణమే మొత్తాన్ని కలుపుతుంది అని అంత అమాయకంగా ఎలా అనుకున్నాడో మరి. ఏది ఏమైనా తని నిండు జీవితం బలై పోయింది సమస్య పరిష్కారమవటం బదులు పూర్తిగా నిందారోపణలతో పగిలిపోయింది.

చాలా సార్లు, చాలా చోట్ల ఇటువంటి అసంతృప్తితో రగిలే కుటుంబాలు కనపడుతూనే వున్నాయి మనకు. కాని మనకెందుకు....!!!! మనం మధ్యలో కల్పించుకోవటం అనవసరం .........అనే ఎవరికి వారే తరహాలో, కొత్త గా నేర్చుకున్న సో కాల్డ్ కల్చర్‌తో సమస్య పరిష్కారానికి తోడ్పడం, కాని ఎప్పటి నుంచో అలవాటైన  పాత విలువల కెలిడియోస్కోప్ లో చూసి వాళ్ళను ఎక్కిరించటానికి మాత్రం వెనుకాడం..

పాత లోని రోత, కొత్త లోని చెత్త రెండిటిని తీసుకుని ముందు తరాలకు సాగుతున్న ప్రతినిధులం కదా మరి. సున్నిత మనస్కులకు, పిరికి వాళ్ళకు ఇలాంటి దారి తోచి మన సమాజాన్ని ప్రశ్నించినప్పుడు......... ఒకింత ఆగి  భుజాలను తడుముకుని ఏదో చొప్పదంటి సమాధానాలతో మనలను మనం, బయటి వాళ్ళను మోసపుచ్చుకుని..... అల్ ఈజ్ వెల్..... ఎవ్వరి వన్ ఈజ్ హేపీ అనుకుని సాగిపోవటం ఒక్కటే జరుగుతున్న విషయం. మారుస్తావా.. మార్చు.. ముందు నీలోని విలువలను నీ అంతరాత్మను మార్చు...

ఏ విలువను నువ్వు నమ్ముతున్నావో అది ముందు గా ఆచరించు, నీ జీవితంలో అనుష్ఠానించు, తరువాత నీ కుటుంబంలో నీ బిడ్డలలో  విలువలను నాటు....  మార్పు ఎక్కడో కాదు ముందు మనలో రావాలి.. అపుడు మారిన నువ్వు, మార్చబోయే వేయి మంది కు కర దీపికవవుతావు.  కుటుంబంలో మార్పు ఏమో కాని భావి తరాల కుటుంబాలలో ఇటు వంటి కథలు పునరావృతం కావు. అదే నీ రూపం లో నీలో వున్న దైవత్వం నీకు నాకు ఈ సమాజానికి కి ఇచ్చే వరం. రాంబాబు వంటి వారికి మనం ఇవ్వగల వుపశమనం.

-రమ

✡ ✡ ✡






## అంతులేని దూరం అంతమయ్యేచోటు

నల్ల పొన్ను,

కాస్త కాస్తగా కరిగిన హృదయపు ముక్క నుంచి జాలువారే వేదనను, ఈ రాత్రి ఎంతకు అంతమవ్వని చీకటిగా మార్చి, ఎదురుగా సముద్రపు నీళ్ళ మీద గాలి పంకాలతో కలిపి కొడుతున్నదేమొ! సంగమం దగ్గర నది జాలు వార్చే జాలి పాటలలో ఎప్పుడూ వినపడే మధు మాసగీతికలు, మల్లెల ఖవ్వాలిలూ వినిపించటం లేదు మరి.. నువ్వు నా పెదవి మీద నవ్వై మెరిసి ప్రతి క్షణం పలకరించాలని ప్రయత్నిస్తున్నా, నాకేమో నిన్ను ఈ రాత్రి, ధరిత్రి గుండె మీద మెరిసిన కన్నీటి మంచు బిందువులానే పలకరించాలని ఉంది.

ఆశావాదపు అంచున చందమామ ముక్కపై మేఘాల మబ్బులతో నువ్వు, నిరాశావాదపు మత్తులో జోగుతూ నిద్రా దేవతను శపిస్తూ నేను... విరిసే ఉదయాన, మెరిసిన పువ్వుల తొలి దరహాసమై నువ్వు..... నిన్న రాత్రి వడలిన ఆశలతో, రేపును ఎడారి ఉష్ణపక్షిలా వెతుకుతూ అంగలారుస్తూ నేను... ఎలారా చిన్నా కలిసేది?

ప్రతి రోజును ఒక ప్రశ్నార్ధకమై నా ముందు ఉంచుతుంది ఈ శిశిరం. మొదలు వొరిగిన మానులా, కూలిన నా మోడు వారిన కొమ్మ కొమ్మన, పువ్వుల నవ్వుల్లా అలంకరింపాలని నువ్వానతించి పంపిన మంచు, తళుకు బెళుకుల సోకును తోడు తెచ్చుకుని వస్తే, కలవరింతలనే వరించిన నా మనసు వాటన్నిటిని కన్నీటి వరదలో ముంచేస్తోంది. నువ్వు, నీ ప్రేమ.... ఉప్పెనలా వచ్చి ముంచేస్తే తప్ప, చిరునవ్వుల చిరుజల్లు........ విరబూసే కన్నీటి పూతోటలలో ఏమి లెక్క చెప్పు!?

కాలం ఎవరితో నిమిత్తం లేకుండా సాగిపోతోంది అంటారు మిత్రులందరు, నాకెందుకు కాలం నీతోనే ఆగిపోయి ముందుకు కదలనని మొరాయిస్తోంది. నాలోని లోపమా? నీ లోని మహిమా ఇది...!? ఏదేమైతేనేమి నేను లోకానికి వ్యర్థంగా మిగిలిపోయాక. ప్రేమ అంటే ఇంత విషాదమా.....!!!! "ప్రేమ జీవితం లో ఒక భాగమే కాని, ప్రేమే జీవితం కాదు. జీవితం ఆగక నిరంతరం సాగే ప్రవాహం. ఒక పాయ పక్కకు మళ్ళిందనో, ఇంకో పాయ వచ్చి కలిసిందనో ప్రవాహం ఆగదు కదా, సాగుతూనే వుంటుంది అను నిత్యం తనతో కలిసే కదలికలను తనవిగా చేసుకుని" అని చెప్పి నువ్వే ఇప్పుడు జీవితాన్ని కదలని కుళ్ళు నీరులా చేసుకుంటున్నావే అని అడిగింది సుగుణ నిన్న.....

సమాధానమే లేని ప్రశ్న కు నేనేమని బదులివ్వగలను? ఇచ్చినా అర్థం అవుతుందా..!!!!! అడిగేసి, కదిలిపోయే ప్రవాహమల్లే పక్క వాళ్ళతో గల గల మంటూ వెళ్ళి పోయింది ఆమె, నన్ను నా మౌన సముద్రం లోకి తోసేసి... నెమ్మదిగా  సముద్రపు వొడ్డున మన జ్ఞాపకాల శంఖులను ఏరి ప్రేమ రాగం కడదామని వూదుతుంటే ఖాళి నుంచి గాలి బుసలు కొడుతూ వెళ్ళి పోతోంది తప్ప ఒక్క రాగమైనా స్వరపడదే.. గాలి వాలుకు ఎగిరే నీ కొంగును దోపి అలలతో పాటు పరుగెడుతూ..... నువు పెట్టే గస జంట శృతిలో సాగక పోతే, రాగం రానని పచ్చి కొట్టి పోయింది రా.

ఒక్క మనిషిలో ఇంత ప్రేమను వూహించుకుని బాధ పడటం నీ మూర్ఖత్వం అని ఒక ముక్కలో తేల్చేరు మొన్న రాత్రి సాహిత్య సభలో శ్రీధర్ బాబు గారు. అవునా నీలో నేను ప్రేమను ఊహించుకున్నానా... అవునా..? అసలు ఏ మనిషికి ఐనా ఇంకొకరి మీద ప్రేమ ఎందుకు వస్తుంది... న్యూటన్ సూత్రాలల్లే ఈ ప్రేమ ఎలా ఎప్పుడు పుడుతుంది..? దాని సరి ఐన వ్యతిరేక ప్రమాణమేమి..? అది ఎలా పని చేస్తుంది.? అని ఎవరైనా సూత్రీకరించి పెట్టకూడదు, చదువుకుని, ఈ ప్రపంచంలో జరిగే అద్భుతమైన అనుభవాలన్నిటిని, వాటి గొప్పతనం గుర్తించకుండా కనీసం అనుభూతించటం కూడా మానేసి, మాకు చిన్నప్పుడు 5 వ తరగతిలోనే చెప్పేరు అని బడాయి పోయే కుర్రవాడికిలా, వో ఇవన్ని మాకు తెలుసు, ప్రేమ గతి ఇంతే, దాని చలన సూత్రాలివి..... అని చెప్పేవాడిని.

ఇలా ఆలోచిస్తూ  రాత్రి, సమూహానికి దూరంగా, సాహిత్యానికి కూత వేటులో కూడా అందకుండా, ఎప్పటిలానే ఒక్కడినే సముద్రపుటొడ్డున మన పరిచయమైన మొదటి రోజులను, ప్రేమ సుగంధం ఇక్కడ అక్కడ అని లేకుండా మన ప్రపంచాలను పూర్తిగా చుట్టేసి,  మత్తులో భరించలేని సంతోషాన్ని, కన్నీళ్ళ తో మనం పంచుకుని  ప్రేమ విజయాన్ని సెల్రబేట్ చేసుకున్న కాలాన్ని, కళ్ళ ముందుకు తెచ్చుకుని..  సంబరాన్ని ఇప్పుడూ మూడో వ్యక్తి లా సమీక్షించటానికి ప్రయత్నించాను ప్రశ్నకు సమాధానం దొరుకుతుందేమో అని.

సమాధానమేమో కాని ఎంత ఆనందం దొరికిందిరా ఆ ప్రయత్నం లో! నీవు నాతో పంచుకున్న నీ అనుభవాలను నీకే ఇంకో సారి వినిపించనా ఈ వేళ.  ఊహూ నా వలన కావటం లేదు నా మాటలలో, సరే నీ ఉత్తరాలనే నీకు చదివి వినిపిస్తా ఈ పూట..

"కృష్ణ మిమ్ములను మొదటి సారిగా......  ఇరుకు రోడ్ లో, చీకటి సగం వెలుతురు సగం పోటీలు పడుతున్న రూంలో, మొదటి సారిగా చూడగానే, నాకు ఒక్కసారి ఉరికే వెలుగు వెల్లువలను సన్నాయితో కలిపి, విరపూసిన మందారాలను వేవేలగా నా కళ్ళముందు కుప్పలు పోసి వాటి మధ్య నేనెప్పటి నుంచో నా కలలో వెతుకుతున్న రాకుమారుడిని అభిషిక్తం చేస్తున్నట్లు అనిపించింది. అంతకు

ముందు నా స్నేహితులతో మొట్ట మొదటి చూపులో ప్రేమ అనే పదం గురించి వాదనలు చేసి, అది ప్రేమ కాదు ఆకర్షణ అని వాదించిన నా గొంతు, ఒక్క సారి మూగపోయి...... ఇదే ప్రేమ, ఇతనే నీ ఆత్మ వెతుకుతున్న జంట అని మౌనంగా చెప్పినట్లనిపించింది. మీరు తెల్లబోయిన నా మొహం చూసి తప్పు అడ్రెస్‌కు వచ్చాను అనుకుని "Excuse me what can I do for you?" అని అడుగుతుంటే మీ మనసు కావాలి ఇస్తారా అని అడగ బోయి, తమాయించుకుని ఏదేదో పిచ్చి పిచ్చిగా అంతూ పొంతూ లేకుండా మాట్లాడి వెళ్ళి పోయాను, నా మనసును మాత్రం భద్రం గా మీ గుండె జేబు లో మీకే తెలియకుండా పెట్టేసి''

రేయ్ నల్ల పిల్లా నువ్వు వూహించగలవా ఇది మొదటిసారి చదివినప్పుడు నా పరిస్తితి.. అంత వరకు నాకు నిజం గా ప్రేమ అంటే తెలియదురా. మధ్య తరగతి జీవితంలో వున్నత స్థానాలకు ఎదగాలని, ప్రతి క్షణం గమ్యం వైపుకు దృష్టి సారించి పరుగులు తీసే నాకు ఒక్క సారి జీవితంలో గమ్యానికి నిజమైన అర్థం తెలిసింది. నిన్ను మొదటి సారి చూసినప్పుడు నేను ఎవరు రా ఈ నల్ల పిల్ల, ఇలా వెర్రి మొహం పెట్టి నా తలపై నుంచి శూన్యంలోకి చూస్తోంది. ఏమి కంప్యూటర్స్ నేర్చుకుంటుంది రా నాయనా అనుకున్నా. నిజంగా అదే నా మొదటి ఫీలింగ్. ఆ మాట చెప్పినప్పుడు కోపంతో ఎర్రనైన నీ మోమును రాత్రి చీకటిని చీల్చుకుని ఆకాశం తూరుపు అంచున ఆనవాలు కనపడే దాకా తలచుకుంటూ...... నవ్వుకుంటూనే వున్నా.

ఇదుగో ఇంకో ముక్క నీ వలపుల గీతాంజలి నుంచి.

''అవును అందరు దేవుడు, ప్రేమికుడు, స్నేహితుడు, భర్త, చెలికాడూ వీటన్నిటికి ఒక్కొక్క అర్థం చెపుతారు... నాకు సంబంధించినంతవరకు అన్ని నాకు నువ్వే. పాత కథలలో భర్తను గొప్పగా ఆరాధించి ప్రేమించారు అని చదివి నవ్వుకునే దానిని, కాని నీ మీద ప్రేమ నాకు తటస్థించినాక ఇప్పుడు అర్థం అవుతోంది మిశ్రమ సమ్మేళనాల భావానికి అర్థం ఏమిటో!? ప్రేమించిన వాడిలో పరమేశ్వరుడిని చూడటం ఎంత తేలికైన పనో. పరమేశ్వరుడి అర్థ భాగంగా ఇమిడిన పరమేశ్వరి నేనయ్యాక జీవిత సాఫల్యానికి అర్థం తెలిసింది. కృష్ణుడి కోసం ఎంత మంది ఎంత విరహపడినా రాధ రుక్మిణి ఎప్పుడూ కోపగించుకోలేదట, నిలువెల్లా ఈ కృష్ణయ్యను నింపుకున్న ఈ రాధకు..... రుక్మిణికి అవసరం రాదని అనుభవైకవేద్యమయ్యాకే కదా తెలిసింది.''

నేనేమని బదులివ్వను, నీ ఆత్మ నన్ను నీ వశం చేసుకున్నాక, ఇంక నాదనే ఒక ఉనికినే కోల్పోయి నీ పాదా క్రాంతుడినైన నన్ను, ఏ గొప్ప వరం మూలంగానో తటస్తించిన ఈ గొప్ప సంబరాన్ని, ఎన్ని మాటలలో పలికించగలను చెప్పు! ఇంత గాఢమైన అనుభవం ఒకసారి కలిగేక ఇంక వేరే జీవితం వైపుకు ఎవరి చూపైనా మళ్ళ గలదా!?

ఇన్ని జీవితాలు.. ఎన్నెన్నో ఆలోచనలు.. కొత్తదనాలు, పాతదనాలు....... చిత్రమైన జీవిత పాట్లు, పేద, గొప్ప, ఆడ, మొగ ఎక్కువ తక్కువలు ఎందుకు ఇవన్నీ!? ఒక్కసారి ఆగి ఆలోచించమను అందరిని. వీటన్నింటి వెనుక అంతఃసూత్రంగా అందరికి కావల్సింది ప్రేమ కాదా, దాని కోసం కాదా ఈ పరుగులు? కాదు అధికారం కోసం, కాదు డబ్బు కోసం, కాదు సంతోషం కోసం అని వేరు వేరు సమాధానాలు ఇస్తారేమో అందరు. కాని వాటన్నిటికి వెనుక కారణం ప్రేమే కదా! కుటుంబం మీద ప్రేమతోనో, తన మీద ప్రేమతోనో, పేరు మీదనో, పదవి మీదనో, అధికారం మీదనో.... ఒక వస్తువు మీద ప్రేమ తోటే కదా ఈ ప్రపంచం తిరుగుతుంది! ప్రేమ మిమ్ములను నడిపిస్తుంది అంటే ఎందుకో ఒప్పుకోరు. పాతకాలం ఆలోచనలు, వేగమైన.... యంత్రయుగమైన కాలంలో పరుగెడుతున్నాము, పరుగెత్తు అంటారు. నువ్వు పరుగెత్తి సాధిద్దాము అనుకునేది నేను నా చెలి ప్రేమలో, నా చెలి గుండెలో నేనెప్పుడో సాధించాను అంటే ఎందుకో నన్ను జాలిగా చూసి, గొణుక్కుంటూ వెళ్ళి పోతారు.

నేను ఏడుస్తున్నానని, నిన్ను తలచుకుని కాలాన్ని నిరుపయోగం చేస్తున్నానని, నా తెలివి, నా శక్తి ఇతర వ్యవహారాలకు ఉపయోగించనని వీళ్ళందరి ఫిర్యాదు. నా మీది ప్రేమతో చెపుతారు. వాళ్ళను అంత బాధ పెడుతున్నందుకు నాకు సిగ్గుగానే ఉంటుందిరా. కాని ఒక్క సారి కళ్ళు మూసుకుంటే రా రమ్మన్న నీ పిలుపు, నీ వేలి కొసల నుంచి నా గుండెలోకి నువ్వు పంపిన విద్యుత్తరంగాలతో నా మనఃశరీరాలు అచేతనమయ్యాయి అని, వాటిని మళ్ళీ నువ్వు వచ్చి బంధ విముక్తులను చేస్తే గాని మోక్షం లేదని ఎలా చెప్పను!?

నువ్వు రావు..!!! ఇంతగా హృదయమంతటి తోను ప్రేమించి నా ఆత్మను కట్టేసి, నన్ను నిరుపయోగంగా చేసిన నా చెలీ...... రారాదా.. రావు కదు...... జీవితాంతం తోడుంటానని బాస చేసిన చెలికాడు, అడుగులో అడుగు వేసి కలకాలం తోడుంటానని అగ్ని శిఖలమీద ప్రమాణం చేసిన వరుడు, తోడు రాకుండా, అనారోగ్యాన్ని పంచుకోకుండా స్వార్థంతో నిలుచుండి పోయాడని, తెలిసి అలిగి వెళ్ళి పోయావు కదా.

కలవాలనే ఆశతో ముంగిటకు వచ్చిన నిన్ను, నాకంటే ముందే కౌగిలించుకున్న మృత్యు దేవతతో చెలిమి చేసి రానని వెళ్ళి పోయావు కదు !? వెళుతూ నీతో తీసుకెళ్ళిన నా ఆత్మను తిరిగి పంపకుండా నీకేం తోడుతో హాయిగా వున్నావు. నీకెలా తెలుస్తుంది తనదైన ఆత్మ లేని ఈ జీవం ఇక్కడ ఎలా విల విల లాడుతోందో... అదుగో ఆగకుండా అలల మీదుగా వినిపించే నీ గొంతు ఏదో సందేశాన్ని ఇస్తున్నట్లే వుంది. హృదయమొగ్గి వినని నా ప్రాణ సఖి......!!

✡ ✡ ✡



# లేఖాయణం
## ఉమ యేలూరి



### ప్రశ్నల పరంపర ..... సమాధానమేమిటో!?

ప్రియమైన నేస్తం,

ఎలా వున్నారు అందరు? క్షేమమేనా? ఈ ఫోన్‌లు వచ్చాక ఉత్తరం అనేది కాల గర్భంలో కలిసిపోయిన మేలి ముత్యమైపోయింది. ఈ ఉత్తరం అనేది ఎప్పుడు మొదలయ్యిందో కాని, దాని విస్తరణా ఖ్యాతి మాత్రం చాలా కాలమే సాగినట్లు వుంది, ఎంతటిదైనా కాలదోషం పట్టక తప్పదు కదా చివరకు. ఈ ఉత్తరమేమిటో.....!, ఏదో రాద్దామని మొదలెట్టి ఉత్తరం దాని పరిణామక్రమం అని అచ్చమైన జీవశాస్త్ర ఉపాధ్యాయుడిలా చెపుతున్నా కదూ! ఇందు అదే అంటుంది ఏది మొదలెట్టినా చివరకు  లెక్చరర్ ఉద్యోగ ప్రభావం మాత్రం తప్పనివ్వరు కదా అని. పిల్లలు కూడా అదే అనుకుంటారు అనుకుంటా, నవ్వుతూ చూస్తారు వాళ్ళ అమ్మ నన్ను దెప్పుతుంటే.

మీ కబుర్లు ఏమిటి? రాజు, పిల్లలు బాగున్నారా? మధ్య వయసు ప్రభావమో...బాధ్యతల ముంపో మరి ఏది చేసిందో మాయ కాని, వేగం తగ్గింది జీవితం, తగ్గాలేమో కదూ! ఎప్పటికి దుడుకు జలపాతమల్లే ఉంటే ఎలా నెమ్మదించిన నది అవ్వాలి కదా. ఈ మధ్యన మీ అమెరికాలో కూడా సాహిత్య పోషణ, కళా పోషణ పాళ్ళు ఎక్కువ ఐనట్లు ఉన్నాయి. మంచి మార్పు. కేవలం సినిమాల ప్రభావమే కాక సాహిత్యానికి కూడా పీట వేస్తున్నారు, ఎవరిని చూసినా ఈ మధ్య ఏదో ఒక సాహిత్య సమావేశాలు జరుపుతున్నట్లు ఉన్నారు. మీ అమెరికా వాళ్ళ కథలు కూడా ఎక్కువ అయ్యాయి సాహిత్యంలో ఇక్కడా అక్కడ కూడా. నువ్వు గమనించావో లేదో కాని ఎందుకో అందరు అమెరికా జీవితంలోని లోటుపాట్లనే చూపుతున్నట్లనిపించింది నాకు  కథలు చదువుతుంటే. మరి నేను ఎక్కువగా చదవలేదేమో.

చాలానే అసంతృప్తి వున్నట్లు వుంది మీకు అక్కడ, అప్పుడు ఇంత లోటూ పాట్లు వున్న సమాజాన్ని ఎందుకు వదలరు? నీకు గుర్తు ఉందా నీ పెళ్ళప్పుడు మీ మామగారు అక్షంతలు చేతిలో పుచ్చుకుంటే పసుపుతో చేతులు నాన్సెన్స్ ఐపోయాయి అని మాతో బేసిన్‌లో నీళ్ళు తెప్పించి కడిగించారు ఆ పల్లెటూళ్ళో. పైన మాతో అన్నారు ఇండియాలో ఏమి ఉంది దోమలు బురద తప్ప అని. ఇప్పటికి తలచుకుని నవ్వుకుంటూ ఉంటాము ఆయనను. అదొక అతిశయం, ఇప్పుడొక అతిశయం అనిపిస్తుంది నాకు. ఏమంటావు?

చాలా వరకు నే చదివిన కథలలో, సంస్కృతి నాగరికత ఇండియాలో వదిలేసి, దిగులుగా, భయంగా, భవిష్యత్తు మీద దిగులుతో పిల్లలను సరిగా పెంచలేక బాధ పడుతున్నట్లు ఉంటాయి పాత్రలు. లేదా బాగా డబ్బు పిచ్చితో తల్లి తండ్రులను అత్తమామలను బాధ పెట్టినట్లో ఉంటాయి. ఇవి కాక మీకేమి సమస్యలు ఉండవా? మీ ఊళ్ళో రాజకీయ మార్పులు మిమ్ములను బాధ పెట్టేవో, మీ జీవితాలలో మార్పు కలిగించేవో ఉండవా? అక్కడి సంస్కృతి కథలలో రాసినంత రోతగా ఉంటుందా మంచి విషయాలు మీరు తీసుకుని మీ జీవితాలలో అనుష్ఠించగలిగేవి ఏమి ఉండవా? అక్కడుండి పూర్తిగా ఇక్కడిలానో, ఇక్కడుండి పూర్తిగా అక్కడికిలానో పిల్లలను పెంచటం సాధ్యమా? అందులో పిల్లల మనసులు, వారు పడే తాపత్రయం ఏమి ఉండవా?

ఇలానే చాలా ప్రశ్న లు వస్తుంటాయి నాకు. మనం ఫోన్‌లో ఇవి అన్ని మాట్లాడేంత తీరిక వుండదు. సమయాభావం ఇద్దరికీ, పైన అడిగి నిన్ను బాధ పెట్టినట్లు వుంటుందేమో అని ఒక సంశయం నాకు. ఇక్కడ చాలా మార్పులు నువ్వు గమనించే వుంటావు వచ్చిన ప్రతిసారి. ఒకే సారి విపరీతమైన వేగంగా ముందుకు, మెరుపల్లే వెనక్కి వేదకాలంలోకి పరుగెత్తాలని ప్రయత్నిస్తున్నట్లనిపిస్తుంది మేము. ఆగి ఆలోచిస్తే చాలానే లోపాలు కనపడతాయనుకుంటా, కాని ఆగి చూసేదెవ్వరు కాలంతో కొట్టుకుపోక.. బాల్యం మీద బెంగ, యవ్వనం ఉండాలనే కాంక్షీనం, వృద్ధాప్యం వద్దనే ఆరాటం మాములై పోయింది. మనం చేసేది తప్ప పక్కవాళ్ళు చేసే ప్రతిది విమర్శనాత్మకం గా చూడటం నిత్య జీవన విధానం మాకు. కాని చెప్పేను కదా ఆగి ఆత్మ విమర్శ చేసుకోవలనే లోచన, అంత ఓపిక కూడా మాకు లేదు. మీరు అది చేస్తున్నారా? అందుకే అంత అసంతృప్తి ఛాయలా ఆ కథలలో...? సాహిత్యం ఆ తరం ఆలోచన, జీవన విధాన, సాంప్రదాయ రీతులను ప్రతిబింబింప చేస్తుంది అంటారు ఐతే మీ కథలు ఆ పనే చేస్తాయా?

ఎన్నో ప్రశ్నలు సంధించినట్లున్నాను కదా.. కాలంతో దొరికిన సమాధానలను ఏరుకోవలసిందే కాని చెప్ప తరమా అని ముగించక ఎప్పటికి మల్లే, నీకు తోచిన సమాధానమిస్తావని అనుకుంటూ.

**నీ స్నేహితుడు,**

**కృష్ణ.**

✡ ✡ ✡

**కృష్ణ,**

బాగున్నావా? ఏమిటి నిజం గానే ప్రశ్నల పరంపర వదిలేవు నా మీద? ఇలా ప్రతి దానికి ఆలోచిస్తావనే మరి మేమందరం ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్ అనేది నిన్ను...! ఆగి ఆలోచించే అవసరం లేదంటూనే ఆలోచించే అలవాటు నీది, ఆగి ఆత్మావలోకనం

చేసుకుంటున్నాననుకుంటూ ఊరికే మాట్లాడే దానిని నేను. నన్నడిగితే నేనేమి చెపుతాను? అందునా నీ అంత సాహిత్యం చదివే అలవాటు లేదు నాకు. రాజు పిల్లలు బాగున్నారు. రవికి మా దగ్గర యూనివర్సిటీ లో ఎడ్మిషన్ వచ్చింది, వాడి చూపు ఇంకో చోట ఉంది, రాజుకు నాకు మాత్రం వాడు దగ్గరగా వుంటే బాగుంటుంది అని వుంది. చూద్దాము. రాజికి ఇంకా రెండేళ్ళు ఉంది కదా కాలేజ్‌కు, అప్పటి దాక దాని కథ సుఖాంతమే.

పిల్లల కబుర్లు, ఇందు కబుర్లు ఏమి రాయనే లేదు. ఈ సాహిత్యం, సమాజం నీ ఆలోచన పూర్తిగా ఆక్రమించినట్లు వున్నాయే...!! ఇక్కడి వాళ్ళందరి గురించి అడిగితే అందరి తరపున వకాల్తా తీసుకుని నేనేమి చెప్పగలను చెప్పు. కాని నిజమే కథలలో ఎందుకో అసంతృప్తి బాగా ప్రతిఫలిస్తుంటుంది, అంటే అలా రాస్తేనే బాగుంటుంది అని రాస్తారో లేక మరి నిజంగానే అలా ఫీల్ అవుతారో తెలియదు. నావరకు నాకేమి అసంతృప్తి లేదు ఇక్కడ ఉన్నందుకు. ఉండవలసి వచ్చినందుకు రిగ్రెట్స్ కూడా లేవు. నీకు తెలుసు కదా నాకు అసలు ఇక్కడికి రావటం ఆసక్తి లేదు కాని వచ్చా కదా. వచ్చాక చాలా మందిలానే ఒక పల్లెటూరును చూసుకుని, అక్కడో ఇల్లు కొనుక్కుని కాస్త దూరం వెళ్ళి ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను పెంచుకునే సగటు 90లలో వచ్చిన కుటుంబాలలో నేను ఒకదాన్ని. ఈ దేశంలోకి వచ్చిన విధానాన్ని బట్టి, ఉన్న చోటు బట్టి అనుభవాలను బట్టీ ఈ దేశం మీద మనకొక అభిప్రాయం కలుగుతుంది అనుకుంటా.

నాకైతే నచ్చింది ఆ అనుభవం. ఎక్కడా మోసం లేదా? ఎక్కడా వివక్షత లేదా? అంటే ఎందుకు ఉండదు.. ఉన్నాయి. సంస్కృతి నాగరికత తేడా లేదా అంటే ఎందుకు లేదు.. నిక్షేపంగా వుంది. దేని గొప్ప దానిదే మనం తీసుకునే విధానాన్ని బట్టి జీవితం కనపడుతుందేమో. సాహిత్యంలో అలా ఎందుకు రాస్తారు అంటే ఏమో ఎవరి అనుభవాలు వాళ్ళవి కదా, ఇక్కడ ఉండే భారతీయులు అందునా ఎంతో కొంత సాహిత్యంతో పరిచయమున్నవాళ్ళు సంఖ్యాపరంగా తక్కువ కాబట్టి కేవలం అలాంటి కథలే కనపడుతున్నాయేమో కాని అన్ని అవే అనేమి లేదు. ఎక్కువగా 90ల ఆఖరి వరకు వచ్చిన వాళ్ళకు కల్చర్ డిఫరెన్స్ ఉంటుంది. దానిలో ఇమడాలంటే తల్లి తండ్రులుగా మాకు మొదటి తరపు పిల్లలుగా మా పిల్లలకు ఘర్షణలు తప్పవు కదా. ఎక్కడైనా దేశంతో సంభంధం లేకుండా, తరానికి తరానికి కొంచం తేడా వుంటుంది ఏ పనినైనా ఏ విషయాన్నైనా చేసే.... చూసే విధానంలో. దానికి మేము మాత్రం పెద్ద ఎక్సెప్షన్ ఏమి కాదు. మావి మావి అని అనుకుంటున్న మన విలువలు మన వెనుక తరానికంటే వేరుగా లేవా, మనవైన ఆలోచనలు మన ముందు తరం వారికంటే వేరుగా వుండవా? విలువ, సంస్కృతి, సంప్రదాయం అనేది కాల మాన పరిస్తితులను బట్టి మారుతుంది. మారనిది సత్యం, అసత్యం మాత్రమే అని నా నమ్మకం.

మాంసం తినని వాడికి తినే వాడిని చూస్తే చిన్న చూపు, తినే వాడికి గొడ్డు మాంసం తినే వాడిని చూస్తే చిన్న చూపు, గొడ్డు మాంసం తినే వాడికి అసలు తినని వాడిని చూస్తే చాలా చిన్నచూపు.. చీర కట్టుకున్నామె చుడిదార్‌లు వేసుకునే ఆమె కన్న సంస్కృతిని ఎక్కువగా పోషిస్తున్నానన్న నమ్మకం, చుడిదార్ ఆమెకు స్కర్ట్ వేసుకునే ఆమె కన్నా ఎక్కువ అని అభిప్రాయం, ఈ మూడూ వృత్తి ప్రవృత్తులను బట్టి వేసుకునే ఆమెకు, బికినీ వేసుకుని బీచ్‌లో పొడుకున్నామెను చూస్తే పరిహాసం విలువలు లేని వాళ్ళని, ఆమెకు న్యూడ్ బీచ్‌లలో తిరిగే వాళ్ళను చూస్తే లోక్లాస్ అనుకుంటుంది. ఇచ్చానుసారం తిరిగే ఆమెకు ఈ మిగతా అందరిని చూసి బానిస బతుకులు జీవించటం చేతకాదు అని వెటకారం. ఇందులో మనం ఏ గ్రూప్‌లో వుంటే ఆ అభిప్రాయాలను సమర్ధిస్తాము. జీవితాన్ని కొంచెం పెద్ద గాడిలో చూసే అవకాశం ఉంది ఇక్కడ కావాలనుకుంటే. అక్కడా ఉంటుందేమో నువ్వన్నట్లు టైం ఉంటే.

ప్రత్యేకంగా సాహిత్యానికి వేరే ప్రత్యేకత ఏమీ లేదు. మన అనుభవాలు ఆలోచనలు కథలుగా ప్రతిఫలిస్తాయి. సాపేక్ష సిద్ధాంతమే అన్ని చోట్లా కృష్ణా!. నేనైతే కథలు రాయను కాబట్టి ఇంతకంటే ఏమి చెప్పలేను. మరీ ఈ కథలో రాసినంత..... వీళ్ళందరు వాపోయినంత చెడ్డగా ఏమి ఉండదు ఇక్కడ. మనకేమి కావాలో మనం నిర్ణయించుకోవాలి కదా. నా వరకు పిల్లలకు భాష ముఖ్యం అనుకున్నా. పిల్లలు ఇక్కడ ఈ సమాజంతో ఎంత కలిసి పోయినా నా వాళ్ళతో (వాళ్ళ వాళ్ళు కూడా) కనీసం తడుముకోకుండా మాట్లాడాలి. ఇది చెప్పినంత తేలిక కాదు. చాల శ్రమ ఓపికలతో కూడిన పని. పిల్లలు ఒక విధంగా చాలా అదృష్టవంతులు. Best of both worlds దొరుకుతాయి. కాని పాపం చాలా శ్రమ పడతారు రెండు ప్రపంచాల మధ్య సమన్వయం కుదుర్చుకునే వరకు. ఆ సమన్వయపరచుకోవటంలో తల్లి తండ్రుల సహాయంలేని వాళ్ళకు ఇంకా సమస్య, సమస్య వస్తే ఎవరమైనా ఏమి చేస్తాము? ఏదో ఒక పక్కకు వెళ్ళి మన తర్కం మనం పెంచుకుంటాము. పిల్లలు అలా చేసి అమెరికా పక్కకు వెళ్ళి వెక్కిరించే తల్లి తండ్రులను వెక్కిరించటానికి మనం నమ్మే సంస్కృతి సాంప్రదాయాలను డిఫెన్స్‌గా చేసుకుంటారు. అలాంటి వాదనలు బలె తమాషాగా ఉంటాయి వినటానికి. అలా బాధ పడిన ఒక తండ్రి లేక తల్లి కలం నుంచి అమెరికా గురించి మధురమైన అనుభవాల మాలికలా కథ ఎలా వస్తుంది?

ఏది ఏమైనా మంచి ప్రశ్న వేసేవు నేను పూర్తిగా సమాధానం చెప్పలేను చూద్దాము మనకు అలవాటైన ఆలోచన "కాలమే చెప్పని సమాధానాన్ని కలవని తీరాలను కలిపే వంతెనలు బలంగా పడ్డాయో.........ఊగుతున్నాయో అనుమానాల అపోహల అపార్ధాల నడుమ."

**ప్రేమతో,**
**వేణి.**

✡ ✡ ✡






## పుట్టినూరు.. పున్నమి నవ్వులు.. పులకరింతల పువ్వులూ...

**కన్నతల్లి లాంటి పుట్టిన వూరి రుణం ఎంత అయినా తీర్చుకోలేనిది అంటారు.. అటువంటి పుట్టినూరుకు రాసిన ఒక వుత్తరం**

**అమ్మా,**

ఎలా వున్నావు? నీ బిడ్డలు నిను వదిలి పోతున్నారని దిగులుతో గుండె ఘోషను సాగరుడికి పంచి, వున్న బిడ్డల ముద్దు మురిపాలను వెన్నెల నురగగా మెరిపిస్తున్నావా? తాటి తోపుల గాలిని మొగలి పూల దొన్నెలలో నింపి, పారిజాతాల సొగసులద్ది కృష్ణమ్మ నీలాల కురులకు విరిమాలలల్లి.. ఎన్నెన్నో జాతీయ వుద్యమాలకు బాసటగా త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసిన యోధుల కన్నతల్లివై వున్న నీకు దిగులెందుకమ్మా! నీ గుండెల మీద ఆడుకున్న మాకు నీ తలపు గుండెలో ఎప్పటికీ బాల్యాన్ని పలకరిస్తున్న వెన్నల వాగంటి నవ్వులా సమ్మోహన పరుస్తూనే వుంది. నిన్ను వదిలి ఎన్నెన్ని క్రోసుల ఎన్ని బారుల ఎన్నెన్ని సముద్రాలు దాటి ఎక్కడెక్కడో తెగిన ముత్యాల సరాల తుంపులమై వున్నా నీ గుండెలోతుల మొదటిగా మెదిలిన మెరుపుల స్వచ్చత మర్చిపోలేదమ్మా.

యోజనాల కావల, ఒంటరి రాత్రి, ఆకాశంలోని నిండు చందమామను చూస్తూ, వెన్నెల వెలుగులు మెట్టిన వూరి నేలను అమృత ధారలలో ముంచుతున్న క్షణాన, ఈ సుధలు నిన్న రాత్రి మా వూరి మీద కురిపించి ఈ పూట ఇటు వచ్చి వుంటాడు కదూ ఈ సుధాముడు అని అనిపిస్తే, అతని మీద ఎంత ప్రేమ పొంగుకు వస్తుందనుకుంటున్నావు! అమ్మా.. నిన్ను వదిలి ఎన్నేళ్ళు ఐనా నిన్ను తలచుకుంటే ఒక్కోసారి మనసు నిన్నో మొన్నోనే నిన్ను వదిలి వచ్చినట్లు బెంగేస్తుంది. సముద్రం మీది వానలా దుఃఖం అలలై మూసిన కనురెప్పల వెనుక ముత్యాలను పేరుస్తుంది.

ఇంకా నిన్న కాక మొన్న స్కూల్ బేగ్ భుజాన తగిలించుకుని రివ్వున బాణమల్లే గోపాలం గారి దొడ్లో బాదంకాయల కోసం పరుగెత్తిన జ్ఞాపకం. పున్నాగ పూలను స్కూల్ బేగ్ నిండా నింపుకుని ఇంటర్వెల్‌లో జడలల్లిన పులకరింత... మూసేసిన పెద్ద గేటు లోనే అరతెరిచిన చిన్న గేటును చప్పుడు రాకుండా తోసి చంద్రకళ వాళ్ళ దొడ్లో ఎవ్వరికి కనపడకుండా శివుడి పూల చెట్టు వెనుక చేరి చేసిన తాటాకు బొమ్మలు... అమ్మ చీర ముక్క నుంచి చేసిన ముఖమల్ చీరలు... పీలికల జడలు.. దసరాకు శక్తి గుడి సెంటర్‌లో శక్తి పటాలను ఎత్తే ఆచారిని హీరోలా చూసిన సంభ్రమం... మా పేట శక్తి పటం గొప్పదంటే కాదు మాది అనే చీమిడి ముక్కుల తగాదాలు.. టీచర్స్‌డే కు రామచంద్రరావు మేష్టారు కు హిందూ న్యూస్ పేపర్ వక్కపొడి పేకేట్, సులోచనా టీచర్‌కు గులాబి పూల గుత్తులు గిఫ్టులుగా ఇచ్చిన బడాయి పోకలు... ఇవి అన్ని నీతోటి నా అను బంధానికి అద్దిన చెక్కెర తునకలు కాదూ!?

పూల నరసయ్యను బతిమాలి తెప్పించుకున్న మొగలు పొత్తులోని ఆకు వొకటి అమ్మకు తెలియకుండా కొట్టేసి పైన తాటాకుకు బదులు దానితో అమ్మాయిని చేసి, నా అమ్మాయి మొగలి వాసనలు వస్తుంది మీకులా తాటాకు కంపు కాదు అని స్నేహితులను ఏడిపించటం ఎంత బాగుండేది.! ఇప్పుడు ఈ పిల్లలు ఆడుకునే బార్బీ బొమ్మలతో కులుకేది వీళ్ళకు? ఎట్లా ఐనా నువ్వే గొప్ప అమ్మా...!! అమ్మా ఇసుక నేల అని అందరు నవ్వి పోదురు కాక, ఆ పరలలోనే ఎంతో మంది కళాకారులను, జాతీయోద్యమ రూపకర్తలను కన్న ఘనత కాదూ నీది! ఆ గొప్ప ముందు ఏది నిలుస్తుంది చెప్పు? వరండాలోని గ్రిల్ అంచున పాకిన నైట్‌క్వీన్ గుత్తుల తలలూపుతూ, వెనుక పక్క కిటికి అంచున తొంగి చూస్తున్న మాలతీ లత అవునని తాళమేస్తూ, బయట గేటు ఆర్చ్ మీద పాకిన కాగితపూలు జల జల మంటూ గల గలా ఎన్ని కబుర్లు చెప్పేవి నీ గురించి! కోన సీమ కొబ్బరాకు అని అని గొప్పలు పోతారు కాని మన వూళ్ళో సరుగుడు తోటలు, కొబ్బరి తోటలు, మధ్య సాగే లంకలలో వయ్యారాలు పోయే కృష్ణమ్మకు సాటి వస్తాయా అందాలు చెప్పు!? మరి అందాల షోకులన్నీ నీ పరమేగా ఎప్పటికి ..!?

పాండురంగడు తిరణాలలో నువ్వుజీడీలు, కొమ్ము బూరలు, అమ్మాయిల కోసం కోర చూపులు చూసే కుర్రోళ్ళు.. చూసి కూడా చూడనట్లు బావి గట్టున కాళ్ళు కడుక్కుంటూ జమ్మిపూలను చూస్తున్నట్లు కళ్ళు చిట్లించి కుర్రోళ్ళను చూసే కుర్ర పిల్లలు.. హుష్... పెద్దోళ్ళయ్యారు అలా బహిరంగంగా చెప్పకూడదు అని అమ్మల్లే నువ్వు మందలిస్తున్నా నీ పెదవి అంచున మెరిసిన నవ్వు అర్ధనారీశ్వరుడి సిగలోని చంద్రవంకల్లే మెరిసిందిలే! పెళ్ళెయ్యిన మొదటి రోజు నువ్వు చెమరింతల చినుకులతో దీవెనెల జల్లు కురిపించావే.. జల్లు గుర్తొస్తే తోడుగా నా కళ్ళూ చెమరిస్తాయి అమ్మా.!!

అమ్మా... కన్న బిడ్డలందరూ నీ జ్ఞాపకాల ఆస్తిని తలా కాస్త పంచేసుకుని భద్రంగా గుండెలోతులలో వాటిని దాచేసుకుని ఇలా చెట్టుకు పుట్టకు ఒకరుగా వచ్చేమని దిగులు పడ్డావంటగా. మొన్న విష్ణు ఇండియా వచ్చినప్పుడు నిన్ను చూడటానికి వచ్చినప్పుడు

కనిపెట్టేడంటలే.. ఎందుకలా ఆశ్చర్య పోతున్నావు? అమ్మా నువ్వు మమ్ములను గుండెలలో దాచి నీదైన ప్రతి సారాన్ని ప్రతి భావాన్ని మాకు ఇచ్చి మమ్ములను ఇంత వాళ్ళను చేసేవు నీ మనసులో మాట  మాత్రం కనిపెట్టలేమా చెప్పు. మొగలి గాలులూ లేవు కనకాంబరాల తోటలు లేవు.. శక్తి పటం చిందులూ లేవు... ఎండి పోయిన పాయల మధ్యగా గాలికి సుడులు రేగుతున్న ఇసుక తుఫానులను నింపుకుని నువ్వు రేపటి కోసం ఆశగా చూస్తున్నావని తెలుసు. అమ్మా... ఏమి చెయ్యము అమ్మా! సరస్వతి కటాక్షించింది నీ దయవల్ల. మరి లక్ష్మి కూడా కావాలి కదా జీవన పథంలో అడుగులు సమశ్రుతిలో సాగాలంటే. కట్టుకున్నోడి చిటికిన వేలు పట్టుకుని సప్త సముద్రాలు దాటి వచ్చేసినా నీ తలపుల చివురు తీవె వేసే మొగ్గల మాలను ఎప్పటికి భద్రంగా కురుల తురుముకుని, నువు నేర్పిన లాలి పాటలను బిడ్డలకు పాడుతూ వాళ్ళ అమ్మనై ముందు తరాలకు ఇంకో భూమాత నవుతున్నా... నన్ను దీవించమ్మా..!!

✡ ✡ ✡






## పాత తోటల పాట కొత్త చిగురోకటి పలకరించిన వేళ....

**నువ్వు తలపుకొస్తే** నిద్ర దరికే రాదు.... నిద్ర దరికొస్తే మాత్రం పోటీగా కలలతో కలవర పరచటానికి పరుగెత్తుకుని వచ్చేస్తావు నీకిది న్యాయమా నల్ల పిల్లా.... విశ్రాంతి తీసుకో అంటావు అమాయకంగా కళ్ళార్పుతూ....నీ మాటను జవదాటగలవాడా ఈ సత్యాపతి అని విశ్రాంతి తీసుకుందామనుకుంటే నీవూపిరి వెచ్చగా బుగ్గల మీద, నీ చేతిలో ఈకేమో చెవిలో గిలిగిలి పెట్టేస్తుంటే పెద్దగా నవ్వుతూ లేచేను............ దొంగ దొరికిందని చెయ్యిపట్టుకోవటం కోసం చాపిన చేతిని పడమటి దిక్కునుంచి పాకి వస్తున్న పువ్వుల పరిమళం తాకి పరామర్శిస్తే.... బుగ్గ మీద చిరుగాలి నీ పిచ్చితనమే కాని ఆమె ఏది...... ఇక నీ దగ్గరకు రానివ్వనంత దూరం పంపేసేవుగా అని చిటిక వేసి చెప్పి వెళ్ళి పోయింది.

చిరు వెలుగులకు, మత్తిల్లిన చీకటి తెరలకు వారధిగా ఎక్కడో అప్పుడే కోడి కూస్తోంది. ఇక ఈ రోజుకు నిద్ర చాలులే అని మన ఇంటి వెనుక వేప చెట్టు పూత పలకరిస్తూ, ఏది తువ్వాయితో పాటుగా పరుగులు తీస్తూ కనపడేదిగా ఇక్కడే, ఎక్కడ నీ గుండె సవ్వడి వినపడటం లేదు అంటోంది ఏమి చెప్పను..... నా వెర్రి తనం వేయి పడగలై నన్నే కాటేసి నాకిచ్చిన శిక్ష ఈ ఒంటరి తనమనా..... ఇక ఎప్పటికి కలవని రహదారుల వెంట పరుగులెత్తే అడుగుల సవ్వడి క్షణక్షణానికి దూరమే అవుతుంది కాని కలిసి సాగే పదాన్ని కర్కశంగా విడగొట్టిన నా మదికి, ఈ తోటకు ఎప్పటికి రాదు అనా..!? ఈ పొద్దుటే ఇలా నిన్ను మది పలవరించటంతో మొదలయ్యిన రోజు ఇంకెన్ని మంచి తలపులను తీసుకు రానుందో కదా!

అమ్మమ్మ వాళ్ళ తరమే హాయి అనుకుంటా, ఇన్ని సంఘర్షణలు వుండేవి కావు అందినదానితో జీవితాన్ని అనుసంధానించుకుని తృప్తిగా బతికే వారేమో! ఏమోలే వాళ్ళ మనసుల్లో ఏమి వుండేదో వయసులో వున్నప్పుడు మనకు తెలియవు కదా. మన తరువాతి తరాలకు మనం కూడా, బోసి నవ్వులతో మీకులా కాదు మేము, హాయిగా వుండే వాళ్ళం అని చెపుతామేమో. నేను నేను అనే లాజిక్

ఎక్కువ అయ్యే కొద్ది మనం అనే  అనుబంధానికి దూరమవుతున్నామా? అసలు ఏ మనిషికైనా ఆనందంగా వుండటానికి కావలసిన మూల సూత్రమేమిటో ఆర్కిమెడీస్ సూత్రాలకు మల్లే వాటిని కూడా చిన్నప్పుడే పుస్తకాలలో పాఠ్యాంశాలుగా పెట్టి చదివించి బుర్రలోకి ఎక్కిస్తే ఐనా అందరికి అర్థం అవుతుందేమో.

ఎందుకు నీ వెర్రితనానికి అందరికి కలిపి అంట గడతావు? నీ సంగతి చూసుకో ముందు తరువాత అందరి గురించి ఆలోచిద్దువు అంటావా!? అనవు నువ్వు.! నువ్వు మాట్లాడవు చాలాసార్లు కళ్ళే మాట్లాడతాయి. నీ కళ్ళు చెప్పిన సంగతులను అన్వయిస్తే.!? ఊహూ అన్వయించగల శక్తే నాకు వుంటే ఎన్నో కావ్యాలను ఎన్నో జీవిత పాఠాలను రాయగలిగే వాడిని. ఇలా అశక్తుడినై పూర్తిగా వోడి పోయి ఎక్కడో పలికే నీ గుండె చప్పుడితో శృతి కలపాలని ఆశ తో పిచ్చి పదాలను కూర్చి లేఖ చేస్తానా!?

ఇలా సాగే నా ఆలోచనల తీరుకు నాకే వెర్రి లా అనిపిస్తుంది ఒక్కోసారి. అంటే, చందు "వో నీకు ఇప్పుడు అర్థం అయ్యిందా నాకు ఎప్పుడు అనుమానమే రా, ఎందుకు కలిసేవో తెలియని ఒక విచిత్ర బంధంను ఇలా తలచి వగచే నీ మతి చలనం మీద" అన్నాడు, ఎంత సేపో నవ్వేను చందు మాటలకు. నిజమే జీవితంలో ఒక అద్భుతమైన ప్రేమ తటస్థించక పోతే ఎవరికైనా ఎంత చెప్పినా ప్రేమ గొప్ప తనం అర్థం కాదేమో! ఆ మాట అంటే మొన్న రాత్రి జరిగిన చర్చలలో శ్రీధర్ వొప్పుకోలేదు. ఏ బంధానికైనా దాని గొప్పతనం అది నువ్వు కల్పించుకున్న విలువను బట్టే వుంటుంది. దానంతటకై ఒక విలువ అంటూ దేనికి ప్రత్యేకంగా వుండదు.  ఏమో ఇంకో అద్భుత ప్రేమ నీ కోసం ఎదురు చూస్తోందేమో, ఒక ప్రేమ కాని, స్నేహం కాని లేదా ఒక పరిచయం కాని అద్భుతమని ఎలా తోస్తుంది చెప్పమని అడిగేరు. కావాలంటే పుట్టుక నుంచి జరిగిన ప్రతి సంఘటనను విశ్లేషించి చెప్పమని అడిగేరు. మొన్న రాత్రి అసలు ఆ చర్చే బలే తమాషాగా మొదలయ్యింది. నువ్వు వుంటే అరుగుమీద చలిగాలికి కొంగు లాగి బిగించి మోకాళ్ళను కడుపులోకి లాక్కుని కూర్చుని వూయలలూగుతూ నవ్వుకుంటూ వినే దానివేమో.

ఎలా చెప్పాలో అర్థం కాలేదు పద్యాలను యతి ప్రాసలతో గణ విభజనలతో మాత్రలతో లెక్క కట్టినట్లు, అనుభవాల మాలికను విడగొట్టి లెక్క చూసి ఏది ఆగినా జీవితమాగదు కాబట్టే గతంను గతించిన కాలజతిలో కలిపి నూతన ప్రవాహ కేళికై వేచి చూడు అదే జీవితం అంటే నేను ఒప్పుకోలేదు.. వీటన్నిటినీ మించి ఏదో వుంటుంది, అది ఏదో...... ఏమని చెప్పాలో ఎలా నిర్వచించాలో తెలియటం లేదు. మనసు కూడా మాట వినదని ఎన్నెన్నో జ్ఞాపకాల గుత్తులను విరగ పూయించి చెపుతోంది.

ఇన్నాళ్ళ తరువాత... ఊహూ.....ఇన్నేళ్ళ తరువాత కూడా అదమలేని నా గుండెల విలాపగీతం, స్వయంకృతాపరాధ రాగంలో.... వొంటరైన జంట చకోర తాళంలో నిను తలుస్తుంటే.... నీవెక్కడున్నా ఇది నినుచేరాలని... నీ తలపుల చాటున మిగిలిన నా జీవన శ్వాసను పలకరించాలని ఆశిస్తూ.......

***నీ వాడు***

***ప్రియ నేస్తం,***

నీ రూపు నీ మాట నీ అడుగు గత జన్మలోని బంధమల్లే మసకేసి పోతోంది కంటి చెలమల మధ్య కనుపాపలో. జారినివ్వు మిత్రమా కిందకు జారిన ప్రతి చుక్క నీకిచ్చే నీరాజనమై నా గుండెలోని నీ జ్ఞాపకానికి హారతులెత్తుతోంది..

రోజు రోజు కొక రాగం పలకరించే ఈ ఉదయం. ఉదయానికే ఒక హాసం ప్రకృతి పరిచిన పూల వనం. వనాల విరిసిన సంగీతం విరించి ఇచ్చిన అదనపు బహుమానం. బహుమానాలన్ని ప్రోది చేసి గుచ్చి ఇచ్చిన సూత్రం ఈ ఉదయాన నా కృష్ణయ్య మధుర దరహాసపు ఆనవాలు నిచ్చే అక్షరాల భావం. భావాలన్నీ కలిసి విరిసిన సుమధుర సువాసనల సరాగం పంచుతూ ఈ రోజు పొద్దుటే నీ

తలపాకటి వాలి వడలి పోయిన తోటలోకి నవవసంతం కాంక్షించే రామచిలుకలా వాలితే అది అనునిత్యం సాగే నీ నామ జపమనుకున్నా కాని కాదు అది నువ్వు నాకొరకు పంపిన జ్ఞాపికల జలధారల జలదరింపు అని ఇప్పుడే ఈ క్షణానే వచ్చిన నీ జాబు చెప్పింది..

ఎన్నాళ్ళకు ఎన్నేళ్ళకు ఒక మాట, ఒక తలపు., ఒక పిలుపు మనమున్న ప్రేమ రాజ్యం నుంచి నాకొరకొచ్చింది! నిన్న మొన్నటి విషయమల్లే గతించిన జ్ఞాపకమొకటి సజీవమై ఎదుట నిలిచిన క్షణం, ఎదురు చూసిన జన్మజన్మల బంధం ఎదుట నిలిచి పలకరించిన క్షణం. ప్రతి క్షణమొక యుగమైన ఈ కాలమంతా ఒక్క సారి ఘనీభవించి ఎక్కడ మన కథ ఆగిందో అక్కడే తిరిగి కాలం మొదలైనట్లనిపించింది.

ప్రేమ అన్న పదమొక సుస్వర నాదమై నా జీవితాన్ని వెలిగించిన రోజులను నేను మరవగలనా!? మన ప్రేమ ఎంత నిజమో మన అనుబంధమెంత సత్యమో  పైన నీ అపనమ్మకపు నీలి నీడల మేఘగర్జన అంతే నిజం. అపస్వరాల సాగిన మన ప్రణయ రాగం ఒక్క సారి గుక్కపట్టి ఆగిపోవటం అంతే సత్యం. ఒక్క సారైనా ఆగి ఆలోచించినా మన అనుబంధపు ఆనవాలు అంచైనా చెప్పేది నీకు నాగురించి. బాసల వూసులతో నిండిన నాకంటి వెలుగును ర్వేసి నన్ను అంధురాలిని చేసేక నా కళ్ళు ఇక ఏ ప్రణయ కావ్యాలను రచియించగలవు!? అవి ఏదూర తీరాలకో చేరిన సుధా మాధురి స్వరాన్ని వివరించగలవు చెప్పు!?

నేను నేనన్న సామ్యమో సాధనో నిను నిరంతర యాత్రికుడను చేస్తుందేమో కాని ప్రేమ అన్న పదమే ఆ మార్గంలో గమ్యాన్ని చూపించే సాధనం. నేను నేనన్నావు నీ ప్రేమ గొప్పన్నావు.. నీ తోడు గా నడిచే నీ నీడ నల్లదనాన్ని వక్రించావు. అందులోని చల్లదనాన్ని నిరసించావు. మళ్ళీ ఈ రోజు గొప్పదైన నీ తర్కంతో వెలకట్టిన అనుబంధాల విలువలను వెనక్కు తిరిగి అడుగుతున్నావు. వదిలిన చోటనే వెతికే నా వెర్రి నేస్తమా, సాయం సమయపు నీ నీడ దీర్ఘమై మునిమాపు వేళ గోధూళి ఛాయల మిళితమై పోయింది చూడు..

అద్భుతాలను అనుభవాలను త్వరితంగా మారే లోక ప్రమాణాలతో లెక్కకట్టే నీ మిత్రుల సాహిత్య గుభాళింపుల వనాలలో, ఈ గరిక పువ్వు పూచే అద్భుతం.!ఈ కొండమల్లెకు పట్టిన పరిమళం ఆఘ్రాణింపుకు రావులే.... వదిలెయ్...!!

మూసుకు పోయిన ప్రేమ రహదారుల వెంబడి సాగుతున్న వొంటరి పాంధుడు తన అడుగుల కింద నలిగి ధూళిలో కలిసిన చెలి హృదయపు ఆనవాలు తెలుసుకుని గురుతు వెతికి వచ్చినా, మరణించిన ప్రేమ తోటలోకి రాని వసంతాల వలపు పాట పునర్జీవన రాగాలతో కలిపి ఆలపించినా, అనంత వాయులీనాలలో లీనమైన ఆత్మ అంతు చిక్కని ఆవలి అంచుకు ఆవలకు చేరుకున్న క్షణం వెనక్కి తిప్పి జీవధార తో నింప గలదా!? ఆశక్తి కృష్ణయ్య ప్రేమకు వున్నా అందుకునే ఆసక్తి ఈ రాధమ్మకు వుందా.....!!??






## బావా...బాగున్నారా...

ప్రియమైన బావ గారికి,

కొత్త పిలుపులేమా అనుకుంటున్నారా!? కొత్త బాంధవ్యాల పేరిట బంధాలను అల్లుకుంటున్న హృదయానికి పిలుపులోనూ నూతనత్వం కావాలనిపించింది. అవును మరి మా సుభద్రకు అన్న ఐతే నాకు బావే కదా మీరు. కాదనలేని సత్యం.. కావాలనుకుంటున్న బావ అనే బాంధవ్యం..... బాగుంది కదూ!

ఎలా వున్నారు? చాలా కాలం అయ్యింది కదా మీతో మాట్లాడి... ఈ మధ్య నేను తలకు మించిన భారాలను భుజాలకెత్తుకుని కొత్త బరువుల బాధ్యతలతో మిగతా విషయాలను పట్టించుకోవటం లేదనే అందరి ఆరోపణలలో నిజం లేకపోలేదు అని, ఇలాంటప్పుడే మీకు కూడా అనిపించవచ్చు. అనిపించిన దానికి సాక్ష్యాధారంగా దాదాపు సంవత్సరం క్రితం రాసిన నా ఆఖరి లేఖ చూపించనూవచ్చు. ఏం చెయ్యగలను బావ గారు... మరి ఒక ఇంటి వాడవ్వక ముందే ఏదో కాస్త విజయం నా వాటాలో కలుపుకుని, సుభద్రా పతి విజయుడనీనూ... బావంతటోడో మించినోడో అని పేరు తెచ్చుకోవాలి కదా.

అవునండీ పని చాలా ఎక్కువగా వుంటోంది కొత్తగా తీసుకున్న సంగీత సారథ్యంలో. పూర్తి గా నేనొక్కడినే సంగీత దర్శకత్వం తీసుకోవటం మొదటిసారి కదా! ప్రస్తుతం కంపోజింగ్ జరుగుతోంది. ఇంకో వారమో లేక రెండు వారాలలోనో రికార్డింగ్‌కు వెళ్ళవచ్చు. మూడు కొత్త ట్యూన్‌లు ఇచ్చాను.. నావరకు ఐతే పూర్తిగా తృప్తిగానే అనిపించింది. చూడాలి ఆ ట్యూన్‌లను ప్రజలు ఎలా తీసుకుంటారో!? ట్యూన్‌లను రాగీకరిస్తున్నప్పుడో (బాగుంది కదా పదం, పేటెంట్ మీద మీ అభిప్రాయం చెప్పండి) లేక రాగాలను తిరిగి మననం చేసుకుంటున్నప్పుడో నా వరకు, నాటీమ్ వరకు ఐతే బాగున్నాయనే అనిపిస్తోంది మరి. ఈ చిత్ర పరిశ్రమలో మనకనిపించేదే కాదు అన్నివర్గాలకు అనిపించటం కూడా ఆర్థిక బావుటాను నా విజయ శకటం పై ఎగరటానికి సాయం చేస్తుంది కదా.

అలా అనుకున్నప్పుడు చాలానే ఉద్రిక్తత అనిపిస్తోంది. కాని వుండాలి. ఆ మాత్రం మన మీద ఒత్తిడి లేక పోతే మనసు చేసే పని మీద నుంచి కాస్త కాస్తగా పక్క దారుల పట్టే అవకాశం రావొచ్చు. అందుకే పాటను.... పాటలోని పలుకును.... పలుకుకు పలికే రాగాలను.... రాగాలను మిశ్రమం చేసే వాయిద్యాలను... అన్నిటిని శ్రుతిలో పలికించే గొంతును, వీటన్నిటిని సమతూకంలో చేసే మిశ్రమాల కణికుడూ ఐన నా అనుభవాలను ఈ ఉద్రిక్తతతో కలిపి ఆనందిస్తున్నా! చూద్దాం ఫలితమేవుతుందో!!

నాకు తెలిసిన ఒకే పని రాగాలను వినటం, ఆ రాగాలను పదాలతో కలిపి స్వరారాధనలో మునగటం... సంగీత విభావరిని నా కోసం నే కల్పించుకున్న జగత్తులో రసరాగ ప్రపంచానికి కానుకగా ఇవ్వటం. ఈ ఇచ్చి పుచ్చుకునే పని తప్ప నాకేమి రాదు కదా. సంగీతమే మరి మీ చెల్లిని నా వైపు ఆకర్షితురాలిని చేసింది నన్నొక ఇంటి వాడిని... అహ ఇంటి వాడినే కాదు ఒక హృదయ సామ్రాజ్యానికి చక్రవర్తిని చేస్తోంది. ఇంతకంటే సంగీతం నాకుచెయ్యగల మేలేది చెప్పండి. ఐనా మనిషిని కదా అంతటితో ఆగక ఇంకా ఆ రాగ జతుల రాణి సరస్వతిని ఆమె అత్త గారైన లక్ష్మిని కూడా నా వైపుకు ప్రసన్నురాలిని కమ్మని చెప్పమనీనూ, వత్తాసు రమ్మనీనూ ప్రార్థిస్తున్నా. ఇంత చేసిన అమ్మ ఇది మాత్రం చేయకుండా వుంటుందా? మీరే చెప్పాలి !

క్షమించాలి ఎంత సేపటికి నా గోలే కాని మిమ్ములను క్షేమ సమాచారాలు ఏమి అడగలేదు.... ఎలా వున్నారు? అక్క, పిల్లలు బాగున్నారా? మీ అంశను, మీ విద్వత్తును కొన సాగించగల మీ వారసుడు వ్రజేష్ ఎలా వున్నాడు? ఇసుమంతైనా అనుమానం లేకుండా మీ వాక్చాతుర్యాన్ని, జనాకర్షణను పుణికి పుచ్చుకున్న మీ అమ్మాయి ఎలా వుంది? మాస్టారుతో ప్రతి వారం మాట్లాడుతున్నారట కదా మీరు!? అమ్మ ఈ రోజు నా జాతకం పంపిస్తాను అందట మాస్టారుకు. దానిని చూసేక ముహూర్తం నిర్ణయిస్తాను అన్నారట వాళ్ళు. నాకు, నా పనులకు అడ్డం లేకుండా నిర్ణయించమని ముహూర్తాన్ని చెప్పాలని అనుకుని, మళ్ళీ అంతలోనే మన వీలు కోసమో, ఫోటోల కోసమో, వీడియోల కోసమో కాదు కదా చేసుకునేది పెళ్ళి అనేది అని నా తెలివితక్కువ తనానికి నేనే నవ్వుకుని వూరుకున్నాను.

సరే బావ గారు ఇక వుంటా. మీ చెల్లి మనసులోకి తొంగి చూసినప్పుడు పక్కన వున్న మిమ్ములను ఎలాను పలకరిస్తూనే వుంటా అనుకోండి కాని దానితో పాటు ఇక నుంచైనా మీతో క్రమం తప్పక ఉత్తర ప్రత్యుత్తరాలతో (అదే ఈ e ఉత్తరాలే లెండి) కూడా పలకరింపుల పర్వాన్ని కొనసాగించాలని అనుకుంటూ ఇప్పటికి ఇక్కడ ఇలా ముగిస్తూ

సదా మీ శీస్సులు కోరే

మీ బావమరిది. (అవును బావ మరిది అనే వరసకు అర్థం ఏమిటో)

**ప్రియాతి ప్రియమైన సుభద్రా పతికి,**

పెళ్ళి ముహూర్తం నిర్ణయిస్తున్నారని వినగానే చాలా ఆనందించాను. మీకు, సుభద్రకు శుభాకాంక్షలు. తప్పకుండా వస్తాను పెళ్ళికి. అదేమిటీ పిలవకుండానే వస్తాను అని అభయముద్రతో.. అనుకుంటున్నారా.!? సుభద్ర మనసుకు సారథ్యం వహించిన అన్నకు విజయుడి మనసులోని మాటా తెలిసినదేలే.

బావా! అని చక్కనైన పిలుపుతో మొదలై మంచి భావపూరితమైన ఈ - ఉత్తరాన్ని పంపారు. ప్రత్యుత్తరమివ్వాలంటే మరి మరింత చక్కని తెలుగు నాశ్రయించాల్సిందే

ఉభయ కుశలోపరి అని పూర్వం రోజుల్లో రాసుకునేవాళ్ళు ముందుగా. అది క్రమంగా తగ్గిపోయి ఉంటుంది, బహుశా అది ఉభయులూ ఏదో భయపడుతూ లోపల్లోపల బతికేస్తున్నాం అన్న అర్థం వస్తోందని జనం మానేసి ఉండొచ్చు. ఏది ఏమైనా నేను కూడా వీలైనంత బిజీగా...., గజి బిజీగా గడిపేస్తున్నా.

దూరంగా ఉన్నట్టున్నా అందరినించి మీ విషయాలు తెలుస్తున్నాయి. ఒక సినిమా పూర్తి సంగీత సారథ్యం చేసే అవకాశం వచ్చిందని విన్నాను. న్యూస్‌లో కూడా చదివాను. అది విజయవంతమై అందరి అభినందనలు పొందాలని ప్రయత్నంలో ప్రతి అడుగునా, ఆ పైన కూడా విజయాలన్ని మీ స్వంతమవ్వాలని ఆశిస్తున్నాను.

అందరితో మాట్లాడుతూ వుంటే మీ ఇంటికి వచ్చినట్టే ఉంది. అమ్మతో, నాన్న గారితో, అక్కతో, బావగారితో, రాజుతో ఇంకా మన వాసు గారు, దుర్గతో కబుర్లు చెప్పుకుంటూ మీ ఇంట్లో అందరిని పలకరిస్తున్నా, అందుకే మీతో ముఖతా, మెయిల్ తా (ముఖతా లాంటి అర్థమే బాగుందని వాడేను) ఫోన్ తా మాట్లాడలేక పోయినా మీ విషయాలు తెలుస్తూనే వున్నాయి. ఇలా ఎల్ల కాలం ఉండాలని - ఆశిస్తున్నా. అంటే మాట్లాడకుండా అనుకునేరు. కాదు సుమా..! మీరు మాట్లాడలేనంత బిజీ ఐనా కూడ మీ గురించి మీ బాగోగులు తెలియచేయగల మీ అస్మదీయులందరితో కూడా ఇలాంటి చక్కని సహృద్భావ వాతావరణంతో వుండాలని, మరి జగమంత కుటుంబం నాది, మేలైన జీవితం నాది.

మాష్టారు చెప్పారు మనం గీసుకునే పరిధిని బట్టి వృత్తం వుంటుంది అదే జీవిత ఇతివృత్తం అవుతుంది అని. అలా గీసుకుంటూ వెడుతూ విశాలప్రపంచ అంచుల్ని, ఆలోచనా కాంతి గోళాల్ని తాకుతూ అలా అమ్మ వైపు వెడుతుంటే అందరి అభిమానం లభిస్తోంది. అలానే మీకు కూడా "ముగ్గురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ" ఆశీస్సులు కూడా లభించాలని కోరుకుంటున్నా.

ప్రతి క్షణమొక రాగమై, బ్రతుకే ఒక నిత్య నూతన గానమై సాగే మీ ఇరువురికి వివాహం దాని ప్రాశస్త్యం గురించి పెద్దగా చెప్ప గలిగేదేమి వుండక పోవచ్చు. పైన మాస్టారు వివాహంలోని అనుబంధం, వివాహానికి అసలు అర్థం ఇప్పటికే సుభద్రకు శ్వాసతో కలిపి అనుసంధానంగా నింపే వుండి వుంటారు. అప్పగింతలలో చెమర్చవలసిన కన్ను ఈ క్షణానే ఎందుకో చెమరింతల చెలమలను కనురెప్పల తెర తీసుకుని వస్తుంటే మరొక్క సారి మీకు తెలిసిన విషయాలనే చెప్పకుండా వుండలేక పోతున్నా..

వివాహమంటే ఇద్దరు మనుష్యులనే కాదు రెండు రక్త సంబంధం లేని కుటుంబాలను ఒక బంధంతో, చుట్టరికంతో కలిపే అనుబంధం. ఏ సమాజమైనా, ఏ చరిత్ర ఐనా, ఏ జాతి ఐనా అందుకే దానికి అంత విలువ ప్రాముఖ్యతను ఇస్తారు. జీవితంలో అర్థభాగాన్ని ఇవ్వటమో తీసుకోవటమో అంటే... సంపూర్తిగా, పూర్ణంగా నిన్ను నువ్వు సమర్పించుకోవటమే, పూర్ణత్వంలోనే మునిగి ఆమెను నీ వునికిగా చేసుకోవటమే. పెళ్ళంటే ఒక మంచి స్నేహితురాలిని శాశ్వతంగా సొంతం చేసుకోవటం. ఏ ఇద్దరు ఒకలా వుండరు. అలాంటప్పుడు సంపూర్ణత్వం ఎలా తోస్తుంది అంటే ఒకరిని ఒకరు గౌరవించుకోవటం లోనే. ఆ గౌరవానికి అనుబంధం పేరుతో గండి కొట్టకుండా వుండటంతోనే పరిపూర్ణ మవుతాము. ఆ గౌరవాన్ని, ఆ అనుబంధాన్ని ఇలా మాటలలో పెట్టటానికి ప్రయత్నిస్తాను.

"నేనెవరో అర్థం కాక నన్ను నేను వెతుక్కుంటూ అన్వేషిస్తుంటే దొరికే ఒక అద్భుతమైన వ్యక్తి నా కందే అపురూపమైన క్షణాలకు నాంది పెళ్ళి". " నేను ప్రపంచంలో ఎందరితోనో మాట్లాడతా, ఎన్నో ఊసులు, ఆలోచనలు, సంఘర్షణలు మాటలలో పెడతా........ కాని అనిపిస్తుంది నా చేతిని గిల్లితే మెదడుకు ఎలా తెలుస్తుంది? నా కాలికి నొప్పేస్తే నాకెలా బాధేస్తుంది....! ఏ భాషలో నా అణువణువు.... నా మెదడుకు... నా మనసుకు ఈ భావాలను అందిస్తున్నాయి ? ఇలా నా సగ భాగంగా, నేనుగా నాలో ఏకమయ్యి..... ఏ భాష అవసరం లేని ప్రతి భావాన్ని పంచే మరో వ్యక్తి కలిసే అద్భుత తరుణం పెళ్ళి...........". "మనోహర వర్ణనాతీత సజీవ ద్విజీవ అద్వైత సంఘటితం పెళ్ళంటే"... అటువంటి అనుబంధం అనురాగం మీ ఇద్దరి మధ్యన సదా వుండాలని అమ్మను కోరుకుంటూ ప్రస్తుతానికి శెలవు తీసుకుంటున్నా.

ప్రేమతో,

మీ బావ.






## పెదవి పలకని మాటొకటి

**బంగారం,**

ఏమి చేస్తున్నావు? ఈ రోజెందుకో నీతో చాలా మాటలు చెప్పాలని వుంది... ఎప్పుడు చెప్పే మాటలేగా కొత్తవి ఏమైనా వుంటే చెప్పండి అని మూతి విరుస్తావుగా, కొత్తవే చెపుతా.... విను. నీకు గుర్తు వుందా వసూ... ఈ శ్రావణ మాసంలోనే మనం మొదటిసారి కలిసేము. మీ అన్న కోసం మీ ఇంటికి వస్తే, పసుపు పూసిన కాళ్ళకు గల గలలాడే మువ్వలతో, చేమంతి పూలదండతో నీ వాల్జడను విసురుగా వెనక్కు వేసి, తలుపు సందునుంచి కళ్ళు రెప రెప లాడిస్తూ... చూపుల తూణీరాలతో నొప్పి లేకుండా గుండెను తుంచేసుకుని లోనికి పరుగెత్తావు.

మన జీవన సాహచర్యం లోని కాలమంతటిని గుప్పెటలో పెట్టి చూస్తే, ప్రేమ సంభాషణలు ముద్దు మురిపాలు కంటే, అలక పానుపులు కోపకారణాలే ఎక్కువ కనపడుతున్నాయి. ఎప్పుడూ సాధించే దానివి "నీకసలు నేనంటే ప్రేమ లేదు. ప్రేమగా ఒక్క రోజైనా ఐ లవ్ యూ చెప్పేవా, ఒక్క నాడైనా నా కోసమని, కేవలం నా కోసమని వచ్చావా" అని. పిచ్చి దానా నీకోసం కాక, ఏది ఒకసారి చెప్పగానే ఎక్కని నీ ముద్దుల అన్నయ్యతో కంబైన్ స్టడీస్ పేరుతో మీ ఇంటికెందుకు వచ్చే వాడిని అనుకుంటున్నావు? నువ్వు పనుల మిషతో అటూ ఇటూ తిరుగుతూ విసిరే వాలు చూపులను భద్రంగా గుండె జేబులో వేసుకుని వెళ్ళేవాడిని కాదు...!! నీకు మాత్రం తెలియదా నే వెళుతూ నా చూపులను మీ గుమ్మానికి తోరణాలుగా కట్టి వెళితే, వాటిని భద్రంగా చూసుకుని వూసుల తాయిలాలు ఇచ్చే దానివి కాదూ!? మళ్ళీ నేను కనపడగానే ఏమి తెలియనట్లు ఎంతో బెట్టుగా తల విసిరి వెళ్ళిపోయేదానివి. ఆ రోజు కూడా నేను ఎంతో కష్టపడి నీతో పాటూ నీ జీడిపాకం స్నేహితులను, మీ అన్నయ్యను, ఇంకా వాడి తోక స్నేహితుడిని కలిపి సినిమాకు తీసుకుని వెళితే... కావాలని నేను ఒక చివరకు కూర్చుంటే, నువ్వు ఇంకో చివరకు కూర్చుని.... చీకటిలో ఎర్ర బడిన నా మొహం చూసి నీ స్నేహితులతో ఏదో చెపుతూ, వొంగి చూస్తూ విరగబడి నవ్వలేదూ!?

నీ కోసం ఎంత కష్టపడి మీ వాళ్ళందరిని వొప్పించి పెళ్ళి చేసుకుని, కలల ప్రాకారంలోకి అడుగు పెట్టిన మొదటి రాత్రే

"చేసారు లెద్దురు మా గొప్ప ఘన కార్యం.... ఒక్క నాడైనా నాకోసం సంపెంగ గుత్తులైనా తేలేదు, పైగా వెనుక ఇంట్లో మా నాన్నను నేను వొప్పించకపోతే ఇంతోటి క్లర్క్ దొర గారికి మా నాన్న ఇచ్చేవారా?" అని సాగదీసి ఒక్క సారి నా వుత్సాహమంతా నీళ్ళు కార్చేసేవు. ఆపైన మళ్ళీ "ఎందుకో  మౌనం నేను పొద్దుగూకులు బతిమాలాలనేగా!?" అని నీటి తెరను తళుక్కు మనిపిస్తే నేనే బతిమాలేను చివరకు.

ఈ 40 ఏళ్ళ సాహచర్యంలో నిన్ను పువ్వులలో పెట్టుకుని చూసానని చెప్పలేను కాని నాకు తోచినంత వరకు నా చేతనైనంత వరకు నిన్ను నా  ప్రాణం తో సమానంగా చూసుకున్నా.  ఆ ఎవరికి కావాలిలే వెధవ ప్రాణం అని విసుక్కోకే! నాకు నీలా ప్రతి దానిని అందమైన మాటలలో పెట్టటం రాదు. కవితలుగా, మాటల వర్గాలుగా మార్చి నీ మీద చిలకరించటం కూడా తెలియదు. నీకు ప్రేమించా అని చెప్పటం, సెలవులకు హాలిడే ట్రిప్‌లకు తీసుకుని వెళ్ళలేదేమో. కాని నీ కోసం, మన పిల్లల కోసం  నా జీవితాన్ని నాకు వీలైనంత వరకు అంకితం చేసి  తపన పడ్డానే.. నేను పడలేదా అనకు.. పడ్డావు నాకంటే ఎక్కువ పడ్డావు.

మన రవి కాలేజ్ ఫీజ్‌లు కట్టాలని రెండో షిఫ్ట్‌కు కూడా వొప్పుకుని అర్ధరాత్రి వచ్చి  అన్నం తింటూంటే, ముందు గదిలో మూలన నా చెప్పులలో కనీ కనపడని చిల్లులు, నా చేతుల వేళ్ళకు కట్టిన కాయ చూసి  రాత్రి నన్ను అల్లుకుని వెక్కి వెక్కి ఏడ్చిన నీ కన్నీళ్ళు తలచుకుంటే ఇప్పటికి నాకెంత గర్వమనుకున్నావు. నన్నల్లుకున్న చేతులు నా భుజాలను తడుముతూ, వెచ్చని కన్నీళ్ళతో గుండెను తడుపుతుంటే మహా సామ్రాజ్యానికి చక్రవర్తి కైనా  గర్వం వుంటుందనుకుంటున్నావా.. వుహూ...పెరిగే ఖర్చులతో, పెరగని జీతాల మధ్యన నువ్వు చేసిన సర్కస్ ఫీట్‌లు నాకు తెలియవా

జీవితాల నిరాశా నిట్టూర్పుల మధ్య మనం గమనించుకోలేదు గాని, మన మధ్యన గడిచినది మాత్రమేమి తక్కువ ప్రేమ కావ్యమా.. కాని ఈ ప్రేమ కావ్యంలో పువ్వుల నిట్టూర్పులు.. పట్టు జలతారు పరదాల విరహాలు... ఒకరి ప్రేమకు ఇంకొకరి మెచ్చుకోలుల అనుకోళ్ళు లేవు.  వున్నవల్లా కను రెప్పల మధ్యన దాచుకున్న వుస్సురనే మధ్యతరగతి నిట్టూర్పులు, ఆ బాధ్యతల భారాల తాడుపై కసరత్తుల మధ్య పడిపోకుండా ఒకరి కొకరం అందించుకున్న చేయూతలు, చిరునవ్వులు అంతే కదా.. అదిమాత్రం తక్కువా!?  ఆ చేయూతల చల్లదనమే లేకుండా ఒక్కళ్ళమైనా మనగలిగేవాళ్ళమా!?

ఎన్నో సార్లు నీతో ఒంటరిగా కూర్చోవాలని కాసేపు కులాసాగా ఏదో ఒక మాట చెప్పి నిను మురిపించాలనే అనుకునేవాడినే, కాని అదేమిటో ఖర్మ మనం కూర్చుని మాట్లాడటం మొదలెట్టగానే మొదటి ఐదు నిమిషాలలోనే ఏదో ఒక వాగ్యుద్ధం మొదలయ్యేది. బరువుల కాడిని ఒకరి అంచనాలకు అనుగుణంగా ఇంకొకరు మొయ్యటం లేదనో, పిల్లలను పెంచటంలో ముందుగా ఎవరు తప్పు చేసేము అనో, ఇంకేదో ఇంకేదో! మా అమ్మ కిందటి సారి నిన్ను  ఏదో అంటే నేను తిరిగి అనలేదనో, మీ అన్న వదిన వాళ్ళు వస్తే చూసి చూడనట్లు వెళ్ళాననో ఏదో ఒకటి..! ఎంత పిచ్చి వాళ్ళం కదూ!? మనతో ఎప్పుడో వున్నవాళ్ళకోసం, ఎప్పుడో వదిలి వెళ్ళి పోయే వాళ్ళకోసం... జీవితాంతం కలిసి వుండవలసిన మనం మన జీవితాల మాధుర్యాన్ని తగాదాల జ్వాలలో వేసి ఆహుతిచ్చేవాళ్ళం. ఇప్పుడు చూసుకుంటే జీవన నావలో మన ఇద్దరమే వున్నాము కాని నావకు కట్టిన తెర చాపలో మాయని మాసిక లెన్నో..!

ఎందుకు ఇదంతా ఇప్పుడు అని విసుక్కుంటున్నావా విసుక్కోవేమోలే. నిన్న అమ్మణి వచ్చిందని సంబరంగా పాయసం చేసి మనవరాళ్ళకు తినిపించి, గోరింటాకు పెట్టటానికి డాబా పైకి చాపతో వెళ్ళేవు. మీ మాటల సంబరాలు విని మూట కట్టుకుందామని నేను ఆ మెట్ల మీదే కూర్చున్నా..  "అమ్మమ్మా తాతయ్య నిన్ను తిట్టేవారా?" అని పిల్లలు అడిగిన ప్రశ్నకు నీ సమాధానం ఎందుకో ఈ ముసలి గుండెను మెలి తిప్పింది రా వసు. ఏమన్నావు?"  మీ తాత గారు పొమ్మనకుండా పొగ పెట్టేవారమ్మా.. ఒక మాట ఎప్పుడూ నోటి నుంచి

రాదు అలా ముంగిలా కూర్చోవటమే, కాని చేసేది చేసేవారు. ఎప్పుడూ నన్ను ఆ మౌనంతో సాధించి చట్టుబండలు చెయ్యటమే, ఇదుగో చివరికి ఈ రోజు కూడా పొద్దుట నుంచి మూతి ముడుచుకుని కూర్చున్నారు. పాయసం తినమన్నా తినలేదు ఈ అలకలు తీర్చలేకే 'ఏదో ఒక రోజు నా వూపిరి ఆగిపోతుంది'' అని. వోసి పిచ్చి మొహమా మాటకు మాట పెరిగితే ఎప్పటిలానే నీ కంటిలో నీరు చూసి చెమరించిన నా మనసు వోదార్చగలదో లేదో అని, అదీ కాక మన పెళ్ళి రోజే వాదనెందుకు అని ఏమనలేదే. పొద్దుట నుంచి ఎన్నో పనులు మామూలుగా చేస్తున్నావు కాని మన పెళ్ళి రోజనే గుర్తు కూడా లేదు నీకు. మల్లెపూలు తెస్తే అయ్యో సంబడం, పిల్లల కోసం కాస్త శనగ పిండి తెమ్మంటే ఈ పూలేమిటో అని సణిగి.... పూలను, నా మనసును టేబుల్ మీద విసిరేసి వెళ్ళేవు..

ఎందుకో నిన్నటి నుంచి గుండె పట్టుకు పోయినట్లు, ఆ వచ్చే అరా కొరా మాట కూడా మూగనోము పట్టినట్లుందే పిచ్చి వసు...నాకు నీ మనసు తెలుసు..! మాటల పెళుసుతనం కింద దాగిన ప్రేమ వూటల మాధుర్యం. ఈ తాపత్రయానికి వెనుక పూలలోని దారంలా ఈ కాపురం కోసం నువ్వు పడే శ్రమ నాకు తెలుసు. పిచ్చి బంగారం ఈ రోజైనా కబుర్లు కట్టిపెట్టి నా దగ్గర వచ్చి కూర్చో... మళ్ళీ చెప్పగలనో లేదో, జీవితాంతం చెప్పాలనుకున్న చెప్పలేక ఆగిపోయిన నా మాట, గుండె సవ్వడితోపాటే శాశ్వతంగా ఆగుతుందేమో వినరా అమ్మడు.! నా జీవన మాధుర్యానివి నువ్వేనని, నువు లేక వూహించలేని జీవితం నీ కన్నా ముందే వూపిరాగాలని తాపత్రయ పడుతోందే ఇలా రా వచ్చి ఒక సారి నీ చల్లనిచేతితో గుండె మీద రాసి మరుజన్మకు తోడు వస్తానని బాస చెయ్యవే పిచ్చి బంగారు తల్లి..!!






# కృష్ణాష్టమి

**కృష్ణ,**

యుగాల కావల నువ్వు...... జగాల కీవల నేను... కలిపే సూత్రం ప్రేమ ఒక్కటే..... నిత్యం నీ నామ స్మరణ మోగే గుండెలో నిత్య సంతోషాల ధూపం పరిమళిస్తుందని చెపుతారే.... మరి ఎందుకలా మురళీ గానాల నీడల తిరిగే యమునా తటిలో దిగులు నీడల ఛాయలు కనపడుతున్నాయి? విన్న ఎన్నో మధురిమల గాలి వల్లెవాటుల రెప రెపల సవ్వడులు నెమ్మదించినవెందుకో... నీ జన్మదినాల సంబరాలను వాడ వాడలా వెల్లివిరిసిన మంగళ తోరణాలతో పోటెత్తుందనుకున్న మధుర.... మెల్లని వీణా గానాల సవ్వడులతో, మంద్ర సంద్రాల కలకలంతోనే సరిపుచ్చిందెందుకో.. నువ్వు లేవనా? రావనే అనుమానాల కలకలం కూడా వినపడుతోంది..!!!!

ఎక్కడున్నావు నీవు కృష్ణయ్యా? యుగాల కావల నువ్వు ప్రతిష్ఠించిన ప్రేమ రాగాల పల్లవులు ఈ నవీన కాలాన అదృశ్యమవుతున్నాయని నొచ్చుకున్నావని మొన్న కలిసిన గోపెమ్మ చెపితే.... విస్మరించిన నీ నెమలికన్నుల జ్ఞానాన్ని తిరిగి ఇవ్వటానికైనా మా కోసం వస్తావని మళ్ళీ ఇంకో గోపెమ్మ వోదార్చింది... ఉరికే యమున పిల్ల కాలువ ఐపోయింది. కాళింది బుసలు కొడుతూ తిరిగి లేచింది తోకపై... ఎన్నెన్ని అమాయకపు ప్రాణాలు గోవులల్లే, రెల్లు పోచలల్లే..... బుసల వేడికి మాడి పోతున్నాయి. గాన మాధుర్యాల వైతాళికుడివై మృత్యమద్దటానికి రావు?

అసమానత్వం, అహంభావం పురులు విప్పుకుని, స్వార్థ క్రూరరాగ తాళాలతో విలయ నృత్యం చేస్తోంది... నీ నేస్తమైన లయకారుని పంపి పీచమణుస్తావని వేచి చూస్తే, చల్లగా మొన్న ఆదమరచి నిద్రిస్తున్నప్పుడు వచ్చి..... సమస్య సృష్టించుకున్న నీవే కదా పరిష్కారం కనిపెట్టవలసిన బాధ్యురాలివి. కర్త, క్రియనేనని తలవని నీ కర్మలకు నేనెలా భాద్యత వహిస్తానన్న నూతన గీతా సారాంశాన్ని చెవిలో వూది

వెళ్ళేవు? ఆమాటే నే ఆదమరవనప్పుడు నా ముందుకు వచ్చి చెప్పనే లేదు.. నీ మోహనా కారాన్ని నా కళ్ళ నిండా నింపుకుంటాన్న భయమో.... నా శుష్క తర్కాలను వినవలసి వస్తుందన్న అసహనమా మరి అది?

అదిగో చూసావా నా కోపాల తాపాలను నీ మీద ఆకు వలగా విసిరి నిన్ను నా ముంగిట కట్టెయ్యాలన్న ఆశ చూసి నవ్వుతున్న నీ దరహాసం, నల్లని మబ్బుల నిలిచిన తటిల్లతై... నా ముంగిట ధార గా నిలిచిన ప్రవాహాల నీడలో మెరిసి నన్ను అంధురాలను చేస్తోంది... శరత్కాల వెన్నెలవై సేద తీర్చటానికి రావు? అడుగడుగున నేనే కల్పించుకున్న ఈ సమస్యల సుడిగుండాల చిక్కి వుక్కిరి బిక్కిరవుతున్న నన్ను నీ కనుచూపుల కడతేర్చటానికైనా రావా?

ఎన్నెన్ని జన్మ దినాల సంబరాలు చేసుకున్నావు నువ్వు.. ప్రతి శరీరం ఆత్మ నీతోటి సంయోగం కోసం మధుపరవశాల వేణుగానాల లీనమైనప్పుడు, నువ్వే వేవేల కోట్ల రూపాలై ఆడిన కోలాటాల సంబరాలు ఇంకా సద్దుమణగక ముందే కొన్ని కోట్ల జన్మదినాలు అంతమయ్యాయి.... యమునా తటి పైన నీతోటి సాగిన నౌకా యానాల తలపుల సడి అణగకముందే మరి కొన్ని లక్షల జన్మదినాల వేడుకలు నను వీడి పోయాయి, ఇంతలోనే వలదన్నావు, నీ తోడు కాదన్నావు, కనుమరుగై....... నీ గుర్తు గా ఇక్కడ నీ పాదాలను ముద్రించి, ఆ సంబరం మాత్రమే నాకు వుంచి, నీ నీల వర్ణాలను అక్కడక్కడా నీ రూపుగా, నీ ధ్యాసగా నాకు మిగిల్చి, సంబరాలను కేవలం ఐహికమైన సంబరాలనే నాకు కానుకగా మిగిల్చి మరలి పోయావు. న్యాయమా అని అడగ వచ్చిన రాధమ్మను నీలో ఐక్యం చేసుకుని ఆ ఛాయనూ మాయం చేసేవు?

ఎదలో పొదలో రేగిన విరహం అగ్నికీలలై మండిస్తుంటే అనంత విశ్వాన నా వేణుగానాల చ్ఛాయలు వదిలాను విని సంతోషించమన్నావు... దూరాన వినిపించిన గానాలకు పులకరించిన యమునా తటిని వద్దని ప్రతి క్షణం కొలువైన నీ గుండెలోనే నేనున్నానని అక్కడే సేవించమని ముళ్ళగోరింటలతో...... క్షణ కాలంలో సుడి గాలితో కలిసే గోరింట రంగులతో కబురంపేవు.. నా వంటి మంద భాగ్యురాలికి లిప్తలో మాయమయ్యే సందేశాలను గ్రహించగలననేనా నీ ఆలోచన?

ఇన్నిన్ని గానాల.. ఎన్నెన్ని రూపాల నీ నామ గుణ గణాలను ప్రస్తుతిస్తూ నీ జన్మదినాలను పలకరిస్తు, ఆ పలకరింపుతోనే పులకరించే నాకు ఈ జన్మ దినాన ఐనా నేనడిగిన ప్రేమ శాంతి రూపాన వరమివ్వవా? జగాలన్నీ ప్రేమ మయమంటారే మరి వాటి చాయలేవి నాకు కానరావటం లేదు.. ఎక్కడ చూసినా స్వార్ధపు కాళింది మడుగులే.. ఎక్కడ పలకరించినా అహంకారపు బుసలే... నేను నేనన్న నా అభిమతపు ఆహాల చాయలే...

తల్లి తండ్రుల ప్రేమలో, మిత్రుల చెలిమి వెలుగులో, సహచరుల బిడ్డల మమతలో నాతోటి కలిసి నడిచే ప్రతి అడుగులో, పదంలో.... ప్రయాణంలో, నీ విశ్వతత్వమైన ప్రేమ చాయలు వెతుక్కుని తృప్తి పడదామని చూసినా.... మనసు వాటితో సమాధాన పడటం లేదు. అంతకు మించిన విశ్వ శ్రేయస్కరమైన ప్రేమ కావాలనిపిస్తోంది.. అనంతంగా మండే సూర్యుని వెలుగులా పంచగలిగిన ప్రేమ కావాలనిపిస్తోంది మరి అది ఇవ్వగలిగిన నీతోటే కదా నేను మొర పెట్టుకునేది.. గతి మతులకు కారణమైన స్థితికారుడవైన నువ్వే ఆ ప్రేమను పంచలేక పోతే నీ జన్మ దినాన నా జీవితమే కానుకిచ్చిన నా బహుమానం వృధా కదా...!

నవ్విన నీ రూపవిలాసం కంటి కగుపడుతోంది. అదుగో గడుసుదానివన్న నీ మాట కూడా..... మరి "సర్వే జనా సుఖినోభవంతు.. సహనా వవతు.. సహనౌ భవన్తు...సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు... మా విద్విషావహై " అని నువు చెప్పిన శాంతి మంత్రం లోని నిజమైన శాంతి మాకు కానుకివ్వటం మరి నీ బాధ్యతే కదా నీ పుట్టిన దినాన. అందుకే కృష్ణయ్య.. ఎన్నెన్ని ఎన్నెన్నో ఇంకెన్నో చేసుకున్న చేసుకోబోతున్న నీ పుట్టిన రోజుల మీద ఆన..... ఆ శాంతి, ప్రేమను నాకు కానుకివ్వక పోయావంటే మరి.






# దూరాభారమా...చేరువవ్వనితీరమా....

ప్రియమైన నీకు,

చాలా కాలానికి వుత్తరం వ్రాస్తున్నాను అని కోపం వచ్చిందా!

ఇదుగో రేపు అదిగో మాపు అనుకుంటూనే ఈ పనుల వ్యవధి లో రాయలేక పోయాను అని కిందటి సారి నిన్ను కలిసినప్పుడు చెపితే నీ గుబురు మీసాల కిందుగా కదిలిన చిరుదరహాసం నేను గమనించలేదనుకున్నావా? అవును మరి...... ప్రేమ అన్నిటి మధ్యా వుండి కూడా అన్నిటితో కలిసి పోయిన ఒక చిత్తు కాగితం మీద రాసిన వెలిసి పోయిన వాక్యంలా మాత్రం కాదు అని... ప్రేమ లేఖ అయినా ప్రేమ అయినా ఎప్పుడు నేను అల్లరి చేసినప్పుడు నువ్వు విసుక్కుంటూ తల పక్కకు తిప్పి నవ్వినంత కమ్మగాను అంత స్వచ్ఛంగాను వుంటుంది అని కబుర్లు చెప్పిన పిల్ల ఇదేనా అనుకుంటావు అని తెలుసు.....

నిన్ను నన్ను ఈ ప్రేమను అన్నిటిని మింగేసే మహిమ కాలానికి వుంది మరి అనకు, అంతటి కాలం.. ఎంత ప్రయత్నించి విఫలమయ్యింది చూడు మన ప్రేమను చెరిపేద్దామని, అది మరి మన ప్రేమ గొప్పతనం కాదు అంటావా?

కాలం విసిరిన పాచికలతో నా జీవిత వైకుంఠపాళిలో నేనెప్పుడు పాముల చేతిలో పడి మళ్ళీ మళ్ళీ కిందకే వస్తున్నా తిరిగి పైకి వెళ్ళేందుకు ధైర్యం ఇచ్చేది నీ ప్రేమే కదా కృష్ణా... పాములంటావా ఇక వాటి నోటి లోపల పడటం నీ చేతిలోనో నా చేతిలోనో లేదు కదా... మన చేతిలో నిర్ణయాలు వున్నప్పుడే మనం తీసుకోలేక పోయాము. అది మాత్రం మన చేతిలో వుందా విధి లిఖితం తప్ప. అబ్బా అంతా వేదాంతమే అని వెక్కిరించకోయ్. నీ అంతగా జీవితాన్ని చదవక పోయినా నేను ఎంతో కొంత చూసేను కదా జీవితాన్ని. నాకు మాత్రం తెలియదా విసిరే వానజల్లు ఒక్క సారిగా సముద్రం మీది వానలా హోరుమన్నప్పుడు మూసేసిన తలుపుల వెనుక రోదించే హృదయం బాధ ఏమిటో!

నిన్న ఆర్.పి రోడ్ మీదుగా వెళుతుంటే  చివరి తురాయి చెట్టు  పక్కనే బామ్మ గారి ఇంటిలోని పారిజాతపు మొక్క ఎంత ప్రేమ గా పలకరించాయి అనుకుంటున్నావు. నాకైతే పనులన్నీ ఆపేసి ఒక్క సారి మళ్ళీ  తురాయి చెట్టు కింద కుర్చోవాలని ప్రాణం కొట్టుకుంది. నువ్వు లేవు కదా నేను ఒక్క దాన్ని కూర్చున్నా  అనుభవమైతే తిరిగి రాదు అని ఒక్క నిట్టుర్పుని వాటికి మధ్యాన్నపు వడగాలితో కలిపి ఇచ్చేసి వెళ్ళిపోయాను.

ఏమి చేస్తున్నావు ఎక్కడో సముద్రానికి అవతల నీవు ఇక్కడ ఒంటరిగా తీరానికి చేరని నావలను చూస్తూ ఎప్పుడో దరిచేరే సంయోగం కోసం నేను... కలిసి వున్న కాలం కంటే మనం కలలు కన్న కాలం ఎక్కువేమో కదు. కలుసుకున్నా, కలలు కన్నా అంతా ఒక్కటే అనుభవాల మాలిక, తరచి చూస్తే ఏమి వుండదు అంతా అంటాడేమో చలం కదు...

అనుభవమంటే గుర్తు వచ్చింది, మొన్న లీల ఆమె భర్తా కనిపించేరు. చాలా సేపు మాట్లాడు కున్నాము. అదే మూర్ఖత్వం ఏమి మారలేదు ఆమె. అనుభవాలతో అభిప్రాయాలు మార్చుకోవాలి అని నేను, అను ఎప్పుడు అనుకుంటాము. మరి మారేంతగా అనుభవాలు ఎదురవ్వలేదో  అనుభవపు తీవ్రతను అభిప్రాయాలను వేరు చేసి వుంచుతారేమో ఆమె.

జీవితమంటే ఇలానే వుండాలి, ఇలా చేస్తేనే ఒప్పు, ఇలా కాకుండా ఏమి చేసినా తప్పే అని ఆమెకు అంత ఖచ్చితంగా ఎలా తెలుసో. ఇంతా చేసి ఆమె ఇలానే వుండాలి అనుకునే జీవితానికి ప్రమాణాలు ఏమి వుండవు ఆమె అమ్మమ్మ, అమ్మ పక్కింటి పంకజం పని లేక మాట్లాడుకునే మాటలు తప్ప, వాటినే ఆమె అంత గాఢంగా ఎలా నమ్మగలుగుతుందో, ఎంత గొప్పగా చెప్పిందో ఆమె అభిప్రాయాలను, నవ్వే ఆడదాన్ని ఏడ్చే మొగవాడిని నమ్మకూడదు అని మన పెద్దలు ఊరికే పెట్టలేదు తెలుసా ఎంతో ఆలోచించే పెట్టేరు, ఎందుకు బయటవాళ్ళ ముందు అంత విరగబడి అంది.. తెల్ల మొహం వేసి చూసేను. మనిషి ప్రాధమిక హక్కులలో కూడా ఆడ మొగ అని విడదీసి మనం మన హద్దులలో వుంటే అసలుగోలలే రావు అని ఒక్క మాటలో తేల్చి చెప్పింది..

అబ్బ ఇలానే ఏమిటో మాట్లాడింది. వెళ్ళేక మంచి కాఫీ పెట్టుకుని చలం ప్రేమలేఖలు కాసేపు చదివితే కాని తలనొప్పి తగ్గ లేదు..

కాని కృష్ణా ఒక్కొక్క సారి అనిపిస్తుంది అలాంటి వాళ్ళతోనే ఏ గోల లేదు మనకు ఖచ్చితంగా తెలుసు. వాళ్ళు మనం ఒకే భూగోళం మీద వున్నా వేర్వేరు గ్రహాలకు సంభందించిన వాళ్ళం అని. ఎందుకురా ఈ గోలలన్నీ నీకు ఇటురా అంటు చేతుల మధ్యకు లాక్కొని నువ్వుపెట్టే తడి ముద్దు తలుచుకుంటే కాసేపు ఈ గోలలన్ని మర్చి పోతాను. ఇంతలోనే దిగులు మళ్ళీ ఎప్పుడు వస్తావు ఇక్కడకు...

నువ్వు వున్నపుడేమొ పరిగెత్తే కాలం నువ్వు లేనప్పుడు ఏమవుతుందో.... అసలు ఎక్కడ వుందో కూడా తెలియదు, ఘనీభవించిన కాలం కరిగి కన్నీరైనా కాకూడదు... ఎంతో కొంత బరువు తగ్గేను...

**నల్ల కుట్టీ,**

కలసిన కాలాల వెనుక కలవని జీవితాల కధలు ఎప్పుడు రాస్తే ఏమిలేరా. నువ్వులేకపోతేనేమి నా పక్కన. నీ పలకరించే హృదయం ప్రతి ఘడియ కవాటలను తెరుస్తూ నీ ప్రేమ ను నా ధమనులలోకి పంపుతూ......... మూసేస్తూ నీ శ్వాసను బయటకు పంపి మిగిలిన నా జీవితాన్ని బతికిస్తోంది.

నువ్వు సముద్రమనగానే ఒక్కసారిగా వుప్పటినీళ్ళ మీద విపరీతమైన బెంగ వేసిందిరా. చలి వాన కూడా లెక్క చెయ్యకుండా బీచ్ దగ్గరకు వెళ్ళేను. చాలా సేపు వానలో సముద్రం తడుస్తూ వుంటే చూస్తు చివరకు పాపం సముద్రానికి చలేసి చీకటి దుప్పటి కప్పుకుని వెళ్ళమని గదమాయిస్తే వచ్చేసా. వున్నంత సేపు చలిలో వణుకుతూనే నీ కబుర్లు ఎన్నో చెప్పింది, మొన్నీ మధ్యన తన ఆవలి అంచున నువ్వొచ్చి చెప్పిన వూసులు కూడా చెప్పింది రా.

ఏది ఆగినా జీవితం ఆగదు రా. ఆడక తప్పని వైకుంఠపాళి లో పావులమైనా పాములమైనా ఆట తప్పించుకో సాధ్యమా చెప్పు. మనం తీసుకోలేక పోయిన నిర్ణయమే నిరంతరం తీరని ఆశను మన భవిష్యత్తుగా మలిచి మన ముందుంచుతోంది. అందుకే దూరాన్ని దూషించకు. అది చేసే మేలు కూడా వుంది మరి.

తురాయి చెట్టు కనీసం నిన్నైనా చూసుకుని మరింత పచ్చదనాన్ని పాటలల్లి గాలితో జ్ఞాపకంగా నాకు గంధమద్దేది కదా. అసలే ఇక్కడ సువాసనే లేక వుత్త వర్ణాలు విసుగొస్తున్నాయి మరి.

నువ్వు నేను మనలాంటి వాళ్ళు వేరు వేరు గ్రహాల మీద వున్నా వేర్వేరు దేశాల లో వున్నా కలిపే అంతఃసూత్రమొకటి వుంటుంది...అది స్పందించే హృదయం. స్పందన తగ్గిన వాళ్ళకు నువ్వు ఏమి చెప్పినా ఏమి లాభం లేదు. అది వినగల తంత్రులు వాళ్ళకు చారాల అనాచారపు బరువుల కింద నలిగి పోయాయి కదా.. పాపం వాళ్ళను చూసి జాలి పడు అంతే. ఎలానూ వాళ్ళు మనను చూసి జాలిపడతారు. చెల్లుకు చెల్లు. ఏమంటావు..?

చాలా రాయాలని వుంది కాని రాయలేని అశక్తత పొగ మేఘమల్లే కమ్మేస్తోంది. కరగమని నువ్వు ఆనతిచ్చిన దిగులు గుబులు ఘనీభవన స్థాయి దాటి కళ్ళలో చేరుతోందేమో. ఎందుకు అలా అడిగేవు, చూడు ఇప్పుడు ఏమవుతోందో.!






## బతుకు శాపమా.. ఆలోచనల లోపమా?

**కృష్ణా!,**

"ప్రేమ నీకు కావాలంటే పిరికివాడు కారాదు.." ఎంత హాయిగా తేలికగా పాడుతోందో ఆ అమ్మాయి. చెప్పటం ఎంతో తేలిక కదూ!.. జీవితంలో ఇంత దూరం నడిచి నడిచి అలిసిన ఈ సమయంలో నేస్తం, వెనక్కి చూసుకుంటే ఆ మాట వింటేనే నవ్వు వస్తోంది. పిరికితనం..!!! రకరకాల రూపాలలో జీవితాలను మొదటి నుంచి శాసిస్తున్న ఒక మంత్రమై పోయింది.. మన తరంలో చాలా మంది సగటు మధ్య తరగతి అమ్మాయిల జీవితాలని శాసించిన ఒక మంత్రం కాదూ అది. ఆ పిరికితనం, మధ్య తరగతి జీవితంలో ఆడపిల్లగా పుట్టటమే ఒకలాంటి పిరికితనంతో పుట్టాలి. అలానే పెరగాలి. లేకపోతే అమ్మో పర్యవసనాలు ఊహించతరమా...!?

"తలవంచుకుని నడువు లేకపోతే ఆడపిల్లవు ఆ విరగబాటు ఎందుకు అంటారు" అని హెచ్చరించే అమ్మ గొంతుతో మొదలవుతుంది బాల్యం. ఎందుకు అలా స్నేహితులతో అంత విరగపాటు నవ్వు, వెనుక మొగపిల్లలు నిన్నే చూస్తున్నారు తెలుసా.? నీ మూలంగా నాకు షేమ్ అవుతోంది అంటున్న అన్నయ్య గొంతు నేపధ్యంలో యవ్వనం మొదలు అవుతుంది. శరీరంలో, మనసులో వస్తున్న మార్పులతోనే సతమతమవుతున్న తరుణం, దానికి తోడు బయటకు వస్తే వెకిలిచూపులు చూసే, చొంగ కార్చే మొగపిల్లలు. పదహారేళ్ళ వయసు, అది చేసే గారడి అంటు కుహనా సినిమాలు.. అదేదో నిజంలా మొగవాడు మన శరీరం కేసి జిలేబిలానో, పాలకోవాలానో చూస్తుంటే అది తమ గొప్పతనం అని మురిసే తోటి ఆడపిల్లలు. అసలు మొత్తం ఆడజాతికే ఏదో శాపం ఉన్నట్లు "అరిటాకు వెళ్ళి ముల్లు మీద పడ్డా" అంటు, మొత్తం సమాజం అంతా అలానే ఉంటారు అని భూతద్దంలో పెట్టి చూపించి భయపెట్టే నాన్న, వీటన్నిటి మధ్య భయం భయంగా పిరికితనంగా గడపమని అంటారు.. లేదు నేను నవ్వుతాను,ఎగిరే పక్షిలా, వీచే గాలిలా, హాయిగా స్వతంత్రంగా.. నేను ఆలోచిస్తాను కేవలం నా ఆలోచనలతోనే, సమాజం వేసి పోసిన మూసలో కాదు అంటే అమ్మో ఎంత పిరికితనం ఈ సమాజానికి మనం అంటే.. ఆ పిరికి తనాన్ని నీ తిరుగుబోతు తనంగా ముద్ర వేస్తారు.

మొదలు పెట్టిన అణిచివేత అక్కడితో పూర్తి అవుతుందా, కాదు.. కానే కాదు కదా.. ఈ అణిచివేతల భావజాలంలో పడి మనమంటే మనకే ఏమిటో తెలియదు, మనం అంటే శరీరం, మనం అంటే మన డబ్బు, మనం అంటే మన అమ్మలు, వెరసి వాళ్ళ తోవలో నడిచే మనవాసన కొట్టే భావాలు. వీటన్నిటి మధ్య నుంచి ఎంత భాగ్యమో, పుణ్యం కొద్ది దొరుకుతాడు మనకు ఒక మగ మహారాజు. నీ ఆడ జన్మ నోచుకున్న నోములు పండి వస్తాడు. అప్పటికే మధింపబడిన నీ మనస్సు ఆ రొట్టలోకి వెళ్ళిందా.. నీ అంత అదృష్టవంతులు లేనేలేరు. ప్రేమించే భర్త, నిన్ను కంటికి రెప్పలా కాపాడుకునే భర్త. ఆయన ప్రేమలో కరిగిపోయే నువ్వు. చాలా రాజకుమారి కథలలోలా వాళ్ళిద్దరు పెళ్ళిచేసుకున్నారు. కథ ఆఖరు, సుఖాంతం అని అనేసుకోవచ్చు.

కాదా.. అలా ఉండవా.. ఆలోచిస్తావా ఒక మాములు మనిషిలా, మీ అమ్మ చెప్పిన పండంటి కాపురానికి పదహారు సూత్రాలు పరిధి దాటి ఇక చెప్పేదేమి ఉంది.. నను కంటికి రెప్పలా కాపాడనక్కర్లేదు, నా రక్షణ నాకు తెలుసు అంటావా.. నా ముందో, నా వెనకో నడిచి నను కాసే నాథుడు వద్దు, నాతో కలిసి సరి సమానంగా అడుగు వేసే వాడు కావాలి అంటావా? ఐతే నువ్వు మితి మీరిన కోరికకు మొదటి పునాది వెయ్యనే వేసేవు. నువ్వు అమాయకంగా, ఏమీ తెలియకుండా (తెలిసి నటించినా పర్లేదు) ఇంతలేసి కళ్ళతో ఆరాధనగా నాలుగుసార్లు చూసి, ఆ పైన ప్రతి దానికి గోముగా, గారాంగా మొహం పెట్టి, వీలైతే పడకటింట్లో కోరికలు కోరి (మరి నీకు అలానే కదా ఈ కథలు, సినిమాలు అన్ని చెప్పింది) నీకు కావలసినవి సాధించుకోలేదా.. నవరసాలు అదేదో మామిడికాయ రసాలులా వర్ణించి చెప్పిన అష్టనాయకలు, వాళ్ళ గురించి పేజీలకు పేజీలు వర్ణించిన పాత కవి పుంగవుల నుంచి మోడరన్ కవుల వరకు ఒకటే ఫీలైపోరూ.!

నీకు ప్రేమ కావాలంటే పిరికి దానివే కావాలి, నీ ఆధారపడే గుణమే నీ మీద ఎవరికైనా ప్రేమ పెంచుతుంది. స్వతంత్రంగా ఉన్నావా గయ్యాళనవచ్చు, ఆడపెత్తనమనవచ్చు, తెంపరి తనమనవచ్చు, ఒద్దిక లేదనవచ్చు.. అబ్బో ఎన్నైనా అనుకోవచ్చు. మనకోసమేగా యుగయుగాలుగా ఎన్నో చరిత్రలు రాసి దాచి ఉంచబడినవి మరి.

ఏదో యధాలాపంగా రాసాను కాని, నాకు ఇటువంటి బాధలేమి లేవని నీకు తెలుసులే. ఇటువంటి విపరీత పోకడలేమి పోక, ఎంతో ఒద్దికతో కార్యేషు దాసి.. ఇంకా ఆ పైన ఏదో చెత్తా, చెదారం అని రాసిన సంస్కృత పదాలు (అదేమిటో సంస్కృతంలో రాస్తే ప్రతిది పవిత్రమే, విలువ కలదే కదా) అక్షరాలా పాటించి ప్రేమించే భర్త, ఆణిముత్యాలు లాంటి పిల్లలను కని, భారతావనికే పేరు తెచ్చే పతివ్రతా తరపు స్త్రీ పరంపర లోని భాగాన్ని కదా నేను.

నువ్వు, మధు బాగానే ఉన్నారని అనుకుంటున్నాను. నీకు ఇంత ఆలోచన అవసరం లేదేమో... మొదటి నుంచి ఆలోచన జీవన విధానంలో ఒక భాగంగా అలవరచుకున్న దానివి కదా నీవు, ఇక నిరంతరం మథన పడవలసిన అవసరం లేదనే ఆశిస్తూ, ప్రస్తుతానికి సెలవు మరి.

*ప్రేమతో*

***శిరీష***

ప్రియమైన శిరి,

ఏమయ్యిందే? నీ ఉత్తరం చూసి నాకు, మధుకు కాళ్ళూ, చేతులు ఆడటం లేదు. క్రిందటి సారి నిను చూడటానికి వచ్చినప్పుడే నీ వాలకం చూసి, నిన్ను ఎంతో గుచ్చి అడిగినా మాట దాటవేసావు, ఇప్పుడు ఇలాంటి ఉత్తరం ఏమయ్యిందే!? క్రీనీడల దాగిన కలవరపాటు, అన్ని బంధాలను శపించే స్థాయికు వెళ్ళేవరకు పెరిగింది అంటే గాభరాగా ఉంది. తప్పొప్పుల నిర్ణయాలు తరువాత (అసలు అనవసరం కూడా అయ్యి ఉండవొచ్చు) చూడొచ్చు, ఆలోచనలకు ఆనకట్ట వేయగల ఒక చిన్న విరామం నీ రోజు వారి జీవితం నుంచి నీకు కావాలని అనిపిస్తోంది నాకు.

ఈ ఆదివారం మధు, నేను వస్తున్నాము మీ ఊరు. మీ ఊళ్ళో నా M.Sc స్నేహితురాలు అరుణా వాళ్ళు ఉంటారు తెలుసుగా, అక్కడే ఉంటాం. మాతో పాటుగా ఒక రెండు రోజులు నువ్వుకూడా అక్కడ ఉండవచ్చు కదా.! లేదు మాతో పాటు ఇక్కడకు వచ్చి పూర్తి విశ్రాంతిగా ఉంటానన్నా సరే. నీ ఇష్టం ఎలా చేసినా. నువ్వు ఎక్కువ ఆలోచించకు సరేనా? ఆలోచన కొన్నిసార్లు సమస్యలకు పరిష్కారం కాకపోగా, కొత్త సమస్యలను రేకెత్తిస్తుంది. అది సమస్య అని మనం అనుకోనంత కాలం దాని తీవ్రత మనం గుర్తెరగం. ఒక్కోసారి గంభీరం ధ్వనులతో ఉవ్వెత్తున లేచే కెరటాలకు వెనుక ఏమీలేని బోలుతనముంటుంది. ఇలా అని సమస్యను దాటవేయటమో లేక నిన్ను కించపరచటమో నా ఉద్దేశం కాదు. అర్థం చేసుకోగలవనుకుంటున్నాను.

సరి ఇక ఇలా రాసి ఇక్కడ నుంచే, సూది మొన నుంచి పర్వతాన్ని చూడటమో, భూతద్దంలో వెంట్రుక కొనను చూసే ప్రయత్నాలు ఆపేస్తాను. ఏదైనా ఒక నిర్ణయానికి వచ్చి, అటుపైన సమస్యను చూడటమన్న అలవాటైన ప్రక్రియ నుంచి అవతలకు జరుగుతూ.. ప్రస్తుతానికి ఆలోచన కట్టి పెట్టి, నాకులానే ఆదివారం కోసం ఎదురు చూడమని మాత్రం ఇప్పటికి సలహా ఇస్తూ.

**నీ ప్రియ మిత్రురాలు**

**కృష్ణ.**






# *విరహమే నాకో నిత్య ఉగాది..!*

*ప్రియమైన నేస్తం...*

విసిరి విసిరి కిటికీ మీద కొట్టే వాన జల్లు ఈ రోజు నాకు నిద్రను దూరం చెయ్యటానికే పూనుకుని వచ్చినట్లు వుంది.. జ్ఞాపకాల పూల గంధాలను కన్నీటి గంపలకెత్తి గుమ్మం బయట, మనసు లోన లెక్క లేకుండా వొలక పోస్తోంది. దూరమయిన స్నేహితమా దూరమవ్వని దిగులు భారమా... ఎంతగా తలచుకున్నా తిరిగి రాగలవా... రాలేవు కదా.. ఐనా కోరుకున్న మనసుకు అలసటే లేదు...!!! విసిగి వేసారినా మళ్ళీ ఎదురు చూడటం మానదు...

ఎంత దూరం మన ఇద్దరి మధ్యన.!!!! జీవితపు ప్రతి దశలోను అది ఆగకుండా తగ్గకుండా పెరగ కుండా అలానే వుంటూ వచ్చింది, అదేమి చిత్రమో... చిన్నప్పుడు మనమిద్దరం ఎవరికెవరూ తెలియక పోయినా నీలపు ఆకాశపు అంచు వెంబడి పరుగెత్తే ప్రతి నల్లటి చిక్కటి మేఘపు తునక వెనుక మెరుపు మరకవై కనపడతావని, బలంగా ధగ ధగ లాడుతూ పెరిగే నీలి కలువ మొగ్గ నీడలో వొదిగి వున్నావేమో అని, అర్ధరాత్రి చూరు వెంబడి కారే సన్నజాజి  తావి నిండిన నీటి చుక్క రెప్పలార్చిన సవ్వడి లోను నువ్వు వున్నావని ఎంత చూసేను... కనపడ్డావా? ఊహుఁ..  లేదు..

ఇంతలో మరి మేఘాల పైన సాగి పోయే దేవ కన్యలు నా బాధ చూసి ఒక్క సారి వాళ్ళ మంత్ర దండం వూపేరేమో, వున్నట్లుండి ఎదురుగా వచ్చి నీ మాటల మంత్రదండంతో నను ముగ్ధ రాలిని చేసేవు... మాటలుడిగి పోయిన నా పెదవుల మీద తీపి ముద్దుల మధురిమలు... నిశ్చేష్టితనైన నా మీద నీ ప్రేమ వరాల జల్లులు కురిపించేవు.. ఎంత తెలివి తక్కువ దానిని.. అపుడే నిను నా కంటి ముందు కట్టేసుకోకూడదూ.... ఉహుఁ.. కట్టేస్తే నిలిచే జడత్వమా నువ్వు!!! నిరంతరం పారే జలపాతపు హోరువి కదా.. జారిపోయే జీవితంలా, ఇంతలోకే.... నే తేరుకునే లోపే కరిగి పోయిన అర్ధరాత్రి కలలా అనంతమైన శూన్యం లోకో, అంతుపట్టని లోకాల వైపుకో పోయావు..

అప్పటి నుంచి ఎంత పిచ్చి పట్టినట్లు వెతుక్కుంటున్నా.. ఎక్కడున్నావా అని. అంతగా ప్రేమ కురిపించిన నీవే ఇలా మనసులేని బండరాయివై, పరిస్తితుల వంక చెప్పి ఇలా దాక్కున్నావేమా... ఇంతలా నీ మనసును దాచేవేమిటా అని నిను తిట్టుకున్నానో... బండ రాయికేసి తల కొట్టుకుని తనువును శిక్షించాలను కున్నానో.. జీవితపు సత్యమింతే అని అర్ధం కాని వేదాంతాన్ని అన్వయింప చేయాలనుకున్నానో... ఏమి చెయ్యాలనుకున్నానో, ఏమి చేసేనో... జారిపోయిన జీవితాన్నే అడగాలి కాని నన్ను కాదు.

హుఁ.. ... ఎన్ని చేసినా, ఎలా చేస్తున్నా, నీ ఎడబాటును నిరంతరం జపించే నేను, మా ఇంటి ముందట శివాలయం గోపురం మీద ఒంటరి పావురాయి ఒకటి వానకు తడిచి, వెన్నలకు మెరిసి మొత్తానికి మౌనానికి బెదిరి... నిరంతరం కుహుఁ కుహుఁ.. మంటు చేసే తపస్సు మాదిరే... ఒంటరి గూడు లో నీ నామ జపం చేస్తూ మిగిలున్నా! ఉహుఁ... మిగిలి వున్నానా???? శిధిలమైన ఆకులా జీర్ణమయ్యానా? నేనున్నా లేనట్టే.. మరి ఇక నువ్వు ఎప్పుడూ వున్నట్టే... చీకటీ వెలుతురూ కలిసే చోట... భూమ్యాకాశాలు కలిసే నీడలో నువ్వు నాకోసం నిరంతర యాత్రికుడిలా ప్రయాణం సాగిస్తావన్న ఆశే మరి ఈ జీర్ణావస్తలో నున్న జీవితానికి నూతన వెలుగును చూపిస్తుంది..

బాధ పెడుతున్నానా నా హృదయాన్ని నా మాటలతో, నాకు తెలుసు! గడిచిన ఏ నిమిషం వెనక్కి తీసుకుని రాలేము... సాగిన కాలాన్ని ఆపి వెనక్కి తీసుకుని వచ్చే మంత్రం హేరీ పాటర్ మూవీ లోకి మల్లే నాకు తెలిస్తే ఎంత బాగుండేది! ఏమి చేసే దానివి అని అడగక.. ఎన్నెనా చేసే దాన్ని, నీతో కలిసి ఇంకా రాజధాని నగరపు వీధుల వెంబడి అలానే పరుగెడుతు వుండే దానిని, ఇంకా అలానే ఇద్దరం బస్ ల లో తిరుగుతున్న కాలం. కలిసి నడిచిన కాలువ గట్లు... చీకటిలో వణికించిన చింతతోపు గాలి.... పరిగెట్టే పాదాల మువ్వల శబ్దం.... తడి ఆరని పెదాలతో పెట్టిన ముద్దు నీ చేతి మీద తల వాల్చిన నా మూసిన కనుల వెనుక వూగే వూహల వూయల. అన్నీ అనీ నా సొంతం చేసుకుంటాను..... చే జారిన స్వర్గం చేతిలోకి తీసుకుని దాచేసుకుంటాను.... నవ్వే నీ కళ్ళ లోని మెరుపును, వెలుగుల విరజాజుల వానను ఎప్పటికి వాడని నా ప్రేమ తోటలోన కురిపిస్తాను. చాలా ఇంకా చెప్పనా ఏమి చేస్తానో కాలాన్ని వెన్నక్కి తిప్పి!

ఎన్ని కలలైనా కరిగి పోవలసిందే వేకువ వెలుగులో, ఎంత చీకటైనా నా గుండె తలుపుల వెనుక సర్దుకోవాల్సిందే. తప్పని ఈ జీవన సత్యం ఎప్పటికి అర్ధమవుతుందో కదా! జీవిత నాటక రంగం పైన విశ్రాంతి తెర ఎప్పటికి దిగదు, ఆలోచనల కరాళ నృత్యమూ ఆగదు... దిశానిర్దేశం చెయ్యని ఆలోచన ఎంత మరలించినా నీ దిశగానే దూసుకుని వెళ్ళి ప్రపంచ గమనానికి ఆధారమైన ఎలెక్ట్రాన్ ప్రోటాన్ సిద్ధాంతాన్ని బల పరుస్తోంది. ప్రేమ అనే ఒకే పదం ఎన్నెన్నో వేల కోట్ల అక్షరాలలో ఇమిడి వైచిత్ర కావ్యాలనూ... స్వరాలకు అందని రాగాలను సృష్టిస్తుంది.!!

ఊహుం.. ఇంతలోనే నిరాశ నిట్టూర్చి నన్ను కమ్మేస్తోంది... ఎంత కాలానికైనా కలుస్తామనే ఆశ వుందా లేదు... ఈ జీవితానికి కాదు ఇంకో జీవితానికి అనే ఆలోచన మనసుపైన దిగులు దుప్పటితో కప్పేస్తోంది.. అది ఐనా ఎవరైనా హామి ఇస్తే బాగుండు అనిపిస్తోంది... ఎలా ఈ విరహాన్ని ఇలానే జీవితాంతం భరిస్తు ఏమి లేనట్లు అసలు ఏమి జరగనట్లు జీవితాన్ని గడిపెయ్యటం... నెర్రలు విచ్చిన ఆకాశాన్ని పగలకొట్టుకుని మెరుపు కలలా వచ్చే నీ తలపునే జీవితాన్ని వెలిగించగల కాంతిగా చేసుకున్నా, మెరుపు కళ్ళను మెరిపించి పైన అంధులను చేసినట్లే నీ తలపు నన్ను మళ్ళీ మళ్ళీ చీకట్లోకే తోసేస్తోంది.

కాని క్రిష్ణా .. అన్ని కోపాలను బాధలను మింగేసే మహిమ ప్రేమకు వుంది అనుకుంటా. క్షణంలో మీ మీద కోపం వచ్చినా వెంటనే తగ్గిపోతుంది. ఒక్కొక్క సారి అనిపిస్తుంది జీవితం ఎంత చిత్రం కదు... ఎన్నెన్ని భావాలో నదిమీది కెరటాలకు మల్లే ఇంతలోనే వస్తుంటాయి అంతలోనే మాయమవుతాయి, కాని మీ మీద ప్రేమ మాత్రం నిరంతరం సాగే ప్రేమలా జీవ నదై సాగుతూనే వుంటుంది. మరి ఈ ప్రేమ నది నా దాహాన్ని తీర్చగలదో.. వుప్పెనై నను ముంచేస్తుందో... నీకు, కాలానికే అప్పచెప్పి నను ఎదురు చూడనీ...

*ఎప్పటికీ నీ*
*నేను..*






# కదిలిన కాలాన్ని అవలోకిస్తూ ...

ప్రియమైన మోహన్,

ఎప్పుడూ కాగితాల మీద సిరా నలుపులతో పలకరించే నేను ఇలా వేగవంతమైన తంతులతో అదే ఈమెయిల్‌లో పలకరిస్తున్నానేమిటా అని ఆశ్చర్యపోకు.. చిన్నప్పుడు కొత్త పెన్ కొనుక్కుంటే అది వుపయోగించి నీకు వుత్తరం రాసి పాళీ పదునును పరిశీలించే వరకు నాకు నిద్ర పట్టేది కాదు గుర్తుందా..!! అలానే ఈ రోజు కంప్యూటర్‌లో ఏవో వెతుకుతూ వేమన ఫాంట్ వాడి చూసేను, నాకు ఎంతగా నచ్చిందంటే నిన్నే వుత్తరం రాసినా ఆపుకోలేక నీకు ఈ ఫాంట్ వుపయోగించి వుత్తరం రాస్తున్నాను. ఎలాను నిన్నటి వుత్తరం ఇంకో పది రోజుల దాకా నీకు రాదు కాబట్టి చెప్పిన విషయాలనే మళ్ళీ చెప్పొచ్చనే ధైర్యం కూడా వుందనుకో.

మాకు వచ్చే మంగళవారం ఎలెక్షన్స్ . నాకేమో ఈ మంగళవారం సెంటిమెంట్, వెళ్ళి వేసే వోటూ మంగళ వారమయ్యిందే అని పీకుతూ వుంటుంది, కాని అలా అని బుధవారమో సోమవారమో వెళ్ళి వోటు వేస్తాను అంటే వొప్పుకోరు కదా. ఈ సారి వోటు ఎవరికి వెయ్యాలో కాస్త ఇదమిద్దంగా తేల్చుకోలేక కష్టంగానే వుంది, ఏమి వుందిలే అటు ఆలోచించి ఇటూ ఆలోచించి చివరకు డెమోక్రాట్స్ కేగా అని నా మనవడు వెక్కిరిస్తున్నాడనుకో. చిన్నప్పటి మన మునిసిపల్ ఎలక్షన్స్ గుర్తు వచ్చి నవ్వు వస్తోంది నాకు వీళ్ళ హడావుడి చూస్తుంటే. గుర్తు వుందా మన వార్డ్ కౌన్సిలర్‌గా భ్రమరాంబగారు మన ఇంటికి వచ్చి కొబ్బరి నీళ్ళు తాగి, నమస్కారాలు పెట్టి, వోటు వెయ్యమని చెపితే రోజంతా మనం మేఘాల మీదే నడిచేము. మొన్న మా ఊరులో అదే పని ఘనంగా ఫండ్ రైజింగ్ ప్రోగ్రాం అని పెట్టి, భోజనాలు పెట్టి, డబ్బు అడిగి వోటు వెయ్యమని చెపితే ఆమె గుర్తు వచ్చి నవ్వుకున్నా.

తరువాత లాబీయింగ్‌లు చేసి, అదే రా మనవాళ్ళు హైదరాబాద్‌లో అసెంబ్లీల దగ్గర తెల్ల బట్టలు వేసుకుని రాజకీయ నాయకులతో మనకు ఏవైనా పనులుంటే చేయించుతారు కదా అలాంటి వాళ్ళు.... ఇక్కడ కూడా అలాంటి వాళ్ళు వుంటారు.. కాని వాళ్ళ ద్వారా మనమేమి పనులు చేయించుకోలేములే. కేపిటలిస్టిక్ దేశం కదా పెద్ద కంపెనీలకే అవకాశం... వాళ్ళకు కావల్సినదే చట్టం..

వాళ్ళకే మా టాక్స్ డబ్బులు.. అన్ని సవ్యంగా జరిగినంత కాలం సూట్ల గాంభీర్యం వెనుక, చార్టర్ ఫ్లైట్ల వెనుకగా గుట్టు చప్పుడూ కాకుండా సాగి పోయింది. ఇప్పుడేమో ఇలా రోడ్డుల కెక్కి గోల పడుతున్నారు. వచ్చే మంగళవారం మా రాష్ట్రానికి సంబంధించిన ఎలక్షన్స్ . చిత్రమేమంటే ఈ ఎలక్షన్స్‌లో ఒక్క మా వూరి, మా రాష్ట్రానికి సంభందించిన రిప్రజంటేటివ్‌లనే కాదు మా వూరి పోలీస్ చీఫ్, మా వూరి చీఫ్ మెజిస్ట్రేట్, మా వూరి మేయర్ అందరిని ఎన్నుకోవాలి. ఎవరు ఎవరో తెలియదు.. ఇలాంటి చిన్నవి పార్టీకి సంబంధం లేకుండా వ్యక్తులను బట్టి ఎన్నుకోవటం వుత్తమం. ఇక్కడ పార్టీలకు అతీతంగా వ్యక్తులకు సిద్ధాంతాలు నమ్మకాలు వుంటాయి కదా. నా మనవడి సిద్ధాంతం ప్రకారం మనం అసలైన రిపబ్లికన్స్‌మి, కాని డెమోక్రాట్స్‌కు వత్తాసు పలుకుతాము కేవలం వాళ్ళు వలస వచ్చిన వారి తరఫున సుముఖంగా వుంటారు అని ఒకే ఒక నమ్మకం వలన అని.

సరే ఈ గోల ఎప్పుడూ వుండేదే కాని నీ కబుర్లు ఏమిటి? పిల్లలు బాగున్నారా? ఇక్కడ సుధ వాళ్ళు అందరు బాగున్నారు. ఈ శెలవులలో ప్రపంచాన్ని చుట్టి రావాలని అనుకుంటున్నారు. అదే రా వర్‌ల్డ్ టూర్ .. మనవడిని కూడా తీసుకుని వెళుతున్నారు. జీవితాల పరుగులాటలో దొరికిన ప్రతి క్షణాన్ని వీళ్ళు సద్వినియోగం చేసుకున్నట్లు అనిపిస్తుంది నాకు. పోనీలే మేము చెయ్యలేని పని వీళ్ళు చేస్తున్నారు అనిపిస్తుంది నాకు. ఇక్కడకు వచ్చిన దగ్గర నుంచి సెటిల్ అవ్వటం కోసం, పైకి ఎదగటం కోసం, ఆ పైన పరపతి పెంచుకోవటం కోసం ఇలా ఏదో ఒక దాని కోసం వెతుకులాడటమే సరి పోయింది. ప్రతి దానిని డాలర్‌లలో రూపాయిలలో మార్చి చూసుకుని మనసును ఏమార్చి పిసినారి తనం కాదు పొదుపరి తనమని మురవటంతో జీవితం ఐపోయింది. కాని మనం అలా చేయబట్టే పిల్లల ఎదుగుదలలో సరి ఐన పాత్ర పోషించగలిగేము కదా.. ఇండియా ఎకానమీ విధానమే మరి మన జీవన విధానం కదా..

ఆరోగ్యాలు అంతంత మాత్రంగా వుండే కాలం కదా, అంత దూరం రాలేమని లక్ష్మి నేను తప్పించుకున్నాము ఈ ట్రిప్ . ఇంటిలో పనులు చక్కబెడుతున్నాము. ప్రస్తుతానికి మరి శెలవా.. వీలైనంత తొందరలో వుత్తరం రాయి. ఎదురు చూస్తుంటాము. పిల్లలకు నా ఆశీస్సులు.

నీ ప్రియ స్నేహితుడు
**కృష్ణ**

*ప్రియమైన కృష్ణ*

నీ వుత్తరం అందింది. అదే రా తంతుల ద్వారా పంపించిన వేగు. ఎన్నాళ్ళకు సాధించిన అభివృద్ధిని వీడూ వాడుకున్నాడు అని ఆశ్చర్యపోయాను, ఆనందించాను. గతించిన కాలాన్ని పట్టుకుని వేలాడక గమ్యమైన భవిష్యత్తులోకి జీవితం ఎలా సాగిపోతుందో అలానే మనం కూడా కొత్తలోని అనుభూతులను ఆస్వాదించాలి కాని ఇలానే పాతతనమే కావాలి అని మొండి పట్టు పట్టకరా అని ఎన్ని సార్లు చెప్పినా నీ పద్ధతి మార్చుకోవు కదా. గత పది సవత్సరాలు చూస్తే, మార్పు చాలా ఎక్కువ గా కనిపించే దేశాలలో మన దేశం మొదటి ఐదు దేశాలలో వుందట. అది మంచికా చెడుకా అని నువ్వు వాదన మొదలెట్టక. మార్పు ఎప్పుడూ మంచికే అనుకోవాలి.. ఎందుకంటే మంచి చెడు అనేవి ప్రామాణికాలు కావు కాబట్టి.

మొత్తానికి ప్రపంచంలో దేశమేదైనా మనుష్యుల రంగురూపులు వేరైనా స్వభావాలు ఒక్కటే అని అర్థం అయ్యింది నువ్వు రాసిన మీ ఎలక్షన్ గొడవ చూస్తే. ఐనా మొత్తంగా ఇక్కడికంటే పర్వాలేదులేరా రాజకీయాలు మీకు. మొత్తంగా వ్యక్తి గత ప్రయోజనం చూసుకున్నా... సమిష్టి, సమాజ ప్రయోజనం కూడా ఎంతో కొంత చూస్తారు అక్కడ. ఇక్కడ వ్యక్తి గత, కుటుంబ, కుల ప్రాతిపదికలమీదే నడుస్తున్నాయి రాజకీయాలన్ని. ఎందుకులే ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది వీటి గురించి. మీ దేశానికున్న

అధికార దాహం కనీసం కొంత వరకైనా మీకు మంచి చేస్తుందేమోలే... మొత్తానికి గాడిద, కుక్క, పంది వీటిలో ఏది మంచిదో ఎన్నుకోవటం తప్ప వీటన్నిటీని మించి జంతు వ్యవస్థ నుంచి మార్పును ఆశించలేక పోతున్నాము.

అవునురా కృష్ణ.... మన తరంలో ఇలా దేశాన్ని వదిలి వెళ్ళిన వాళ్ళందరికి జీవన విధానంలో వ్యక్తిగత మార్పును, దృక్పధాన్ని ఎంతో కొంత అలవరచుకోక పోతే కష్టమే.. ఇక్కడ ఇప్పుడు పూర్తిగా మార్పు రావటం వలన, అక్కడకు వచ్చే వారికి అన్నీ అందుబాటులో వుండటం వలన తొందరగా అలవాటు పడి వుండగలుగుతున్నారు కాని మొదటిలో మీరు పడిన అవస్తలు, సర్దుబాటులు మానసిక ముసలాలు అన్నీ గుర్తే నాకు. రంగుల అంతరాలు ఇప్పటికి వున్నా అప్పటిలో మీరు పడిన మానసిక వ్యధా నాకు గుర్తే. ఒక జీవితాన్ని ఆహ్వానించాక అందులోని వొడిదుడుకులను మరి తీసుకోక తప్పదు కదా. ఇక్కడ ఐనా మన తరానికి మార్పు తీసుకోవటం అలవాటు కాక పోతే చాలా కష్టమే.. నీకు తెలుసు కదా ప్రవాహపు వాలుతో వెళ్ళటం అందులో ముందు వుండటం నాకు అలవాటే కాని మీ చెల్లికి ఎంత కష్టమో.. రోజు ఇప్పటికీ సణుగుతూనే వుంటుంది. ఆ కాలమైతేనా, మన కాలంలో ఎక్కడన్నా చూసేమా ఇలాంటివి, ఇదే బ్రహ్మంగారు చెప్పిన కాలజ్ఞాన ప్రభావం అంటూ.

ఇక్కడ కూడా అంతా మారి పోయిందిరా. మార్పు వచ్చేప్పుడు అన్ని మంచి లక్షణాలనే తీసుకుని రాదు కదా.. నాణేనికి బొమ్మా బొరుసు వున్నట్లే ఈ మార్పుకూనూ. నువ్వన్నట్లు ఇండియా ఎకానమీనే మన జీవన విధానం అని, అంతరాలు ఇంకా పెరిగి పోతున్నాయి ఇక్కడ. ఆర్ధిక అంతరాలు తగ్గుతున్నాయి, సంపాదన ఖర్చుల నిష్పత్తి సరిసమానంగా వుండటం వలన కాని మానసిక అంతరాలు పెరిగి పోతున్నాయి. విద్వేషాలతో ఎంతగానో కుంచించుకుపోతున్న ఈ తరాలకు మందు ఏమిటో నాకు తెలియదు కాని ఇంకా పెనుమార్పు వచ్చి ఈ వ్యవస్తను తుడిచి పెడుతుందని బలంగా నమ్మే వాళ్ళలో నేనూ వున్నాను. పాతతనం వైపుకు పరుగెత్తటం కాదు పరిష్కారం, కొత్తలో పాతతరపు కొన్ని మానవీయ విలువలను పోగొట్టుకోకుండా స్థిర పరిస్తే చాలు. దానికి సరిగ్గా వ్యతిరేకం జరుగుతోంది ఇప్పుడు ఇక్కడ, ఏవైతే వేళ్ళూనుకుని పోయిన విష వూడలని మారాలనుకుంటున్నామో అవే ఇంకా కొత్త తనంలో కొత్త రంగులు వేసుకుని బల పడుతున్నాయి, పాత సారాయి కొత్త సీసాలో అంతే..

హ్మ్ .. ఏది ఏమైనా కాలమాగదు.. దానితో పాటే మనమూ... తుడిచిపెట్టుకుని వెళ్ళే కాల మహిమలో నూతన సౌందర్యాలను ఆహ్వానించటం తప్ప ఏమీ చేయలేని అశక్తులం. పిల్లలను అడిగేనని చెప్పు మనవడికి ముద్దులు.

ప్రేమతో
నీ స్నేహితుడు
మోహన్ .






## *బంగారు బాల్యపు క్షణమొకటి తిరిగి వాడి చేరినప్పుడు.*

**జగతీ,**

అసలు ఎక్కడా కనపడని నల్లపూసవు అయ్యావు. నా మీద అలకా లేక పరిగెత్తే కాలంలో మూగ పోతున్న మనసుకు పని చెప్పే ఓపిక లేకనా? ఏది ఏమైనా ఇలా అసలు పలకరించకపోతే ఎలా. మరి నువ్వు చేస్తున్నదేమిటి అంటావు కదు ఇప్పుడు, నిజమేలే అందరం అంతే... చిన్నప్పుడెప్పుడో మొదలెట్టిన పరుగులాట ఎప్పటికి ఆపుతామో తెలియదు, అసలు ఆపుతామో లేదో కూడా తెలియని ఈ ఆట లో మిగిలే ఒయాసిస్సులు స్నేహమే కదవే. చింటు, చిన్ను ఎలా వున్నారు? మొన్ననే మా ఇంటి పక్కకు కొత్తగా అద్దెకు వచ్చినవాళ్ళకు కూడా చిన్న పిల్లలు. చూస్తే మన పిల్లలే గుర్తు వచ్చారు. కాక పోతే ఒకటే తేడా, చిన్ను, చింటులను చూస్తే పెరటిలో ఎంతో ప్రేమగా పెంచే పువ్వులల్లే తాజాగా, అడవిలో స్వేచ్ఛగా పూచి విరగనవ్వే అడవి పూలల్లే ముద్దు గా వుంటారు. వీళ్ళను చూస్తే తోటమాలి అతి శ్రద్ధ తీసుకుని కత్తిరించి పెంచబడుతూ, ఒక్క ఆకు పక్కకు పోయినా తోటమాలి చేతిలో ఇంకో కత్తెరకు గురి కావాలని భయపడుతూ వొదిగి వుండే రంగుల క్రోటన్ మొక్కలల్లే వుంటారు. వాళ్ళను చూడగానే నాకు తెలియకుండానే నిట్టూర్పు ఒకటి పెదవులను దాటి వుస్సురంటూ బయటకు వస్తుంది.

ఎందుకు అలా ఆ అందమైన బాల్యాన్ని నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తున్నారు? మనం పొద్దున లేచిన దగ్గర నుంచి పిల్లలపై ఆ దాడి ఈ దాడి, బాల కార్మికులు అంటూ, అటు పైన వాళ్ళలో పెరుగుతున్న హింసాత్మక ధోరణులకు టీవీలను ఇంకా ఎవరినో నిందిస్తూ కాలం గడిపేస్తాము కాని, అసలైన దోషులైన ఈ తల్లి తండ్రులను శిక్షిస్తే ఈ అతివాద ధోరణుల పోకడ సగం తగ్గుతుంది. నిజం జగతీ..

నవ్వులాటకో పనిలేకో అనటం లేదు. నిద్ర లేవటంతోనో, పళ్ళు తోముకోటంతోనే మొదలయ్యే ఈ హింస రాత్రి మళ్ళీ పడుకునే వరకు జరుగుతూనే వుంటుంది. తల్లి తండ్రులు మంచే అని నమ్ముతూ చేస్తున్న ఈ హింస తరాల నుంచి రూపం మారినా అసలు వస్తువు మారలేదు కదా.

పిల్లల మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్పినట్లు మనిషి యొక్క మనస్తత్వం మొదటి ఆరు సవత్సరాలలోనే రూపొందితే ఈ ఆరు సంవత్సరాలు మనం చేస్తున్నది పూర్తి అరాచకం ఆ పైన అమానుషం కదా. మనకోసమే వాళ్ళు పుట్టినట్లు వాళ్ళమీద మన పెత్తనం అనధికారంగా గుత్తకు తీసుకున్నట్లు వాళ్ళమీద జరిపే హింస ఏ చట్టం కిందకు వస్తుందో. చిదుముతున్న ఈ దీపాలను చూస్తుంటే చాలా దిగులుగా వుంటుందే జగతీ. సంవత్సరం కూడా నిండకుండానే చదువు ఒక ఎత్తు ఐతే, ఆ చిన్ని బిడ్డల మీద చేయి ఎత్తి ఆ పసి కళ్ళల్లో భయాన్ని సృష్టించ గల ఈ గొప్ప తల్లి తండ్రులను చూస్తుంటే పిల్లలను కనటానికి వీళ్ళకు హక్కు ఎవరిచ్చారు అని నిలదీయాలని వుంటుంది దేవుడిని. పసి నుంచే అబద్దాలు చెప్పించటం, వాళ్ళకు తెలియని అక్కర్లేని విలువలను మనసులో నాటటం, భయంతో విషయాలను బుర్రకెక్కించటం ఇవి ఏమి నాకు తెలిసిన నా స్నేహితురాలిగా నువ్వు చెయ్యవనే అనుకుంటున్నా జగతి.

ఇంకా ఏమిటిరా కబుర్లు. ఇలా మాట్లాడుతుంటే కృష్ణ నవ్వుతాడు నన్ను చూసి ఇలా ఇంటి పక్క పిల్లల గురించి ఎవరి దోడ్లోనో పూచిన గులాబి మొక్క కొచ్చిన చీడ గురించి ఆలోచిస్తావే వెర్రా అని. వెర్రి కాదు జగతీ ఈ నాటి బాలలే రేపటి మన భవిష్యత్తు అని ప్రతి ఒక్కరు ఒప్పుకుంటారు కాని ఆ భవిష్యత్తుకు డబ్బు అనే ఒకే ఒక విషయం మూలంగా ఆనందమొస్తుందని దానికోసమే ఏదైనా చెయ్యాలి అని జీవిత ప్రమాణాలను మార్చి నూరి పోస్తూ అది విపత్కర పరిస్తితి కాదు దాని గురించి విచారపడొద్దు అన్న తనకా నాకా వెర్రి నువ్వు చెప్పు.

ఆలోచన లేని ఆవేశమెంత అనర్థమో, ఆవేశం లేని ఆలోచనా అంతే నిరుపయోగమని మన సత్యం మాష్టారు చెప్పిన మాటలే గుర్తు లేనట్లు మాట్లాడతాడు కృష్ణ. హ్మ్.. మాములేగా మాకీ గోల అంటావా. సరే మరి నీ పతీ, పుత్ర, పుత్రికా రత్నాలందరిని టోకున టన్నుల లెక్కన అడిగేనని చెప్పు మరి.

**ప్రేమతో,**

**రాజి.**

●●●

**ప్రియమైన రాజి,**

నువ్వు అడిగిన టన్నుల లెక్కల పలకరింపుల ప్రేమ వర్షంలో మునిగి ఇప్పుడే లేచి తేరుకుని వుత్తరం మొదలు పెట్టే సరికి కాస్త ఆలస్యం అయ్యింది, ఆలస్యానికి కోపగించుకుంటావని చింటూకు చెపుతూనే వున్నా మీ పిన్ని లెక్కలలో టాప్‌రా, లెక్కకు లెక్క సరి చేస్తుంది. వుత్తరానికి సమాధానం రాలేదని అక్కడ లెక్క సిద్ధం చేసే వుంచి వుండి వుంటుంది అని, విన్నాడా... పిన్ని లెక్కలలో ఐతే నేను సమ్మోహనాస్త్రాలతో కట్టేసే కెమిస్ట్రీలో డిగ్రీలతో పుట్టా అంటున్నాడే, మొన్న వుత్తరం రాయాలని కూర్చుంటే కాగితం సగం తినేసాడు మిగతా సగం ఎందుకులే చెపితే బాధ పడతావు.. లోపలకు వెళ్ళి పాల సీసా తెచ్చేసరికి, ఈ పెద్దదేమో చీమిడి ముక్కేసుకుని వాడి లీలలు పరవశంతో చూస్తుంటుంది, ఆ వేలెడంత దాని మనసులో తన చిన్నప్పటి లీలలు లీలామాత్రంగా తోచి చిన్నతనాన్ని మిస్ అయ్యినట్లు వుంటుందేమో దానికి అనుకుంటా నేను దాని మొహం చూసినప్పుడల్లా.

నీకు మాములు గానే జీవ కారుణ్యం ఎక్కువ ఇక నీ దగ్గర నుంచి వచ్చే వుత్తరాలలో ఇలా కరుణ రసం, ఆవేదనా భరితాలు నిండి వుంటాయి కాబట్టి ఏమి విసుక్కోలేదే నీ బాధ అర్ధం అయ్యింది.

బంగారు జీవితానికి జీవన ప్రమాణాలు ఇవి అని ఎవరికి వారు నిర్వచించుకోవాలే కాని, ఇది సరి... అది సరికాదు అని ఎలా చెప్పగలం, నువ్వన్నట్లు ఆ తల్లి తండ్రులు పిల్లల మంచి కోసమే ఆ పనులన్నీ చేస్తున్నామని ఎంతో గాఢంగా నమ్ముతారు. ఇంకా చిత్రమేమిటంటే మనుష్యులు పెద్ద అయ్యే కొద్ది ఒకప్పటి తాము లేనేలేనట్లు, పుట్టటంతోనే విపరీతమైన విజ్ఞానంతో పుట్టినట్లు అనుకుంటారు. ఒకప్పుడు ఇవి అన్ని మనం దాటిన స్థితులే, అప్పట్లో మన మనోస్తితి ఎలా వుండేది అని తలచుకోరనుకుంటా, లేకపోతే గుర్తు వుండదో. పిల్లలను పెంచటం అనేది అమ్మో నిజంగా ఒక శాస్త్రమే, కాని దానికో మార్గముంది తేలికగా అర్ధం చేసుకోవటానికి. వాళ్ళకు మనం పెత్తందారులం కాదు జవాబుదారులం అంతే అని అర్ధం చేసుకోవటంతో మొదలెట్టి వాళ్ళు మనకొక భాద్యత కాదు మన విధి అని నమ్మి ప్రేమిస్తే చాలు. చెప్పినంత తేలిక కాదు, కాని మనస్పూర్తిగా వీటిని నమ్మితే చాలా తేలిక.

హ్మ్ ఈ గోల కేమి కాని నువ్వెలా వున్నావు? నీ కబుర్లేమి? దొడ్లో మొక్కలన్నీ బాగున్నాయా? మొన్న అరటి పిలక గెల వేస్తోంది అన్నావు ఈ పాటికి హస్తాలు పండి పోయి కూడా వుంటాయి అనుకుంటున్నా. మా దొడ్లో మొన్న పెట్టిన విరజాజి అంటు కుదురుకుని మారాకులేస్తోంది. చాలా సంతోషంగా వుంది చూస్తుంటే. ఇంకా పెరుగుతుంది కొన్ని తుంచేయమంటేనే ఎంతో బాధగా వుంటుంది ఇక పిల్లల మీదకు చేయినెత్తే నిర్భాగ్యుల మనఃస్తితి ఏమని తలచుకోగలం చెప్పు. పగలు రాత్రి ఈ వినీలాకాశాన్ని నీలపు తునకలుగా తెంపి పోసే తెల్లటి మేఘాల మాలలన్నిటి మీదా పిల్లల నవ్వులే. రాత్రి ధగ ధగ లాడే శుక్రవర్ణం వొలకపోసే లేత నారింజ వర్ణాలు తెల్లారేక తూరుపు గూట్లో ఏరుకుంటుంటే, చిన్ను గాడు పొద్దుటే వొలకపోసి కారప్పూస ఏరుకుంటున్న క్షణమే గుర్తొస్తుంది.

మధ్యాన్నం ఎలానో తీరిక చేసుకుని వుత్తరం రాద్దామనుకుంటానా చింటూ గాడికి ఎలా తెలుస్తుందో పక్క మీద నెమ్మదిగా కదిలి ఒక చిరునవ్వు వలను విసిరి నన్ను పిలుస్తాడు, ఆ లేత బుగ్గల అంచున గులాబి వర్ణాల ఇంద్రధనస్సు పెల్లుబికి ఆ కొనల సాయంత్రం పూయబోతున్న చంద్రకాంతపు పువ్వొకటి ఫక్కున నవ్వుతుంది. ఇంకేమి చెయ్యగలను నేను చెప్పు. రెండో పిల్ల కూడా పెద్దది అవుతున్నా నాకు ఇప్పటికీ  చందు నిద్రలో చెయ్యి చాపి నాకోసం తడుముకుంటుంటే పనులన్నీ ఆపి వెళ్ళి గిల్లాలనిపిస్తుంది ముద్దుగా. తననే మళ్ళీ మాడు పగిలేట్టు తింగిరి సమాధానమొకటి ఇచ్చి విసిగించాలని కూడా వుంటుంది అనుకో. ఇన్ని పనుల మధ్య ఒక్కోసారి నీ వుత్తరం కాస్త ఆలస్యమైనా దాని అర్ధం నువ్వు నా మనసులో లేవని కాదురా బుజ్జి, నువ్వు సదా నా మనసులో భద్రం, నీ వక్కడ క్షేమమనే తలపొకటి ఇచ్చే శాంతి మనసును జోకొట్టి నిద్ర పుచ్చేస్తూ వుంటుంది అందుకే ఆలస్యం, అంతే. మన్నిస్తావు కదు మరి.

ప్రేమతో

**జగతి.**